SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL
ILLUSTRATED MONTHLY
Volume: 53, Issue: 4
September-2022, Price Rs.20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

సెప్టెంబరు 2022
వెల రూ. 20/-
పుటలు-56



27-09-2022
మంగళవారం
ధ్వజారోహణం

## తిరుమల
## శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

2022 సెప్టెంబరు 27 నుండి అక్టోబరు 05 వరకు

తిరుమల తిరుపతి దేవస్థానములు

## విజ్ఞప్తి

'సప్తగిరి' పట్ల మీరు చూపిస్తున్న అభిమానం అనన్యసామాన్యం.

తి.తి.దే.కి, పాఠకులకు మధ్య వారధిలా ఉన్న 'సప్తవర్ణ' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక.


## 'సప్తగిరి' పత్రిక వెలలో మార్పు

మీ ఇంటికే శ్రీవారు వచ్చిన అనుభూతిని పొందండి.

'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రికకు చందా కట్టండి.



శ్రీవారి అక్షర ప్రసాదాన్ని నెలనెలా అందుకోండి.



# సప్తగిరి



ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

(తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఆంగ్లం, సంస్కృత భాషలు)

..... చందా వివరాలు ......

విడిప్రతి: రూ.20/-

సంవత్సరచందా: రూ.240/-

జీవితచందా (12 సం॥లకు మాత్రమే): రూ.2400/-


విదేశాలకు సంవత్సరచందా: రూ. 1030/-

వెలలో మార్పు సెప్టెంబరు, 2022 నుండి అమలులోకి వచ్చింది.
నూతన చందాదారులకు మాత్రమే ఈ మార్పు వర్తిస్తుంది.

వివరాలకు:

ప్రధాన సంపాదకుడు, తి.తి.దే. ప్రెస్ ప్రాంగణం, కే.టి.రోడ్డు, తిరుపతి - 517 507.

ఫోన్: 0877-2264363, 2264543.



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : కులక్షయే ప్రణశ్యన్తి కులధర్మాస్సనాతనాః ।**
**ధర్మే నష్టే కులం కృత్స్నమధర్మోఽ భిభవత్యుత ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 40వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** కులక్షయే= వంశము నశింప; సనాతనః= అనాదిగా(వంశపరంపర) వచ్చుచున్న; కులధర్మాః= కులధర్మములు; ప్రణశ్యన్తి= నశించుచున్నవి; ధర్మేనష్టే= ధర్మమునశింప; కృత్స్నమ్= సమస్తమైన; కులమ్= కులమును; అధర్మః= అధర్మము; అభిభవతి ఉత= వ్యాపించును గదా!!

**భావం:** కులము నశించుటచే అనాదిగవచ్చు కులధర్మములు అంతరించిపోవును. ధర్మము నశించుటచే కులమంతటను అధర్మము వ్యాపించును.

## నానా దిక్కుల నరులెల్లా...

నానా దిక్కుల నరులెల్లా
వానలలోననె వత్తురు గదలి

సతులు సుతులుఁ బరిసరులు బాంధవులు
హితులు గొలువఁగా నిందరును
శతసహస్రయోజనవాసులు సు
వ్రతములతోడనె వత్తురు గదలి

ముడుపులు జాళెలు మొగిఁ దలమూఁటలు
కడలేనిధనముఁ గాంతలును
కడుమంచిమణులు కరులుఁ దురగములు
వడిగొని చెలఁగుచు వత్తురు గదలి

మగుటవర్ధనులు మండలేశ్వరులు
జగదేకపతులుఁ జతురులును
తగువేంకటపతి దరుశింపఁగ బహు
వగలసంపదల వత్తురు గదలి

(సంపుటం-1, సంకీర్తన-346)





*ఎడతెగక వానలు కురుస్తున్నా... అన్ని దిక్కులనుండి భక్తులు శ్రీవేంకటేశ్వరస్వామి వారి సందర్శనానికి కదలివస్తారు. వారు ఆలుబిడ్డలతో, బంధుజనాలతో సుదూర ప్రాంతాలనుండి దీక్షతో బయలుదేరివస్తారు. ముడుపులతో, తలమూటలతో వెలలేని ధనాలని వెంటగొని వస్తారు. రాజులు, మహరాజులు ఒకరేమిటి లోకనాయకులందరూ... శ్రీనివాసుని దర్శనార్థమై కదలివస్తారంటూ.. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులను ఉద్దేశించి అన్నమయ్య పాడినపాట ఇది.*


*కలియుగవేంకటేశ్వరునిపేరు తలవగానే మనకు జ్ఞప్తికి వచ్చేది '**లడ్డుప్రసాదం**'. ఆయన పేరులాగే లడ్డుకూడా అత్యంత ప్రసిద్ధి చెందింది. తిరుమలలో ఎన్నోరకాలప్రసాదాలు లభ్యం అవుతాయి. కాని వాటికి అంత ప్రముఖస్థానం లభించలేదు అని చెప్పటం అతిశయోక్తికాదు. తిరుమలలో చేసే అన్ని కైంకర్యాలు ఆగమశాస్త్రానుసారం జరుగుతాయి. అలాంటి పరమ పవిత్రమైన ప్రసాదాలలో ముఖ్యమైన లడ్డుచరిత్రను తెలుసుకుందాం....*

# ప్రసాదాల్లో.. లడ్డూ ప్రసాదం వేరయా!!

– డా॥ దేవులపల్లి పద్మజ, 98496 92414

సంస్కృతంలో లడ్డుకము, లాడుకము, లట్టికము అనీ; తెలుగులో లడ్డుకము, లడ్డువము, లడ్వము అనీ; తమిళంలో ఇలట్టు, లట్టు, లట్టుక, లడ్డుక, లాటు అనీ పిలుస్తారు. 12వశతాబ్ది మానసోల్లాసగ్రంథంలో దీని ప్రస్తావన ఉంది. స్వామివారికి నివేదించే ప్రసాదాలు ఎక్కువకాలం నిల్వఉండకపోవటంతో దూరప్రాంతాలనుంచి వచ్చే భక్తులు కొంతఅసౌకర్యాన్ని పొందేవారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ లడ్డు తయారుచేసేవిధానాన్ని రూపొందించారు. శ్రీవారి లడ్డువయస్సు దాదాపు 306 సంవత్సరాలు. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే 1715, ఆగస్టు 2వతేదీ లడ్డుయొక్క జన్మదినం. లడ్డు 1715వసంవత్సరానికి పూర్వమే ఉందని కొన్నిశాస్త్రాలలో ఉన్నప్పటికి సరైన ఆధారాలు లభ్యం కాలేదు. లడ్డు బాల్యావస్థలో బూందీగా రూపుదాల్చింది. ఈస్ట్ఇండియాకంపెనీ ఆధ్వర్యంలో మహంతులు తిరుమలఆలయనిర్వహణ చూసేరోజుల్లో 19వశతాబ్ది మధ్యభాగంలో తీపిబూందీ ప్రవేశపెట్టారు. బియ్యంపిండి మరియు బెల్లం కలిపి లడ్డును మొదట్లో తయారుచేసేవారు. తర్వాత 1940వ సంవత్సరంలో అది ఇప్పటిలడ్డుగా రూపుదిద్దుకుంది. స్వామివారిలడ్డూలో తయారుచేసే పదార్థాలకు "దిట్టం"అని పేరు. ప్రసాదం తయారుచేసేస్థలానికి "పోటు" అని పేరు. ప్రస్తుతం రోజుకు దాదాపు లక్షలడ్డులవరకు తయారుచేస్తున్నారు.

ఈ మధురమైన లడ్డూలో ఆస్థానంలడ్డు, కల్యాణోత్సవంలడ్డు, ప్రోక్తం లడ్డు అనేరకాలు ఉన్నాయి. ఆస్థానంలడ్డును ప్రత్యేకఉత్సవాలసందర్భంగా తయారుచేస్తారు. వీటిని ప్రముఖులకు మాత్రమే అందజేస్తారు. కల్యాణోత్సవంలడ్డును నిత్యం ఈ ఉత్సవం జరిపించుకునే భక్తులకు అందజేస్తారు. ప్రోక్తంలడ్డును మిగిలిన సాధారణభక్తులకు అందజేస్తారు. ప్రస్తుతం కల్యాణంలడ్డునుకూడా అందరికి విక్రయిస్తున్నారు.



స్వామివారికి నివేదించే అన్ని పదార్థాలను సంపంగిప్రాకారం ఉత్తర భాగంలో తయారుచేస్తారు. వీటిని ప్రథమంగా స్వామివారితల్లి వకుళ మాతవద్దకు తీసుకువెళ్ళి, అక్కడనుండి స్వామివారి నివేదనకు తీసుకు వెళతారు. ఇంతటి మాధుర్యాన్ని, ప్రముఖస్థానాన్ని సంపాదించుకున్న లడ్డుకు "**జియోగ్రాఫికాల్పేటెంట్**" కూడా ఉంది అని తెలిస్తే మనకు ఎంతో ఆనందం కలుగక మానదు. దీనివలన ఈ లడ్డు తయారీ విధానాన్ని మరొకరు అనుకరించటానికి వీలుండదు. ఇంతటి మాధుర్యలడ్డుకు మనం జేజేలు పలుకుదాం. తిరుమల స్వామివారిని దర్శించుకొని, లడ్డును భద్రపరచుకొని భక్తులు ఆనందంగా తిరిగి వారి స్వస్థలాలకు వెళతారు. అపురూపంగా ఈ లడ్డును అందరికి పంచి, చాలాకాలం కొద్ది, కొద్దిగా స్వీకరిస్తూ, స్వామివారికి ధన్య వాదాలు తెలుపుకుంటారు.

ఓం నమో వేంకటేశాయ

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 53 సెప్టెంబరు, 2022 సంచిక : 04



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| ప్రసాదాల్లో... లడ్డూప్రసాదం వేరయా!! | డా॥ దేవులపల్లి పద్మజ | 04 |
| తిరుమలస్వామికి.. నిత్యపూజలివిగో... | ఆర్.శ్రీనిహారిక | 07 |
| నీ సన్నిధే... నాకు పెన్నిధి! | డా॥ మైలవరపు లలితకుమారి | 11 |
| అంగరంగ వైభవంగా... | శ్రీ వద్దిరాజు జనార్దనరావు | 13 |
| వేయికన్నులున్నా... చాలవు!! | శ్రీ జూలకంటి బాలసుబ్రమణ్యం | 15 |
| వైష్ణవాగమం అంటే...?? | శ్రీ చాకిచర్ల నాగసుదర్శన్‌రావు | 17 |
| ఎంతవారలైన భగవంతుడి దాసులే! | మల్లాది శృతకీర్తి | 19 |
| ఇతనికంటె... ఘనులిక లేరు!! | డా॥ పులిగడ్డ విజయలక్ష్మి | 21 |
| ప్రతిరోజూ.. కల్యాణమే!! | శ్రీ అర్చకం రామకృష్ణదీక్షితులు | 23 |
| ఇలవైకుంఠమే ఇది!! | ఆచార్య హెచ్.ఎస్.బ్రహ్మానంద | 25 |
| సదా.. శ్రీవారిసేవలో..!! | శ్రీ కర్రి భాస్కరరావు | 31 |
| గోవిందుడికే పాలిచ్చిన గోవు | డా॥ యస్.పద్మావతి | 35 |
| అలా మొదలై... ఇలా జరుగుతున్నాయి!! | ఆచార్య కె.వి.రాఘవాచార్య | 37 |
| శ్రీమద్భగవద్గీత | ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ | 40 |
| నమ్మినోళ్లకి నమ్మినంత!! | శ్రీమతి పి.వి.ఎస్.లక్ష్మి | 41 |
| తిరుప్పేర్‌నగర్ (కోవిలడి) (అప్పక్కుడత్తాన్) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 42 |
| మనిషిపోతే రాడు (విశ్వదాభిరామం) | కీ.శే. విద్వాన్ కట్టానరసింహులు | 44 |
| ఒకే ఒక్కడు (భాస్కరశతకం) | పి.ఉషాలక్ష్మి | 44 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 45 |
| ఈ అమావాస్యకి ఓ ప్రత్యేకతుంది!! | డా॥ పి.లలితవాణి | 46 |
| శ్రీకృష్ణుని అపూర్వమైత్రి (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| మా అమ్మ చెప్పింది!! | శ్రీ ద్రోణంరాజు రామకృష్ణ | 50 |
| బాలవినోదం | నిర్వహణ: శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి | 51 |
| క్విజ్ (02) | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |

ముఖచిత్రం : తిరుమల శ్రీవారి ధ్వజారోహణసేవ
వెనుకచిత్రం : తిరుమల శ్రీవారి పెద్దశేషవాహనసేవ

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333



వెబ్‌సైట్- www.tirumala.org; 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# అక్షరపరబ్రహ్మాసిరి 'సప్తగిరి'

*'వార్తయందు జగము వర్తిలుచున్నది'*- అన్నారు ఆదికవి నన్నయ. కాగితం, ముద్రణా యంత్రాలు తదితర ఆధునికపద్ధతుల ఆవిష్కరణకు ముందే వార్తలప్రాముఖ్యాన్ని గుర్తించారు మనవారు. ఏపత్రికకైనా జవం, జీవం పాఠకులే. పాఠకాదరణ పొందిన పత్రికలే పదికాలాలు పచ్చగా ఉంటాయి. పాఠకుల ఆలోచనాసరళిని, అవసరాలను గుర్తించి పత్రికలు ముందుకుపోవాలి. అలాగే నచ్చినపత్రికను పాఠకులే పచ్చగా నిలబెట్టుకోవాలి.

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామివారిసన్నిధిలో జరిగే వివిధసేవలను, విషయాలను, తిరుమలవిశేషాలను, ఆధ్యాత్మికధర్మప్రచారాన్ని ఆశించి తిరుమలతిరుపతిదేవస్థానం సప్తగిరిని 1949లో బులెటిన్‌గా ప్రారంభించింది. అలా ప్రారంభమైన ఆ బులెటిన్ అలా అలా తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఆంగ్లం, సంస్కృతభాషలలో 1970 సప్తగిరిమాసపత్రికగా మారి మీ అందరికీ అందుబాటులోకి వచ్చింది. నాటినుంచి నేటివరకు అవిశ్రాంతంగా తన శక్తిమేరకు సప్తగిరిపాఠకులకు కావలసిన ఆధ్యాత్మికవ్యాసాలు, శ్రీవారిలీలలు, తిరుమలవిశేషాలు, శ్రీవారిసేవల వివరాలు అందిస్తూంది. అపూర్వమైన మీ ఆదరణకు నోచుకుంది. సప్తగిరిపట్ల మీరు చూపిస్తున్న అభిమానం అనన్యసామాన్యం.

తిరుమలతిరుపతిదేవస్థానానికి పాఠకులకు మధ్యవారధిలాఉన్న సప్తగిరిమాసపత్రికను మరింత అందంగా, మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నాం. పత్రికకు వాడుతున్న కాగితంలో నాణ్యతపెంపు, సప్తవర్ణపుటలతో సచిత్రమాసపత్రికగా ముద్రిస్తున్న విషయం మీరు గమనించే ఉంటారు. ఈ కారణాలవల్ల సప్తగిరిముద్రణవ్యయం అంతకంతకు పెరుగుతోంది. అందువల్ల ఈ సెప్టెంబరు మాససంచికనుంచే సప్తగిరిధరను విడిప్రతి రూ.20/-లు, సంవత్సరచందా రూ.240/-లు మరియు జీవితచందా(12 సం॥లకు) రూ.2,400/-లు, విదేశాలకు సంవత్సరచందా రూ.1030/-లుగా నిర్ణయించడమైనది. గతంలో చందా చెల్లించినవారికిమాత్రం చందా పూర్తయ్యేవరకు పాతధరకే సప్తగిరిని పంపిస్తాం. కొత్తగా చందాదారులయ్యేవారికే ఈ పెంపుదల వర్తిస్తుంది. ఒక్కసారి జీవితచందా చెల్లిస్తే సప్తగిరి నెలనెలా వారికందుతూనే ఉంటుంది. మా ఈ ప్రయత్నానికి మీరు చేయూతనివ్వాలని మీ పత్రికను ఆదరించి ప్రోత్సహించాలని కోరుకుంటున్నాం.

- - - - -

ఆకోవలోనే ఈ సెప్టెంబరునెల 27 నుండి అక్టోబరు 05 వరకు తిరుమలలో కొలువైఉన్న శ్రీవేంకటేశ్వరస్వామికి అంగరంగవైభవంగా బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయి. అందులోభాగంగా శ్రీమలయప్పస్వామి ప్రతిరోజూ వివిధవాహనాలపై, రకరకాలఆభరణాలు, పుష్పాలతో అలంకరింపబడి నాలుగుమాడవీథులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. కరోనాకారణంగా గత రెండుసంవత్సరాలుగా తిరుమలస్వామికి ఏకాంతంగా బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈసారి భక్తులు ప్రత్యక్షంగా నాలుగుమాడవీథులలో స్వామి వాహనసేవలు చూసేందుకుగాను తి.తి.దే. మళ్లీ శ్రీకారం చుట్టింది. కాబట్టి మనమందరమూ రెండుసంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఈ శుభతరుణాన్ని వృథాపోనీయక తిరుమలకు తరలివచ్చి స్వామివారి వాహనసేవలన్నింటినీ కనులారా తిలకించి స్వామి అపారకరుణా కటాక్షసిద్ధిని పొందుదాం. అలాగే స్వామివారి 'మానసపుత్రిక' 'సప్తగిరిని' కూడా సమాదరించి భగవంతునికృపకు పాత్రులవుతారని ఆశిస్తున్నాం!!

# తిరుమలస్వామికి.. నిత్యపూజలివిగో..

– ఆర్.శ్రీనిహారిక, 98497 47596



వైఖానస ఆగమసూత్రాలను అనుసరించి తిరుమలలో శ్రీవారికి రోజుకు ఆరుసార్లు పూజలు జరుగుతాయి. అవి ప్రత్యూష, ప్రభాత, మధ్యాహ్న, అపరాహ్ణ, సాయంకాల, రాత్రిపూజలు. తెల్లవారు జామున జరిగే సుప్రభాతసేవ ప్రత్యూషపూజలకు నాంది.

## సుప్రభాతం

నిత్యం స్వామివారికి జరిపించే ప్రప్రథమసేవ ఇదే. నిత్యం తెల్లవారుజామున మూడుగంటలకు సుప్రభాతసేవ మొదలవుతుంది. అంతకుముందే... ఆలయఅర్చకులు, జియ్యంగార్లు, ఏకాంగులు, శ్రీనివాసుడి అనుగ్రహంపొందిన యాదవవంశీకుడు (సన్నిధి గొల్ల) దేవాలయంవద్దకు వస్తారు. నగారామండపంలో గంట మోగుతుంది. మహాద్వారం గుండా సన్నిధిగొల్ల ముందు వెళుతుండగా అర్చకులు ఆలయంలోకి ప్రవేశిస్తారు. కుంచెకోలను, తాళంచెవులను ధ్వజస్తంభందగ్గరున్న క్షేత్రపాలకశిలకు తాకించి ఆలయ ద్వారాలు తెరిచేందుకు క్షేత్రపాలకుడి అనుమతి తీసుకుంటారు. సుప్రభాతం చదివే అధ్యాపకులు, తాళ్లపాక అన్నమాచార్యులవారి వంశీకుడు తంబురా పట్టుకుని మేలుకొలుపు పాడేందుకు సిద్ధంగా ఉంటారు. బంగారువాకిలి తలుపులు తెరిచిన సన్నిధిగొల్ల దివిటీతో ముందుగా లోపలికి వెళతాడు. వెంటనే అర్చకులు కౌసల్యా సుప్రజారామ... అంటూ శ్రీవేంకటేశ్వర సుప్రభాతం పఠిస్తారు. ఆ తర్వాత శ్రీవేంకటేశ్వరస్తోత్రం, ప్రపత్తి, మంగళాశాసనం ఆలపిస్తారు. ఇదేసమయంలో తాళ్లపాకవంశీకుడు తంబురా మీటుతూ, గర్భాలయంలో కొలువై ఉన్న శ్రీవారిని మేల్కొలుపుతాడు. అర్చకస్వాములు అంతర్ద్వారం తలుపులు తెరిచి గర్భగుడిలోకి వెళ్లి శ్రీవారి పాదాలకు నమస్కరించి నిద్రిస్తున్న స్వామివారిని మేల్కొలుపుతారు. పరిచారకులు స్వామివారిముందు తెరను వేస్తారు. ప్రధానఅర్చకులు శ్రీవారికి నైవేద్యంపెట్టి, తాంబూలం సమర్పించి నవనీతహారతి ఇస్తారు. మంగళాశాసనపఠనం పూర్తవగానే తలుపులు తెరచి మరోసారి స్వామివారికి కర్పూరహారతి ఇచ్చి భక్తులను లోనికి అనుమతిస్తారు. ఆ సమయంలో భక్తులకు లభించే దర్శనాన్ని విశ్వరూపదర్శనం అంటారు.



## శుద్ధి

సుప్రభాతసేవ అనంతరం తెల్లవారు జామున మూడున్నరనుంచి మూడుగంటల నలభైఐదునిమిషాలదాకా ఆలయశుద్ధి జరుగుతుంది. శుద్ధిలో భాగంగా గతరాత్రి జరిగిన అలంకరణలు, పూలమాలలు అన్నిటినీ తొలగించి, వాటిని సంపంగి ప్రదక్షిణంలో ఉండే పూలబావిలో వేస్తారు.

## అర్చన

శ్రీవారికి ప్రతిరోజూ తెల్లవారుజామున జరిగే ఆరాధన ఇది. దీనికోసం జియ్యం గారు యమునోత్తరై(పూలగది)నుంచి పుష్ప మాలలు, తులసిమాలలతో ఉన్న వెదురు గంపను తన తలపై పెట్టుకుని శ్రీవారి సన్నిధికి తెస్తారు. అర్చనకు ముందు పురుష సూక్తం పఠిస్తూ భోగశ్రీనివాసమూర్తికి ఆవు పాలు, చందనం, పసుపునీళ్లు, గంధపు నీటితో అర్చకులు అభిషేకం చేస్తారు. చివరగా పుష్పాంజలి. అనంతరం భోగ మూర్తి విగ్రహాన్ని తిరిగి జీవస్థానానికి చేరుస్తారు. ప్రోక్షణచేసి మూలవిగ్రహానికీ, భోగమూర్తికీ స్వర్ణసూత్రాన్ని కలుపుతారు. ఈ సూత్రంద్వారానే ధ్రువబేరంనుంచి భోగశ్రీనివాసుడివిగ్రహానికి శక్తి ప్రసరిస్తుం దని భక్తులనమ్మిక. ఆ తర్వాత మూలవిగ్ర హానికి పుష్పన్యాసం చేసి, అలంకారాసనం సమర్పిస్తారు. అనంతరం నామధారణ. కర్పూరంతో శ్రీవారినుదుటిమీద ఊర్ధ్వ పుండ్రచిహ్నాన్నిదిద్దుతారు. యజ్ఞోపవీతాన్ని అలంకరిస్తారు. తర్వాత శ్రీవారిసువర్ణ పాదాలను(తిరువడి) స్నానపీఠంలో ఉంచి అభిషేకిస్తారు.

## తోమాలసేవ

తమిళంలో 'తోడుత్తమాలై' అంటే దారంతో కట్టిన పూలమాల అని అర్థం. బహుశా ఈ మాటే కాలక్రమేణా మార్పు లకు లోనై 'తోమాల.. తోమాలసేవ అయి



ఉండవచ్చు. దీన్నే భగవతీఆరాధన అని కూడా అంటారు. ఈ సేవలో భాగంగా స్వామివారిని పూలమాలలతో అలంకరి స్తారు. వారంలో ఆరురోజులు శుద్ధి అనం తరం ఈ సేవ జరిపిస్తారు. శుక్రవారం నాడు మాత్రం అభిషేకం జరిపించిన తరువాత తోమాలసేవ చేస్తారు.

## కొలువు

తోమాలసేవ తర్వాత పదిహేనునిమి షాలపాటు తిరుమామణిమంటపంలో



కొలువుశ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో దర్బార్ జరుగుతుంది. బలిబేరానికి రాజో చితమర్యాదలు జరిపి ఆనాటి గ్రహ సంచారక్రమాన్ని, ఆరోజు జరిపించబోయే ఉత్సవవిశేషాలగురించి విన్నవిస్తారు. ముందురోజు హుండీ ఆదాయం వివ రాలను ఏయేనోట్లు ఎన్ని వచ్చిందీ, నాణేలు సహా (డినామినేషన్‌ప్రకారం) మొత్తం విలువ తెలియజేస్తారు. అనంతరం నువ్వులు, బెల్లంకలిపి దంచిన పిండిని నైవేద్యంగా సమర్పిస్తారు.

## సహస్రనామార్చన

ఉదయం 4.45నుంచి 5.30వరకు సహస్రనామార్చన జరుగుతుంది. బ్రహ్మాండ పురాణంలోని స్వామివారి వేయినామా



లనూ స్తుతిస్తూ చేసే అర్చన ఇది. ఈ అర్చన పూర్తయ్యాక శ్రీవారిపాదాలమీద ఉన్న పువ్వులు, తులసిదళాలతో శ్రీవారి దేవేరులకు పూజచేస్తారు. ఈ సమయంలో మిరాశీదారు వరాహపురాణంలోని

లక్ష్మీసహస్రనామాలను పఠిస్తారు. తర్వాత నక్షత్రహారతి, కర్పూరహారతి ఇస్తారు.

## మొదటిగంట, నైవేద్యం

మేలుకొలుపులు, అభిషేకాలు, కొలువు కూటం అన్నీ అయిన తర్వాత స్వామివారి కది నైవేద్యసమయం. నైవేద్యసమర్పణకు ముందుగా శయనమంటపాన్ని శుభ్రం చేసి, బంగారువాకిలి తలుపులు మూసేస్తారు. తిరుమామణిమంటపంలోని గంటలు మోగిస్తారు. అర్చకులు మాత్రం లోపల ఉండి స్వామివారికి పులిహోర, పొంగలి, దద్ధ్యోదనం, చక్కెరపొంగలి (అన్నప్రసాదాలు), లడ్డు, వడలు, అప్పాలు, దోసెలు, పోళీలు (పిండివంటలు) కులశేఖరపడి (పడికావలి)కి ఇవతల ఉంచి సమర్పిస్తారు.

## అష్టోత్తరశతనామార్చన

ఈ అర్చనతో మధ్యాహ్నపూజలు ప్రారంభమవుతాయి. వరాహపురాణంలో ఉన్న శ్రీవారి నూటఎనిమిదినామాలను పఠిస్తారు. అష్టోత్తరశతనామావళి పూర్తికాగానే శ్రీదేవి, భూదేవిమూర్తులకు లక్ష్మీనామార్చన జరుపుతారు.

## రెండోగంట, నైవేద్యం


అష్టోత్తరశతనామార్చన అనంతరం ఆలయంలో రెండోగంట మోగుతుంది. పోటునుంచి తెచ్చిన అన్నప్రసాదాలు, పిండివంటలు స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తారు. నివేదన తర్వాత తాంబూలం, కర్పూరహారతి ఇస్తారు.

## ఆ రాత్రి కైంకర్యాలు

ఉదయం జరిగే తోమాలసేవవంటిదే రాత్రిపూట కూడా జరుగుతుంది. అనంతరం హారతి, స్వామివారికి అష్టోత్తరశతనామార్చన, శ్రీదేవి, భూదేవిమూర్తులకు లక్ష్మీనామార్చన, నైవేద్యసమర్పణ అన్నీ జరుగుతాయి. ఈ సమయంలో మూడో గంట మోగుతుంది. దీనితర్వాత మళ్లీ సర్వదర్శనం.

## ఏకాంతసేవ

రాత్రి ఒకటిన్నరగంటసమయంలో జరిగే పవళింపుసేవనే ఏకాంతసేవ అంటారు. ముఖమంటపంలో రెండు వెండి గొలుసులతో కట్టిన ఊయలలో భోగశ్రీనివాసమూర్తిని శయనింపజేసి పాలు, పళ్లు, బాదంపప్పులు నైవేద్యంగా పెడతారు.



రాత్రిపూట స్వామివారిని పూజించేందుకు వచ్చే బ్రహ్మదేవునికోసం తగినంతనీటిని వెండిగిన్నెలలో ఉంచుతారు. ఏడుకొండలవాడిని నిదురపుచ్చేందుకు అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తారు. దీన్ని తాళ్లపాకవారి లాలి అంటారు. (ఏకాంతసేవ ఏడాదిలో 11నెలలపాటు భోగశ్రీనివాసుడికి జరిగితే ధనుర్మాసంలో మాత్రం శ్రీకృష్ణుడికి జరుగుతుంది.) దీంతో ఆరోజుకి నిత్యపూజలు అన్నీ జరిగినట్లే.

## గుడిమూసే ప్రక్రియ

రాత్రి రెండుగంటలకు గుడిమూసే ప్రక్రియ మొదలవుతుంది. ముందుగా మూడోద్వారాన్ని, ఆ తర్వాత బంగారువాకిలిని మూసేసి లోపలి గడియలు బిగిస్తారు. అధికారులు బయటివైపు తాళాలు వేసి వాటిపై సీళ్లు వేస్తారు.

## ప్రత్యేకసేవలు

రోజువారీ అర్చనలు, ధూపదీపనైవేద్యాలు కాకుండా సోమ, మంగళ, బుధ, గురు, శుక్రవారాల్లో తిరుమలవాసుడికి ప్రత్యేకపూజలు జరుగుతాయి. అవి సోమవారం విశేషపూజ, మంగళవారం అష్టదళ పాదపద్మారాధన, గురువారం సడలింపు,



పూలంగిసేవ, తిరుప్పావడ, శుక్రవారం అభిషేకం. స్వామికి రోజూ కల్యాణోత్సవం



జరిపిస్తారు. డోలోత్సవం, సహస్రదీపాలంకరణ, ఆర్జితబ్రహ్మోత్సవాలు ఇవన్నీ ఉత్సవమూర్తులకు జరుగుతాయి.

## అభిషేకం

శ్రీవారిఆలయంలో శ్రీనివాసునికి జరిగే సేవలన్నింటిలోకి విశిష్టమైంది ప్రతి శుక్రవారం ఉదయం జరిగే అభిషేకం.

ఈ సేవ ప్రాశస్త్యం ఏమిటంటే అభిషేక సమయంలో నిత్యకల్యాణశోభితుడైన స్వామివారి నిజరూపదర్శనభాగ్యం భక్తులకు లభిస్తుంది. గురువారంరాత్రి పూలంగిసేవ తరువాత దర్శనంలోనూ, శుక్రవారం ఉదయం అభిషేకసమయం లోనూ, అభిషేకానంతరదర్శనకాలంలో తప్ప మిగతా అన్నిరోజులూ స్వామి వెడల్పాటి తెల్లని కర్పూరనామంతో దర్శనమిస్తాడు. ఈ మూడుసందర్భాల్లో మాత్రమే స్వామివారి నిజరూపదర్శనం



సాధ్యపడుతుంది. దీన్నే నేత్రదర్శనం, నిజపాదదర్శనం అంటారు.

## సడలింపు

గురువారం ప్రాతఃకాలపూజలు చేశాక తలుపులు వేసి స్వామివారి ఆభరణాలను తీసేస్తారు. కర్పూరనామాన్ని తగ్గిస్తారు. దీంతో శ్రీనివాసుడి కమలాలకన్నులు భక్తులకు కనిపిస్తాయి. అనంతరం శ్రీవారికి 24మూరల పట్టుఅంచుధోవతి, 12మూరల ఉత్తరీయాన్నీ కడతారు. సువర్ణపాదాలు, హస్తాలు, శంఖచక్రాలు, కర్ణాభరణాలు, స్వర్ణసాలగ్రామహారాలు సమర్పించి తలుపులు తెరుస్తారు. దీన్నే సడలింపు అంటారు.

## పూలంగిసేవ

ఆపాదమస్తకం స్వామివారిని పుష్పమాలాలంకృతుల్ని చేయడమే పూలంగిసేవ. తనువెల్లా పూలమాలలతో అలంకరించిన శ్రీవారిదివ్యమనోహరవిగ్రహం భక్తులకు కనువిందు చేస్తుంది.

## తిరుప్పావడ

భారీసంభారాలతో స్వామివారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ అంటారు. ప్రతి గురువారం నైవేద్యసమయంలో



తిరుప్పావడ జరుగుతుంది. అప్పుడు సుమారు 450కిలోల అన్నప్రసాదాన్ని, లడ్డు, వడ, దోసె, పాయసం, జిలేబి తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు.

ఇలా నిత్యమూ స్వామివారికి జరిగే అన్ని కైంకర్యాలను మనమూ చూసి తరిద్దాం. ఆ దేవదేవుడి ఆశీస్సులు పొందుదాం.

## 2022, అక్టోబరునెల ఉత్సవాలు, పర్వదినాలు

| | | |
|---|---|---|
| 01 | - | తిరుమల శ్రీవారి గరుడసేవ |
| 02 | - | సరస్వతీపూజ, గాంధీజయంతి |
| 03 | - | దుర్గాష్టమి |
| 04 | - | మహర్నవమి, తిరుమల శ్రీవారి రథోత్సవం |
| 05 | - | విజయదశమి |
| 12 | - | అట్లతద్దె |
| 24 | - | నరకచతుర్దశి, దీపావళి అమావాస్య |
| 25 | - | కేదారగౌరీవ్రతం |
| 29 | - | నాగులచవితి |

**గమనిక**

*ఇది బ్రహ్మోత్సవసంచిక కాబట్టి ధారావాహికలను ప్రచురించలేకపోతున్నాం. తర్వాతి సంచిక నుండి యథాతథంగా ధారావాహికలు ప్రచురిస్తాం!!*

*- ప్రధానసంపాదకుడు*

*గమనిక: ఈ వ్యాసంలోని సేవల చిత్రాలు నమూనా ఆలయం, శ్రీవేంకటేశ్వర వైభవోత్సవాలలోనివి. పాఠకులు గమనించగలరు.*



# నీ సన్నిధే... నాకు పెన్నిధి!!

-డా॥ మైలవరపు లలితకుమారి, 99595 10422

బ్రహ్మోత్సవం బ్రహ్మోత్సవం బ్రహ్మాండనాయకునికి బ్రహ్మోత్సవం
కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీనివాసునికి జరిగే మహోత్సవం

అని జనులంతా పాడుకుంటూ స్వామిని చేరుకునే పవిత్రమైన మహోత్సవాలు. సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడే స్వయంగా స్వామిఉత్సవాలు జరిపించినట్లు భవిష్యోత్తర పురాణంలో పేర్కొనబడింది. అందువల్లనే వాటికి బ్రహ్మోత్స వాలు అనే పేరు సార్థకమైంది.

అంకురార్పణతో ఈ ఉత్సవాలకు నాంది ప్రస్తావన జరుగుతుంది. ఈ ఉత్సవాల ఏర్పాట్లను స్వామివారి సేనానాయ కుడైన విష్వక్సేనుని పర్యవేక్షణలో జరుగుతాయని ప్రతీతి. బ్రహ్మో త్సవాలు ప్రారంభించే తొలిరోజున జరిగే ఉత్సవమే ధ్వజా రోహణం. స్వామికి సేవలు పూర్తయ్యాక శ్రీదేవిభూదేవిసమేత శ్రీమలయప్పస్వామికి ఏకాంతంగా తిరుమంజనం చేసి నైవేద్యం సమర్పిస్తారు. ఆ తరువాత ఆలయసన్నిధిలోని ధ్వజస్తంభంమీద ఒక పతాకాన్ని ఆవిష్కరిస్తారు. దానినే ధ్వజారోహణం అంటారు. స్వామివారి వాహనం గరుత్మంతుడు. ఒక నూతనవస్త్రంమీద ముందుగా గరుడునిబొమ్మను చిత్రించుతారు. దీన్నే గరుడ ధ్వజపటం అంటారు. దీనిని ధ్వజస్తంభానికి పైన కట్టేందుకు నూలుతో కొడితాడును తయారుచేస్తారు. ముందుగా ఈ గరుడ ధ్వజపటాన్ని ఊరేగించి శ్రీనివాసుడు శ్రీదేవిభూదేవులసమక్షంలో గోధూళిలగ్నమైన మీనలగ్నంలో కొడితాడుకు కట్టి ధ్వజ స్తంభంపైకి చేరుస్తారు. ధ్వజస్తంభంపైన ఎగిరే ఈ గరుడపతాక ధ్వజమే స్వామికి జరిగే బ్రహ్మోత్సవాలకు సమస్తదేవతలకు ఆహ్వానం పలుకుతుంది. ఖేచరులైన అష్టదిక్పాలకులు, భూత, ప్రేత, యక్ష, రాక్షస, గంధర్వ, కిన్నర కింపురుషగణాలకు కూడా ఇదే ఆహ్వానపత్రిక.


ఈ ఆహ్వానాన్ని అందుకుని విచ్చేసిన గణాలకు ఆగమ శాస్త్రప్రకారం నిర్ణీతప్రదేశాలలో వారివారి నియమాలనను సరించి నైవేద్యరూపంలో బలిని సమర్పిస్తారు. ఎప్పుడైతే ధ్వజారోహణం జరిగి బలిహరణప్రక్రియ పూర్తి అవుతుందో అప్పుడే బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు. ఈ ధ్వజస్తంభా లకు సంబంధించిన ఒక ప్రత్యేకమైన కథ మనకు పురాణాల్లో కనిపిస్తుంది. ఇది జైమినిభారతాంతర్గత కథ.

## అదే మయూరధ్వజవృత్తాంతం

పూర్వము మణిపురరాజ్యాన్ని పాలించే మయూరధ్వజుడు మహాపరాక్రమవంతుడు. బలి, శిబిచక్రవర్తి, కర్ణులను మించిన మహాదాత. కురుక్షేత్రసంగ్రామానంతరం రాజ్యాభిషిక్తుడైన ధర్మరాజు అశ్వమేధయాగాన్ని చేశాడు. ఆయాగాశ్వానికి రక్షణగా నకులసహదేవులు నడిచారు. ఆయజ్ఞాశ్వాన్ని మయూరధ్వజుని కుమారుడు తామ్రధ్వజుడు బంధించాడు. రక్షణగా వచ్చిన నకులసహదేవులను, తరువాత వచ్చిన భీమార్జునులను తామ్రధ్వజుడు ఓడించాడు.

ఆవిషయం తెలుసుకున్న ధర్మరాజు తానే స్వయంగా యుద్ధానికి బయలుదేరాడు. అప్పుడు పరాక్రమంతో మయూరధ్వజుని జయించటం అసాధ్యమని ఉపాయంతో మాత్రమే జయించగలమని- చెప్పాడు కృష్ణపరమాత్మ. శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా ధర్మరాజు, శ్రీకృష్ణుడు ఇద్దరూ వృద్ధ బ్రాహ్మణులరూపంలో మణిపురం చేరుకున్నారు. వారిని చూసిన మయూరధ్వజుడు విప్రులయినవారికి దానం ఇవ్వదలచి ఏమి కావాలో కోరుకోమన్నాడు.

అపుడు శ్రీకృష్ణుడు ఓ రాజా! మేము తమ దర్శనార్థమై మీవద్దకు బయలుదేరాం. అప్పుడు దారిలో ఒకసింహం అడ్డుగా వచ్చి ఇతనిపుత్రుణ్ణి పట్టుకుంది. అపుడు మేము బాలుణ్ణి విడిచిపెట్టమని ప్రార్థించాం.



అపుడా సింహం మానవభాషలో మీ కుమారుడు మీకు కావాలంటే మణిపురరాజ్యాధిపతి ఐన మయూరధ్వజునిశరీరంలో సగభాగం నాకు ఆహారంగా తెచ్చి సమర్పించమని చెప్పింది. కావున ఓ రాజా! తమశరీరంలో సగభాగం దానమిచ్చి ఆ పుత్రుణ్ణి కాపాడాల్సిందిగా కోరాడు. రాజు అందుకు అంగీకరించాడు.

మరలా శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. రాజా! స్వయంగా మీ భార్యాపుత్రులే మీ శరీరభాగాన్ని కోసి ఇవ్వాలనే నిబంధనను సింహం విధించింది అని చెప్పాడు. రాజు వెంటనే తగినఏర్పాట్లు కావించాడు. అపుడు అతని భార్యపుత్రులు రాజుశరీరాన్ని సగానికి కోయసాగారు. ఆ దృశ్యాన్ని చూసిన ధర్మరాజు మయూరధ్వజుని త్యాగగుణానికి ఆశ్చర్యచకితుడయ్యాడు. ఇంతలో మయూరధ్వజుని ఎడమకన్ను నుంచి నీరు కారసాగింది. అది గమనించిన ధర్మరాజు రాజా! తమరు కన్నీరుకారుస్తూ బాధతో ఇచ్చే దానం మాకు వద్దు అని నిరాకరించాడు. అప్పుడు మయూరధ్వజుడు విప్రోత్తమా! మీరు పొరపాటు పడ్డారు. నా కుడిభాగం పరోపకారానికి ఉపయోగపడుతోందే! ఆ భాగ్యం నాకు కలగటంలేదు కదా అని నా ఎడమకన్ను కన్నీళ్ళు కారుస్తోంది అని వారితో చెప్పాడు. మయూరధ్వజుని దానశీలతకు మెచ్చిన కృష్ణపరమాత్మ అతనికి నిజరూపంతో దర్శనమిచ్చి, ఏదైనా వరం కోరుకోమన్నాడు.

అపుడు మయూరధ్వజుడు పరమాత్మా! నా శరీరం నశించినా ఆత్మపరోపకారార్థం ఉపయోగపడేలా నిత్యం మీ ముందు నిలబడేట్లుగా వరం ప్రసాదించమని కోరాడు. అప్పుడు కృష్ణుడు నేటినుంచీ ప్రతి దేవాలయంముందు నీ గుర్తుగా నీ పేరున ధ్వజస్తంభాలు వెలుస్తాయి అన్నాడు.

ఆ ధ్వజస్తంభాలను ఆశ్రయించిన నీ ఆత్మ దైవసాన్నిధ్యంలో కొలువు తీరుతుంది. నీ శరీరంపై దీపాన్ని పెట్టినవారి జన్మ సఫలం అవుతుంది. భక్తులు ముందుగా నిన్ను దర్శించి ప్రదక్షిణనమస్కారాలు చేసిన తరువాతనే తమ ఇష్టదైవాలను దర్శించుకుంటారు. నీ నెత్తిన ఉంచిన దీపము ఆకాశదీపమై రాత్రులందు బాటసారులకు మార్గదర్శనం చేస్తుంది అని స్వామి అనుగ్రహించాడు.

మయూరధ్వజుని త్యాగగుణానికి, దానశీలతకు నిదర్శనంగా ఆనాటినుంచి ఆరాజుపేరుమీదుగా ఆలయాలముందు ధ్వజస్తంభాల ప్రతిష్ఠ జరుగుతోంది. ఇది మన హిందూదేవాలయాలముందు పరమాత్మకృపతో ధ్వజస్తంభంగా నిలిచిన మయూరధ్వజుని వృత్తాంతం. పరమాత్మదయ పొందాడు కనుక మయూరధ్వజుడు స్వామిముందు నిలబడి బ్రహ్మోత్సవాలసమయంలో చిరుగంటలసవ్వడులతో సమస్త దేవతలకూ ఆహ్వానం పలుకుతుంటాడు.





# అంగరంగ వైభవంగా..

- శ్రీ వద్దిరాజు జనార్ధనరావు,
99893 50596

తిరుమలలో అంగరంగవైభవంగా, కన్నులపండువుగా, బ్రహ్మాండంగా బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 27నుండి అక్టోబరు 05వరకు జరుగుతాయి. శ్రీవేంకటేశ్వరుని అవతారనక్షత్రం కన్యాశ్రవణంనాడు చక్రస్నానం దానికి ముందు తొమ్మిదిరోజులనుండి జరిగే ఈ బ్రహ్మోత్సవాలలో అంకురార్పణ, ధ్వజారోహణంతో ప్రారంభమై ధ్వజావరోహణం, చక్రస్నానంతో యథావిధిగా జరుగుతాయి. ముందుగా గరుత్మంతుడు అష్టదిక్పాలకులు, ముక్కోటిదేవతలు, భూత, దేవగణాలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణం మొదలైన కార్యక్రమాలు వైభవంగా జరుగుతాయి.

శ్రీదేవీ, భూదేవిసమేతుడై స్వర్ణతిరుచ్చిపై శ్రీనివాసుడు వేదపండితుల వేదగోష్ఠితో, జీయర్‌స్వాములతో వైఖానస ఆగమోక్తమంగా గజరాజులు, అశ్వాలు, గోవిందనామస్మరణతో, సాంస్కృతిక కళాబృందాలవిన్యాసాలతో వేదాలకు ప్రతీకలుగా నాలుగుమాడవీథులలో జరిగే ఊరేగింపు నయనమనోహరంగా సాగి భక్తులకు కనువిందు చేస్తాయి. పెద్దశేషవాహనంతో ప్రారంభమయి చిన్నశేషవాహనం, హంసవాహనం, సింహవాహనం, ముత్యపుపందిరివాహనం, కల్పవృక్షవాహనం,
















సర్వభూపాలవాహనం, మోహినీఅవతారం, గరుడోత్సవం, హనుమద్వాహనం, గజవాహనం, సూర్యప్రభవాహనం, చంద్రప్రభవాహనం, రథోత్సవం, అశ్వవాహనసేవలు, చక్రస్నానం మొదలైనసేవలు అంగరంగవైభవోపేతంగా సాగి అశేషభక్తకోటిని ఎంతగానో అలరిస్తాయి. ఇందులో ప్రధానమైన ఉత్సవాలుగా బంగారు గరుడోత్సవం, రథోత్సవం, కల్పవృక్షవాహనసేవలు దర్శించుకుని భక్తులు ఆనందపరవశులౌతారు. ప్రపంచం నాలుగుచెరగులనుండి భక్తులు లక్షలాదిమంది ఈ ఉత్సవాలలో పాల్గొనడం విశేషంగా చెప్పుకోవచ్చు. వారందరికి తిరుమలతిరుపతిదేవస్థానంవారు అహర్నిశలు ఎంతో శ్రమకు ఓర్చి భక్తులకు ఎటువంటి అసౌకర్యం, ఇబ్బంది కలగకుండా, నిరంతరం అన్నపానీయాలు, ప్రసాదాలను అందిస్తూ నిర్వహించడం అనేవిషయం ఎంతో ఉదాత్తమైనదిగా చెప్పుకోవచ్చు. ఈ కన్నులపండువుగా సాగే ఈ ఉత్సవాలలో కోలాటాలు, చెక్కభజనలు, నృత్యాలు, భజనలు, విన్యాసాలు, విశేషావతారాలతో, డప్పువాయిద్యాలతో ఎందరో కళాకారులు ప్రదర్శించే కళారూపాలు, విచిత్రవేషధారణలు, వివిధమూర్తుల వేషధారణలు ఎన్నో నయనానందకరంగా ఉంటాయి.


మలయప్పస్వామిని మాడవీధుల్లో ఊరేగించేసమయంలో అన్నిటికంటే ముందు ఏనుగులు ఓప్రత్యేకఆకర్షణగా నిలుస్తాయని చెప్పవచ్చు. తిరుమలజీయర్‌స్వామివారిపరివారం ప్రతిరోజు అందించే ప్రబంధాలు, వేదపారాయణం భక్తులువిని ఆనందిస్తారు. భూలోకవైకుంఠంగా చెప్పుకొనే తిరుమలగిరులపై జరిగే బ్రహ్మోత్సవాలలో పాల్గొనడమంటే పూర్వజన్మసుకృతంగా భక్తులు భావిస్తారు.

ఈ బ్రహ్మోత్సవాలలో అందమైన పుష్పాలంకరణ, విద్యుద్దీపాలంకరణ కనువిందు చేస్తాయి. పగలురాత్రికి తేడా తెలియనంతగా వెలుగులతో నిండి ఉంటుంది. నిరంతరం సందడిగా తిరుమలగిరులు వెలుగొందుతూంటాయి. ఎక్కడెక్కడివారు పిల్లాపాపలతో, వృద్ధులు, స్త్రీ, పురుషులతో వచ్చే భక్తులు భక్తితో చేసే భజనలు, పాటలు ఆనందాన్ని పంచుతాయని చెప్పవచ్చు. భక్తజనకోటితో తిరుమలగిరి క్రిక్కిరిసిపోతుంది. వర్షం వచ్చినా కూడా లెక్కచేయకుండా భక్తులందరు ఆయా ఉత్సవాలలో పాల్గొని తరించడమే వారికి భగవంతుడిచ్చిన ఐశ్వర్యమని చెప్పవచ్చు.

చిత్రాలు: ఫైల్ చిత్రాలు







# వేయికన్నులున్నా.. చాలవు!!

– శ్రీ జూలకంటి బాలసుబ్రమణ్యం,
99856 70152

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని అంతఃపురమందిరం అందరిపాలిటికి అందుబాటులో ఉన్న దేవాదిదేవుని నిలయం! అందరికీ పరమానందాన్ని పంచిపెడుతూన్న ఆనందనిలయం! ఆ ఆనందనిలయంలో మధ్యభాగాన దైవస్థానంలో తనకుతానే వ్యక్తమై అభివ్యక్తమై ఆవిర్భవించి నిలచిఉన్న పవిత్రసాలగ్రామ శిలాదివ్యమూర్తి శ్రీవేంకటేశ్వరస్వామి.

అక్కడున్నది బంగారుపద్మపీఠం. ఆ పీఠంపై అమందా నందాన్ని కల్గించే శ్రీవారి బంగారుపాదాలు. గజ్జెలఅందెలు ఆపైన ఘనపట్టుపీతాంబరం. ఆ పీతాంబరంకుచ్చిళ్లపై జీరాడుతూ వేలాడుతున్న సహస్రనామాలమాలలు. నాభివద్ద సూర్యకఠారి అనే నందకఖడ్గం, నడుముకు దశావతారఒడ్డాణం. బంగారుమొలతాడు. వజ్రఖచిత వరదహస్తం అంటే తన పాదాలే పరమార్థం అని చూపిస్తున్న వైకుంఠహస్తం. ఇంకొక హస్తం తనను శరణువేడితే సంసారసముద్రం మోకాళ్లబంటే అని వయ్యారంగా చూపుతున్న కటిహస్తం. హృదయంపై కౌస్తుభ మణి! నవరత్నాలహారాలు! వక్షఃస్థలంపై ఆసీనురాలై అనుగ్రహిస్తూన్న వ్యూహలక్ష్మి! సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి! శ్రీదేవిభూదేవి పతకాలహారాలు, కంఠమాలలు, బంగారుయజ్ఞోపవీతం! చేతులకు నాగాభరణాలు, సాలగ్రామమాలలు, శంఖచక్రాలు! నల్లని మోము! చెరగని, తరగని చిరుమందహాసం! నిగనిగలాడే చెక్కిళ్లు, కర్ణాలంకారాలు! దొండపండులాంటి పెదవులు. ఆ పెదవుల క్రింద చుబుకంపైన చక్కనైన తెల్లని కప్పురపుచుక్క. ఆపైన సొగసైననాసిక! నొసటిపై తెల్లనినామం! శిరసుపైన అమరిఉన్న నవరత్నాల మకుటరాజం! ఆపైన బంగారు మకరతోరణం. ఆ మూర్తి అంతఎత్తునా అలంకరింపబడ్డ సుగంధ సుమనోహర సుమమాలలు. ఏమి ఆ విగ్రహసౌందర్యం! ఏమి ఆ మూర్తి సౌకుమార్యం! శ్రీనివాసప్రభువులవారి దివ్యసన్నిధిలో ఎంతసేపు నిలిచినా తనివితీరదు. ఎంతసేపు చూస్తున్నా విసుగనిపించదు. ఎంతచూచినా ఎన్నిమార్లుచూసినా ఇంకా ఇంకా మళ్లీ మళ్లీ చూడాలనే అనిపిస్తుంది.

తిరుమలలోని ఆ బంగారుభవనం నట్టనడుమభాగాన అంటే ఆనందనిలయంలోని మధ్యభాగంలో బ్రహ్మస్థానమనబడే దివ్యస్థలంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారు అర్చారూపంలో స్వయం వ్యక్తమూర్తిగా చతుర్భుజాలతో నిలచిఉన్నందున ఈ మూర్తిని "స్థానకమూర్తి" అంటారు. ఈమూర్తి స్థిరంగా ఉన్నందున "ధ్రువమూర్తి" అనీ, "ధ్రువబేరం" అనీ అంటారు. ఇరుప్రక్కలా దేవేరులులేకుండా తానొక్కడే వక్షఃస్థలమహాలక్ష్మితో నిలచి ఉన్నందువల్ల ఈ మూర్తి "స్థానకమూర్తి" అని కూడా పిలువబడుతున్నాడు. వక్షఃస్థలంపై మహాలక్ష్మిని ఉంచుకొని శ్రీమహావిష్ణువు ఒక్కడే శ్రీవైకుంఠాన్ని విడచి, కలియుగవైకుంఠమైన తిరుమల కొండకోనల్లో స్వయంవ్యక్తమై పుట్టు శిలారూపంతో

తొలుదొల్త వెలసిన ఏకైకమూలమూర్తి. ఈ ఆలయంలోని మిగతామూర్తులన్నీ అనంతరకాలంలో ఆయా సమయాల్లో చెప్ప బడ్డాయి. అందువల్ల తిరుమలఆలయం ఏకబేరం (ఏకైకమూర్తి) ఆలయం అంటే ఒకేఒక్కమూర్తి కలిగిన ఆలయంగా మాత్రమే పేర్కొనబడుతోంది.

ఈ పవిత్రస్థలంలో శ్రీస్వామివారు చతుర్భుజాలతో ప్రకాశిస్తూ, పై కుడిచేతిలో సుదర్శనచక్రాన్నీ, పై ఎడమచేతిలో పాంచజన్యశంఖాన్నీ, అలాగే క్రింద కుడిహస్తం వరదహస్తం (వైకుంఠహస్తం)గానూ, క్రింద ఎడమహస్తం కటిహస్తంగానూ నవధరించి, హృదయంపై శ్రీమహాలక్ష్మిచిహ్నాన్ని కలిగి, ఎడమ వైపు వయ్యారంగా కొద్దిగా వంగినట్లుగా కనబడుతూ, ఎడ తెగని అరకన్నుచూపులతో, చెరగని నయనమనోహరమూర్తి ఈ వైకుంఠనాథుడు.

శ్రీవేంకటేశ్వరుని మూలవిరాణ్మూర్తి విగ్రహసౌందర్యం, శిల్పవిన్యాసం ఏ ఉలికీ లోబడనిదీ, ఏ కళాకారుని అవ గాహనకూ, ఊహకూ అందనిదీ, అర్థంకానిదీనూ. ఆ కొండల రాయని కొనదేరినముక్కు, అరగన్నులు, కన్నులరెప్పలమీది సూక్ష్మమైన వంపులసొంపులు, ఇలా ఆమూలాగ్రం క్షణక్షణం మార్పులకు లోనవుతున్నాయా అన్నట్లుగా గోచరిస్తూ, శిల్ప శాస్త్రనియమాలనూ, ఆగమశాస్త్రపరిధులనూ అధఃకరిస్తూ వినూత్నపంథాలో అద్భుతావహంగా, ఆశ్చర్యజనకంగా, స్వయం వ్యక్తమై, అభివ్యక్తమైనమూర్తి తిరుమల దివ్యక్షేత్రంలోని శ్రీస్వామి వారి మూలవిరాణ్మూర్తి.

కానీ, కేవలం లౌకికదృష్టితో చూసినట్లైతే సాక్షాత్తు భగవంతుడే ఈ లోకంలో స్వయంగా అవతరించి, కొన్ని అద్భుత కార్యాలను నెరవేరుస్తూన్నాడు కదా! అలాగే ఆ వైకుంఠంలోని సాక్షాత్తు శ్రీ మహావిష్ణువే ఏనాడో ఎప్పుడో తనకుతానే ఒకానొకశిల్పిగా అవతరించి శ్రీవేంకటాచలక్షేత్రంలో తనదైన పరమాద్భుతరూపాన్ని వినూత్నంగా, అత్యంత విశిష్టంగా అపు రూపంగా "న భూతో న భవిష్యతి" అన్నట్లుగా రూపొందించు కొని ఉండొచ్చునని మాత్రమే ఊహించి చెప్పాల్సిన దివ్య సౌందర్యం వెలారుస్తూన్న మేటి చక్కదనాలమూర్తి ఈ తిరుమల వేంకటేశభగవానునిమూర్తి. తిరుమల ఆనందనిలయంలో వేంచేసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి సాక్షాత్తుగా దివ్యశరీరంతో నయనాభిరామంగా నిలచి దర్శనమిస్తూన్న అనంతచైతన్యమూర్తి. ఈ దివ్యసుందరమూర్తి కేవలం శిలగా, విగ్రహంగా భ్రమింప జేస్తూ, ఏదీ గమనించనట్లుగా ఉన్నట్లు, మౌనంగానే ఉంటాడు స్వామి. ముందు మాట్లాడేవాడట స్వామి. ఆ తర్వాత జరిగిన ఒకానొకసంఘటనకు స్వామి చింతించి మౌనంగానే కలి యుగాంతంవరకు ఉంటానని చెప్పాడట.

అప్పుడు బ్రహ్మాదిదేవతలందరూ వచ్చి స్వామీ! ఈ కలి యుగంలోని మానవులు బలహీనులు, అల్పాయుష్కులుకదా! వారిని ఉద్ధరించటానికైనా కలియుగాంతంవరకు ఇక్కడే ఈ వేంకటాచలక్షేత్రంపై నిలచి దివ్యసందర్శనాన్ని ప్రసాదిస్తూ వారి కోరికలనన్నింటిని తీర్చాల్సిందిగా ప్రార్థించారు. అందుకు స్వామి అంగీకారం తెల్పి, దివ్యమూర్తిగా దర్శనమిస్తాను. కాని ప్రత్యక్షంగా ఎవరితోనూ మాట్లాడను. కాని మౌనంగానే జవాబి స్తాను. అందరికోరికలు తీరుస్తూ "కలౌ వేంకటనాయకః" అంటూ ప్రసిద్ధిని పొందుతానంటూ ఆనాడు అంటే కన్యామాసం శ్రవణనక్షత్రంరోజున దివ్యమైన సాలగ్రామశిలామూర్తిగా ఆవిర్భ వించాడు. ఆనాడు బ్రహ్మదేవునికోరికమేరకు నిలిచిన శ్రీవేంకటే శ్వరస్వామివారికి తొండమానుడు ఆలయగోపురాలు నిర్మించాడు. బ్రహ్మదేవుడు ఆనందనిలయంలో రెండు అఖండదీపాలను వెలి గించి, ఇవి కలియుగాంతంవరకు వెలుగుతూంటాయని చెప్తూ, పిదప శ్రీనివాసుని ఆనతిమేరకు పదిరోజులపాటు ఉత్సవాలు నిర్వహించాడు. అవే అనంతరకాలంలో బ్రహ్మోత్సవాలుగా ప్రసిద్ధి పొందాయి. ఆనాటినుండి ప్రతిఏటా కన్యామాసంలో శ్రవణా నక్షత్రంనాటికి ముగిసేట్టుగా పదినాళ్లపాటు నిరాఘాటంగా, నిరాటంకంగా బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుపబడుతున్నాయి.

అలా వెలసిన స్వామి మనందరితో మాట్లాడకపోయినా, ఆ బ్రహ్మాదిదేవతలప్రార్థనపై మనందరికీ ప్రత్యక్షంగా దర్శన మిస్తున్నాడు. ఎనలేని ఆనందాన్ని కల్గిస్తూ ఆనందనిలయు డని పేరుపొందడమేకాక మన కోరికలనన్నింటినీ తీరుస్తూ కొండలంతవరాలను గుప్పించే దేవుడుగా నిలచిఉన్న స్వామి ఈ ఏడుకొండలవాడు. కలియుగవరదునిగా ఈ వేంకటాచల క్షేత్రంపై మానవులందరినీ రక్షించటానికై శ్రీవేంకటేశ్వరస్వామిగా ఆవిర్భవించి దివ్యసందర్శనమిస్తున్న ఆ స్వామిపాదాలకు ప్రణ మిల్లుదాం.

# వైష్ణవాగమం అంటే...?

- శ్రీ చాకిచర్ల నాగసుదర్శన్‌రావు,
97013 85006

**సంపూర్ణ దైవానుగ్రహం ఉన్నచోట సుఖ శాంతులు నిండిఉంటాయి. అయితే ఆ సర్వేశ్వరుడి అనుగ్రహాన్ని పొందాలంటే మన ఆచారవ్యవహారాలు ఎలా ఉండాలి? మనం ఆ కారుణ్యమూర్తిని ఎలా అర్చించాలి? శరణాగతి ఎలా చెయ్యాలి? మొదలగు దైవకైంకర్యాలను గురించి తెలిపే విధివిధానాలను ఆగమాలు అంటారు.**

**ప్రధానంగా శ్రీమహావిష్ణువుని ఆరాధించేవిధానాన్ని వైష్ణవాగమమని, పరమేశ్వరుని పూజించేవిధానాన్ని శైవాగమమని, జగన్మాతని కొలిచేపద్ధతిని శాక్తేయమని అంటారు. వైష్ణవాగమంలో రెండు విధానాలున్నాయి. అవి వైఖానసాగమం మరియు పాంచరాత్రాగమం. మన మిప్పుడు వైష్ణవాగమంగురించి తెలుసుకుందాం....**

ఈ సమస్తసృష్టిలోని చరాచరములు, బ్రహ్మాదులు నశించిన పిమ్మట ఎవ్వడు ఏకాకృతిగా వెలుగొందుతాడో అతడే పరంధాముడు, నారాయణుడు. ఆయన సర్వవ్యాపి, సకల జగత్కారణభూతుడు. తననుంచి విడివడి, కారణం ఏదైతేనేమి, ఈ భూలోకంలో జన్మించి అనేకకష్టాలను అనుభవిస్తున్న ప్రతి ప్రాణిని మరల తన అక్కున చేర్చుకునేందుకు ఎంత తాపత్రయ పడతాడో ఆ వైకుంఠవాసి. భగవత్‌గీతలో తానే స్వయంగా చెప్పాడు. తనని ఎవరు ఆశ్రయిస్తారో వారి యోగక్షేమాలను తానే చూసుకుంటానని అభయమిచ్చాడు.

అంతేకాదు, తనని ఏ విధంగా ఆరాధించాలో? ఎలా అర్చించాలో? మనకు తెలిపేందుకు శ్రీమహావిష్ణువు ఆ చతుర్ముఖ బ్రహ్మను ఇలా ఆజ్ఞాపించాడు– “మదీయ అర్చన విధివిధాన నిర్ణాయక, శృతి ప్రమాణ పరమవైదికవైష్ణవ సంప్రదాయ ప్రతిపాదక సూత్రప్రణీతయు, భవదీయాంశ సముద్భవుండైన ఒక మహర్షిపుంగవుణ్ణి సృజించుమని చెప్పాడు”.

ఇచ్ఛామాత్రః ప్రభో సృష్టిః కావున, ఆ పద్మసంభవుని వేదవేదాంత ఆత్మనుండి ఒక ముని సృష్టింపబడ్డాడు. వేద రూపమైన ఆ మునికి విఖనుడు అని నామకరణం చేశాడు. విశేషంగ ఆలోచించి బ్రహ్మచేత సృష్టించబడ్డాడు కాబట్టి బ్రహ్మ మానసపుత్రుడు అయినాడు విఖనసమహర్షి.

ఆ విధంగా అవతరించిన విఖనసమునీంద్రులు 32 మంత్ర వినియోగములను బోధిస్తూ వైఖానససూత్రమును రచించారు. ఈ సూత్రము కోటియాభైలక్షలు ప్రమాణం కలిగిన వేదప్రభవమైన దైవికవాఙ్మయం అయింది. ఈ దైవికమునందు కర్షణాద్యుత్సవాంతం, శ్రీమన్నారాయణుని ఆలయగోపురప్రాకార మండపోత్సవ బింబప్రతిష్ఠాదుల విధానాలను, విగ్రహసోధనార్చక ప్రతిష్ఠ, అర్చనావిధానాలను, చతుర్విధఅర్చనాప్రకరణములును, వ్యతిరేకార్చనా విపరీతోద్భవములును వాటి ఉపశాంతులు మొదలైన దైవికతంత్రమంతటినీ, సర్వస్వతంత్రవిధానంగా రచించారు.

శ్రీవిఖనసమునీంద్రులు బదరీవనమందు తపోనిష్ఠులై ఉండగా చతుర్ముఖునిఆదేశంతో భగవత్‌శాస్త్ర అవతరణమునకై బ్రహ్మమానసపుత్రులైన మరీచి, భృగువు, అత్రి, కశ్యపులు అనే నలుగురుమునీంద్రులు భూతలమునకు వచ్చి విఖనస మునీంద్రులను దర్శించి వారి అనుగ్రహాన్ని పొంది వారి శిష్యులై విఖనససూత్రమును గురుముఖంగా గ్రహించి దానిని 4,00,000 మంత్రములతో కూడిన ప్రమాణగ్రంథంగా సంక్షేపించారు. వీటిలో...

**మరీచిమహర్షి -** జయ, అమర, సంజ్ఞాన, వీర, విజయ, విజిత, విమల, కల్పములను 8 సంహితలుగా చేసి 1,84,000 మంత్రములతో కూడిన గ్రంథంగా రచించారు.

**భృగుమహర్షి -** ఖిల, ఖిలాధికార, పురాధికరణ, వాసాధికరణ, అర్చాధికరణ, మానాధికరణ, క్రియాధికరణ, నిరుక్త, ప్రకీర్ణ, యజ్ఞాధికరణాలను పదిసంహితలను 64,000 మంత్రాలతో కూడిన గ్రంథంగా రచించారు.



**అత్రిమహర్షి** - పూర్వతంత్ర, విష్ణుతంత్ర, ఉత్తరతంత్ర, మహాతంత్రము అను 4 తంత్రములను 88,000 మంత్రములతో కూడిన గ్రంథంగా రచించారు.

**కశ్యపమహర్షి** - సత్యకాండ, కర్మకాండ, జ్ఞానకాండ అను 3 కాండలను 64,000 మంత్రములతో కూడిన గ్రంథంగా రచించారు.

ఈవిధంగా శ్రీవైఖానసభగవత్‌శాస్త్రం పంచవిశంతి సంహితలుగా 4లక్షలమంత్రములతో కూడిన గ్రంథంగా విరాజిల్లుతోంది. ఆ వైఖానసాగమంయొక్క మహిమ ఇంతా అంతా కాదు, సాక్షాత్ ఆ పరంధామునిచే నియమించబడ్డ మహర్షిచే విరచితమైనది గావున, మన ఋత్విక్కులు, తిరుమల యాజమాన్యంవారు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ వైఖానసాగమపద్ధతి లోనే ఆ తిరుమలేశుని అర్చనా కార్యక్రమాలను జరుపుతూ మన హిందూసంప్రదాయాన్ని కాపాడుతున్నారు. అత్యంత అద్భుతంగా నేటికీ ఆ అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుని నిత్య నైమిత్తిక పూజలు, కైంకర్యములు, క్రతువులు, యజ్ఞయాగాదులు జరుగుతున్నాయి. ఆ శ్రీవేంకటేశ్వరుని శరణుజొచ్చినవారికి ఆయన అభయప్రదాత. కష్టాలకడలిని దాటించే గోవిందుడు.

ఈ వైఖానసాగమాన్ని అనుసరించేవారు శ్రీమహావిష్ణువుని ప్రధానదైవంగా కొలుస్తారు.

“సర్వం విష్ణుమయం జగత్” అనేది వారి ప్రగాఢమైన విశ్వాసం మరియు అధ్యాత్మికచింతన. విఖనసమహామునిచే రచించబడిన వైఖానసకల్ప సూత్రాన్ని మరియు కృష్ణయజుర్వేద తైత్తిరీయశాఖను ఆలంబనంగా చేసుకుని శ్రీమహావిష్ణువు యొక్క దైవారాధన జరుపుతారు. శ్రీరామానుజులవారు చాలా దేవాలయాలలో పాంచరాత్రాగమాన్ని అనుసరించి నిత్యనైమిత్తిక పూజలు, క్రతువులు, యజ్ఞయాగాదులు జరిగేటట్లు చేయగలిగినా, విశ్వవిఖ్యాతమైన శ్రీతిరుమలలో మాత్రం పాంచరాత్రాగమనాన్ని అమలుచేయటంలో విఫలుడు కావటం, నేటికీ ఆ పరంధాముని ఇచ్ఛా ఆదేశంమేరకు అన్ని కైంకర్యాలు శ్రీ వైఖానసఆగమమును అనుసరించే జరగటం అత్యంత గమనార్హమైన విషయం. బ్రహ్మమానసపుత్రులైన మహాఋషులచే విరచితమైన శాస్త్రపద్ధతులను, ఆగమాలను మనం తు.చ. తప్పక ఆచరించటమనే కర్తవ్యాన్ని దైవమాహ్నికంగా భావించాలనే విషయం ఈ సన్నివేశంద్వారా మనకు ద్యోతకమవుతుంది.

దైవపౌరుషేయాలకు సమన్వయం తెలిపిన ఎందరో మహాఋషులు కరచరణాదులతో తిరుగాడిన పవిత్రభూమి మన హిందూదేశం. ఈ సమస్తసృష్టి శ్రీమహావిష్ణువుయొక్క స్పర్శతో నిండి ఉంటుంది. సంకీర్తననారాయణశబ్దమాత్రం విముక్త దుఃఖాసుఖినో భవంతి అంటుంది వేదం. ఆ శ్రీహరినామాన్ని ఉచ్చరించినంతమాత్రంచేత సమస్తకష్టాలు తొలగిపోతాయి.

వేదమంత్రాలు వేరైనా, వాటి ఉచ్చారణలు వేరైనా, అన్ని వేదాలసారాంశం, భావం ఆ పరంధాముని శరణు వేడి మన జీవితాలు సుఖమయంగా ఉండాలని కోరటమే అని తెలుసుకుని, అన్ని వేదాలలో తెలిపిన- ధర్మానికి ఉన్న 4 పాదాలను- సత్యం, శౌచం, తపస్సు, దయ అనే పరమపవిత్రమైన గుణాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ సుఖమయమైన జీవితాన్నిగడుపుతూ మోక్షానికి సోపానాలను వేసుకుందాం. ఏనామంతో పిలిచినా ఏరూపంతో కొలిచినా ఆ పరమాత్మ ఒక్కడే అనే స్థితికి ఈ మానవుడు చేరినప్పుడు దైవానుగ్రహం పరిపూర్ణమై మరుజన్మ లేని వరాన్ని పొందుతాడు.

# ఎంతవారలైన... భగవంతుడి దాసులే!

– మల్లాది శృతకీర్తి



బలిచక్రవర్తి చేస్తున్న యజ్ఞానికి విష్ణుమూర్తి వామనావతారంలో వచ్చినపుడు, బలి ఒక గొప్ప అధికారిగా సర్వం తానే పొంది ఉన్నానని భావించి అతనికి కానుకలు ఇవ్వడానికి సిద్ధమయ్యాడు. కానీ, అన్నీ సమకూర్చేవాడు ఈశ్వరుడే అని మరచి తననే గొప్పవాడిగా ఆవిష్కరించుకుని అహంకారాన్ని ప్రదర్శించాడు. అలా అహంకారంతో వామనుడు ఏది కోరితే అది సమర్పిస్తాను అని చెప్పాడు. అంటే తన సంపదకు తానే సర్వాధికారిని, కర్తను అని భావించాడు. భాగవత పురాణంలోని ఈ అంశం మానవులందరికి చక్కని సందేశాన్ని ఇస్తోంది. తన సంపద కంతా తానే అధికారినని, తానే గొప్పవాడినని తన సంపద చూసి మురిసిపోతాడు మానవుడు అవివేకంతో.

నిజానికి ఈ జగత్తులోని సంపద అంతా ఈశ్వరుడికే చెందుతుంది. ఈశ్వరుడే ఐశ్వర్యవంతుడు. ఆ భగవంతునికంటే గొప్పవారు కాని, అతనితో సమానమైనవారుగాని ఈ జగత్తులో ఎవరూలేరు. ఈ సత్యం తెలుసుకోలేక మానవుడు అల్పజ్ఞానంతో, అజ్ఞానంతో తన సంపదకు తానే గొప్పవాడిగా చిత్రీకరించుకుంటున్నాడు. ఇంకా ధనాపేక్షతో అక్రమంగా కూడ సంపాదించటానికి కూడా వెనుదీయడం లేదు. అట్టి అహంకారానికి చక్కని ఉదాహరణ వామనావతారఘట్టం.

ఒక సామాన్యమానవుడిగా శ్రీమహావిష్ణువు వామనావతారంలో బలిచక్రవర్తి నిర్వహిస్తున్న యజ్ఞంవద్దకు వచ్చాడు. అతని వేషభాషలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. అందరిదృష్టి వామనుడిమీదకు మళ్లింది. ఎంతో అందంగా ఉన్న ఈ పొట్టిబ్రాహ్మణుడు చూడముచ్చటగా ఉన్నాడు, ఈయన ఎవరై ఉంటాడు అనుకున్నారు అక్కడ ఉన్నవారంతా. అలా వామనుణ్ణి చూసి బలిచక్రవర్తి ఎదురెళ్లి ఆహ్వానించి ఉచిత ఆసనం ఇచ్చాడు. నీకు ఏమి కావాలంటే అది సమర్పించటానికి సిద్ధంగా ఉన్నానని విన్నవించాడు. అతని అవతారరహస్యం తెలుసుకోలేక అజ్ఞానంతో తాను ఎంతో గొప్పవాడిని అనుకున్నాడు బలిచక్రవర్తి. జగత్కల్యాణకారకుడైన ఈశ్వరమాయను ఎవరు తెలుసుకోగలరు? బలిచక్రవర్తి మాటకు స్పందించిన వామనుడు చాల ఉదాసీనంగా తనకు మూడుఅడుగుల భూమి మాత్రం చాలు. అంతమాత్రమే దానం తీసుకుంటానన్నాడు. అహంకారం, మమకారంతో నిండిఉన్న బలిచక్రవర్తి అంత తక్కువ కోరుకున్నావేమి? ఇంకా ఏమైనా కోరుకో ఇస్తాను అన్నాడు. మానవుడియొక్క అహంకారానికి పరాకాష్ఠ ఇది. నేనెంతో గొప్పవాడిని. ఇంత చిన్నకోరిక ఏమిటి? నా ఐశ్వర్యం ఏమిటో ఈ పిల్లవాడు గ్రహించలేకపోతున్నాడు అని అనుకున్నాడు బలిచక్రవర్తి.

సామాన్యమానవుల్లో ఇలాంటి అహంకారమే ఉంటుంది. తన సంపదకు కర్త ఈశ్వరుడు అని తెలుసుకోరు. కొందరు యజ్ఞయాగాదులు ఎంతో ఆర్భాటంగా చేస్తూంటారు. ఒకరు పదిమంది ఋత్విక్కులతో యజ్ఞం జరిపిస్తే, వేరొకరు వెయ్యిమందితో

నిర్వహిస్తారు. ఇంకా అధికంగా ఉండాలి వారికంటే అని ఇంకా ఎక్కువమందితో జరిపిస్తూంటారు మరికొందరు. ఇదంతా కేవలం ఆర్భాటంకొరకే కదా! అందరిదృష్టి వారిమీద మరలటా నికి ఇలా ఒకరికొకరు పోటీపడి నిర్వహిస్తుంటారు. దీనివెనుక అదృశ్యంగా ఉండి నడిపిస్తున్నది ఈశ్వరుడేనని, మనం కేవలం నిమిత్తమాత్రులమే అని అనుకోరు. అందుకే ఇలాంటివాటివల్ల ఆశించినవి పొందలేకపోగా, అమంగళకరసంఘటనలు చోటు చేసుకుంటాయి.

ఒకసారి శ్రీకృష్ణుడు తన స్నేహితులతో అడవిప్రాంతా నికి వెళ్లాడు. అక్కడ ఒక చెట్టుక్రింద అందరు కూర్చున్నారు. వాళ్లందరు శ్రీకృష్ణుడితో తమకు బాగా ఆకలిగా ఉందని చెప్పారు. ఆ సమీపంలో కొంతమంది ఋషులు యజ్ఞాలు చేస్తూ న్నారు. ఆ సమయంలో కొంతమందిని వెళ్లి వారినడిగి ఆహారం తీసుకురమ్మన్నాడు శ్రీకృష్ణుడు. ఆ ఋషులు ఆహారం అప్పుడే ఎలా ఇస్తాం? ఇంకా యజ్ఞం పూర్తికాలేదు. అది పూర్తై నివేదన చెయ్యాలి అన్నారు. అందుకు కృష్ణుడు ఋషిపత్నులను అడగ మన్నాడు. ఆ ఋషిపత్నులు వెంటనే ఆహారం పట్టుకుని శ్రీకృష్ణుడి వద్దకు వచ్చారు. వారు శ్రీకృష్ణుణ్ణి చూచి పొంగిపోయి తన్మ



యత్వం చెందారు. సాక్షాత్తు కృష్ణపరమాత్మకు ఆహారం సమ ర్పించుకోవటం వారికి ఎంతో ఆనందం ఇచ్చింది. మరి ఋషులు అది గ్రహించలేకపోయారు. వారి యజ్ఞానికి కర్త, కర్మ అంతా భగవానుడే అని తెలుసుకోలేకపోయారు. అందుకే యజ్ఞం పూర్తిఅయ్యాక నివేదనచేసి ఆహారం ఇస్తామన్నారు. యజ్ఞయాగాదులు ఎవరివల్ల జరుగుతున్నాయి? వెనుక ఎవరు ఉన్నారు? జరిపించేవాడెవడు? అని అన్నీ ఆలోచిస్తే నిజానికి ఎవరిగొప్ప ఏమీలేదు. అంతా ఈశ్వరనిర్ణయమే!

ఇక్కడ బలిచక్రవర్తి యజ్ఞంవద్ద రాక్షసులగురువైన శుక్రా చార్యుడు అన్నీ గ్రహించాడు. ఆ వచ్చిన బ్రాహ్మణుడు ఎవరో కాదు విష్ణుమూర్తి అవతారమేనని. అప్పుడు బలికి సలహా ఇచ్చాడు. తాను ఇస్తానన్న దానం వెనక్కు తీసుకోమని. అయితే, బలిమాత్రం తానుచేసిన వాగ్దానానికి కట్టుబడి ఉంటాను అన్నాడు. ఆవిధంగా వామనుడు తానుకోరినప్రకారం రెండు అడుగులకే, దివి, భువి, ఆకాశం, నక్షత్రమండలం అంతా వ్యాపించి ఆక్రమించాడు. చివరగా బలికోరికప్రకారం అతని శిరస్సుమీద పాదం ఉంచి అతణ్ణి సుతలలోకానికి పంపాడు. ఇది ఏమి ఆశ్చర్యం! ఇక్కడ బలిచక్రవర్తి సంపూర్ణశరణాగతి మనకు అర్థమౌతుంది. తనకితానుగా భగవంతుడికి అర్పించు కున్నాడు. తన అహంకారం అంతా నశించి ఆ మహావిష్ణువుకి శరణాగతి అయ్యాడు. శ్రీమహావిష్ణువు వామనావతారంలో తన స్వరూపాన్ని వ్యక్తం చేశాడు. ఈ జగత్తు అంతా తనలోనే ఉన్న దని, ఈ దివి, భువి, ఆకాశం, నక్షత్రమండలం అంతా తానే నని, తన అవతారప్రయోజనాన్ని స్పష్టం చేశాడు. ఇక్కడ తన విశ్వరూపాన్ని చూపించాడు. సంపూర్ణశరణాగతితో అలా తనను తాను భగవంతుడికి సమర్పించుకోవాలి.

అందుకే మానవుడు తన అహంకారాన్ని వదలితే అంతా మేలే జరుగుతుంది. పరమాత్మను తెలుసుకోవటానికి అహంకారమే అడ్డం వస్తుంది. ఎప్పుడైతే అహంకారం నశి స్తుందో అప్పుడు తననితాను సమర్పించుకుంటాడు భగవం తుడికి ఏ అరమరికలు లేకుండా. రామాయణ, మహాభారతాలు, పురాణాలు అన్నీ మానవుణ్ణి ఉత్తమపురుషులుగా, మహాత్ములుగా తీర్చిదిద్దటానికే మనఋషులు మనకు అందించారు. కాబట్టి మానవుడు ఈసత్యం తెలుసుకుని నిత్యం జీవితంలో ఆనందంగా, ఆయురారోగ్యాలతో జీవించాలి.

*ఓం శాంతి శాంతి శాంతిః*

# ఇతనికంటె... ఘనులిక లేరు!!

– డా॥ పులిగడ్డ విజయలక్ష్మి,
99890 63761

బ్రహ్మర్షి కశ్యపునికి, నిత్యనిరతురాలు వినతకు జన్మించిన అమేయ బలపరాక్రమసంపన్నుడు గరుత్మంతుడు. కశ్యపుని పుత్రులలో సాధుజనహృదయానంద కరుదు, ఉదారుడు, కరుణార్ద్రచిత్తుడు, పరోపకారి, ఆగ్రహానుగ్రహసంపన్నుడు, మాతృభక్తిపరాయణుడు– గరుడుడు.

మాతృభక్తికి ప్రబలతార్కాణంగా గరుడుణ్ణే చెప్తున్నాయి పురాణాలు. తల్లి దాస్యవిమోచనంకోసం మహాసాహసానికి పూనుకున్నాడు గరుత్మంతుడు. తన రెక్కల శక్తితో ఆకాశానికెగసి, స్వర్గలోకం చేరి, వేలాది దేవతాశ్రేష్ఠులైన మహావీరులతో పోరాడి, జయించి, అమృతభాండాన్ని అవలీలగా సాధించాడు. అమృతాన్ని అందిపుచ్చుకునికూడా తాను తాగలేదు. రుచికూడా చూడలేదు. దృష్టిమొత్తం తల్లిని దాస్యంనుండి విడిపించాలి– అన్న ఒకేఒక్క ఆశయంమీదే ఉంది. అందుకే వేగంతో వెళ్తున్న గరుడుణ్ణి చూసి ముచ్చటపడి శ్రీమహావిష్ణువు తానుగా ప్రత్యక్షమయ్యాడు గరుడునికి. అంతటి త్యాగనిరతి గరుడునిది. నిజానికి గరుడుడు తపస్సు చేయలేదు. దేవుని ప్రార్థించలేదు. పిలవనైనా లేదు. తలవనైనా లేదు. అయినా శ్రీమన్నారాయణుడు "నీ బలానికి, శౌర్యానికి, స్వార్థరాహిత్యానికి, సద్భావానికి, మాతృభక్తికి మెచ్చి వచ్చాను గరుడా. ఏం కావాలో కోరుకో నాయనా" అన్నాడు. అనూహ్యమైన, అప్రమేయమైన ఈ సంఘటనకు ఉప్పొంగిపోయి– విష్ణుమూర్తి పాదకమలాలకు ప్రణమిల్లాడు. గరుడునిలో అనంతమైన భక్తి వెల్లివిరిసింది. పలుమార్లు నమస్కరించాడు. "నిరంతరం నీముందే నిలిచి నిన్నే కొలుచుకునే వరం ప్రసాదించు" అని వేడుకున్నాడు. విష్ణువు మహదానందంతో గరుడుణ్ణి తన వాహనంగాను, కేతనంగాను చేసుకుని. కోరనివరాలు కూడా కుమ్మరించాడు. అజరామరత్వాన్ని ప్రసాదించాడు. స్థితికారుని వాత్సల్యానికి నోచుకున్న భక్తాగ్రగణ్యుడు, నిస్వార్థపరుడు గరుత్మంతుడు.

దేవేంద్రుడు వజ్రాయుధాన్ని గరుడునిమీదకు ప్రయోగించినంతనే దధీచిమునీంద్రుని త్యాగానికి గౌరవసూచకంగా ఆ ఆయుధానికి తనరెక్కలోని ఒక్కఈకను ఇచ్చాడు. ముల్లోకాలలోను తిరుగులేనిది వజ్రాయుధం. అంతటి ఆయుధంకూడా గరుడుణ్ణి ఏమీచేయలేక ఆతని ఒక్కఈకను మాత్రమే అదీ గరుడునిసమ్మతితోనే ఛేదించగలిగింది. అది చూసిన సకలలోకవాసులూ గరుడుణ్ణి "సుపర్ణుడ"ని ప్రశంసించారు. మహేంద్రుడు కూడా ఆశ్చర్యపడి–గరుడుణ్ణి మెచ్చుకుని, స్నేహభావాన్ని పొందాడు. అంతటి మహాబల పరాక్రమశాలి గరుత్మంతుడు. అంతేకాదు. నాగజాతికి అమృతం అందకుండా ఉపాయం చెప్పిన వివేకి గరుడుడు. కద్రువ కోరిన అమృతాన్ని వారికందించి తల్లిని దాస్య విముక్తను చేసి, వైకుంఠంచేరి భగవత్సేవలో తరించాడు. అంగుష్ఠప్రమాణదేహులైన వాలఖిల్యాది మహర్షిసత్తములకు ఎలాంటి బాధా కలగకుండా జాగ్రత్తపడిన ఉదాత్తుడు గరుత్మంతుడు. తల్లిదండ్రుల మాట జవదాటని ఉత్తమసుతుడు సుపర్ణుడు.



గరుత్మంతుడు ఆధ్యాత్మికపరుడు. మహా మహా మునుల చేతనేకాక సాక్షాత్తూ మహావిష్ణువుచేతనే "ఆత్మతత్వవేది" అనిపించుకున్న విష్ణుతత్వవేది గరుడుడు. ఆప్తమిత్రుడైన గాలవ మునికి అనుక్షణం అండగా నిలిచి సహకరించి, ఆతని కోరికను తీర్చిన మిత్రసత్తముడు గరుత్మంతుడు.

తండ్రి కశ్యపుని కోరిక పక్షీంద్రుడు కావాలని, తల్లి వినత కోరింది మహావీరుడు కావాలని, తపోధనులంతా కోరింది దేవేంద్రుని మించినవాడు కావాలని- ఇలా అందరి కోరిక మేరకు వారందరి తపఃఫలంగా త్రిలోకబలపరాక్రముడు, పరోప కారి, నిస్వార్థపరుడు, మాతృసేవాపరాయణుడు, దుష్టసంహారి, శిష్టసంరక్షకుడు, ముల్లోకపాలనాసమర్థుడుగా జన్మించాడు గరుడుడు. పక్షిజాతిలో ద్వితీయుడైనా సర్వసద్గుణసంపన్నతలో అద్వితీయుడుగా ప్రకాశించాడు. గరుడుని తలిస్తే చాలు పాప క్షయమవుతుందని మహాభారతం బోధిస్తోంది.



గరుత్మంతునిపేరుమీద ఒక పురాణమే వెలసింది. ఉపనిషత్తే విలసిల్లింది. గరుడుని స్తుతిస్తే మోక్షమే సిద్ధిస్తుంది. జీవరాశి పుట్టుక ముందునుండి (గర్భంలో పడినప్పటినుండి) మరణించి ఊర్ధ్వలోకం చేరేవరకు సాగుతున్న పయనాన్ని మొత్తాన్ని లౌకికంగా, అలౌకికంగా సవిస్తరంగా వివరించింది గరుడపురాణం. మరణానంతరప్రయాణాన్నికూడా కూలం కషంగా తెలియజెప్పింది. ఇప్పటికీ ఎవరైనా మరణించిన సమయంలో గరుడపురాణపఠనం సంప్రదాయికంగా సాగిస్తూనే ఉన్నారు. గరుడపురాణం- విష్ణువు గరుడునికి చెప్పింది. ఇక గరుడోపనిషత్తు గరుడునిగురించి, సకలస్తుతులను వివరిం చింది. అందులో గరుడస్తుతి శిఖరాయమానమైనది.

నేటికీ ఎందరెందరో గరుడోపాసన అంటే గరుడ మంత్రోపాసన చేస్తున్నారు.

**"కుంకుమాంకిత వర్ణాయ**
**కుందేందు ధవళాయచ**
**విష్ణువాహన నమస్తుభ్యం**
**పక్షిరాజాయతే నమః"**

గరుడపురాణంలో విష్ణువే స్వయంగా- గరుడపరా విద్యమంత్రాన్ని ఉపదేశించాడు.

**"యక్షి ఓం ఉం స్వాహా"** -ఈ మంత్రజపంవలన ఆరోగ్యం, శక్తి సమకూరుతాయి.

ఆలయాలలో కొందరు ముందుగా విష్ణుదర్శనం, తరు వాత గరుడదర్శనం చేసుకుంటారు. మరికొందరు ముందుగా గరుడదర్శనం చేసుకుని, ఆ తరువాత గర్భాలయ విష్ణుదర్శనం చేసుకుంటారు.

గరుత్మంతుడులేని విష్ణ్వాలయం ఉండదు. ప్రతి విష్ణ్వాలయంలోను నాలుగువైపులా గోపురాలమీద గరుడుడుం టాడు. ధ్వజస్తంభంలో గరుడుడుంటాడు. శ్రీమహావిష్ణువునకు ఎదురుగా ప్రత్యేకమండపంలో గరుడుడుంటాడు. ఇటీవలి కాలంలో ఆలయానికిముందుప్రాంగణంలో నిలువెత్తు గరుత్మం తుని ప్రతిష్ఠించి ప్రత్యేకపూజలు కూడా చేస్తున్నారు.

*ఓం గం గరుడాయ నమః*



తిరుమల తిరుపతి దేవస్థానములు

## తిరుమల

# శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు


2022 సెప్టెంబరు 27 నుండి అక్టోబరు 05 వరకు



28-09-2022
బుధవారం
రాత్రి
హంసవాహనం



28-09-2022
బుధవారం
పగలు
చిన్న శేషవాహనం



29-09-2022
గురువారం
రాత్రి
ముత్యపుపందిరివాహనం



29-09-2022
గురువారం
పగలు:
సింహవాహనం

తిరుమల తిరుపతి దేవస్థానములు

# తిరుమల
# శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

2022 సెప్టెంబరు 27 నుండి అక్టోబరు 05 వరకు

30-09-2022 శుక్రవారం
పగలు: కల్పవృక్షవాహనం



30-09-2022
శుక్రవారం
రాత్రి
సర్వభూపాలవాహనం



01-10-2022
శనివారం
రాత్రి: గరుడవాహనం



01-10-2022 శనివారం
పగలు: పల్లకీలో
మోహినీఅవతారోత్సవం



తిరుమల తిరుపతి దేవస్థానములు

# తిరుమల
# శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

2022 సెప్టెంబరు 27 నుండి అక్టోబరు 05 వరకు



02-10-2022
ఆదివారం
రాత్రి: గజవాహనం



02-10-2022
ఆదివారం
పగలు
హనుమద్వాహనం




03-10-2022 సోమవారం
పగలు: సూర్యప్రభవాహనం



03-10-2022
సోమవారం
రాత్రి: చంద్రప్రభవాహనం



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుమల
శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు
2022 సెప్టెంబరు 27 నుండి అక్టోబరు 05 వరకు
04-10-2022
మంగళవారం
రాత్రి
అశ్వవాహనం
04-10-2022
మంగళవారం
పగలు
రథోత్సవం
05-10-2022 బుధవారం
పగలు: చక్రస్నానం




# ప్రతిరోజూ... కల్యాణమే!!

– శ్రీ అర్చకం రామకృష్ణదీక్షితులు

*ప్రపంచప్రసిద్ధిగాంచిన తిరుమలక్షేత్రం నిత్యకల్యాణం పచ్చతోరణంగానే విలసిల్లుతూంటుంది. ఇక్కడ స్వామికి ప్రతిరోజూ కల్యాణమే! ప్రతిరోజూ వైభోగమే!*

*ఆ కల్యాణం చూపరులకు ఎంతో ఆనందంగా, ఆహ్లాదకరంగా, నయనానందకరంగా ఉంటుంది. ఆకోవలో స్వామివారికి కల్యాణోత్సవం జరిపించాలని ఎందరో భక్తులు ఉవ్విళ్ళూరుతుంటారు. స్వామివారికి కల్యాణం చేయించినట్లైతే తమ తమ జీవితాలుకూడా మంగళకరంగా, శుభకరంగా ఉంటాయని వారి విశ్వాసం.*

*అలా ఈ కల్యాణం రాను రాను... గ్రామాలు, మండలాలు, పట్టణాలు, రాష్ట్రాలు, దేశవ్యాప్తంగానేకాక ప్రపంచవ్యాప్తంగా కూడా విస్తరించబడి చేయబడుతున్నాయంటే ఆస్వామి కల్యాణాలకంత ప్రశస్తి ఉందిమరి. అంతగొప్ప విశిష్టతను సంతరించుకొన్న ఆ మలయప్పస్వామివారి కల్యాణోత్సవంగురించి.... మనం ఇప్పుడు తెలుసుకుందాం.....*

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామివారికి సుప్రభాతం మొదలు ఏకాంతసేవవరకు అనేకసేవలు జరుగుతూంటాయి. ఏడాదిపొడుగునా నిత్యమూ జరిగేసేవ శ్రీదేవిభూదేవిసమేత శ్రీమలయప్పస్వామివారి కల్యాణోత్సవం. అందుకే **‘నిత్యకల్యాణం పచ్చతోరణం’** అనే నానుడి వచ్చింది. కల్యాణసంపదలు కోరుతూ అసంఖ్యాకప్రజానీకమూ ఎంతో వైభవంగా చేయించి, కన్నులారా తిలకించే ఉత్సవం ఒక్క నిత్యకల్యాణోత్సవమేనని చెప్పక తప్పదు.

శ్రీదేవిభూదేవిసమేతంగా శ్రీమలయప్పస్వామివారికి నిర్వహించబడే ఈ కల్యాణోత్సవం పూర్వం విశేషదినాల్లో, బ్రహ్మోత్సవాల్లో మాత్రమే నిర్వహించేవారు. క్రీ.శ. 1546వసం॥లో నందకాంశసంభూతుడైన తాళ్లపాక అన్నమాచార్యులు శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిత్యసేవగా ప్రారంభించడమేకాకుండా, తానే స్వయంగా కన్యాదాతగాకూడా వ్యవహరించడం జరిగింది. నాటినుండి నేటివరకు శ్రీవారి కల్యాణోత్సవం ఆ ప్రకారంగానే జరుగుతోంది.

## కల్యాణవేడుక

సంపంగిప్రాకారంలోని కల్యాణమంటపంలో శ్రీమలయప్పస్వామివారు తూర్పుముఖంగా ఒక బంగారుసింహాసనంమీద వేంచేపు చేయబడతారు. వారికి దక్షిణంగా శ్రీదేవి–భూదేవి అమ్మవార్లు మరొక బంగారుసింహాసనంమీద వేంచేపు చేయబడి, ఉత్సవమూర్తులకు చక్కటి పుష్పమాలలతో అలంకరణ చేసి నిత్యకల్యాణోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం చేసి ఉంచుతారు. కామ్యార్థం శ్రీవారికి కల్యాణోత్సవం చేయించటానికి మొక్కుకున్న గృహస్థులను కల్యాణమంటపానికి అనుమతించి వారి గోత్రనామాదులతో సంకల్పం చెప్పించి, స్వామివారికి అభిముఖంగా







కూర్చోబెడతారు. మధ్యాహ్నం 12 గం॥లకు అభిజిల్లగ్నంలో శ్రీవారికి నిత్యకల్యాణోత్సవం ప్రారంభమవుతుంది. శ్రీవారి అర్చకుల ఇంటినుండి కల్యాణోత్సవ కైంకర్య వైఖానస అర్చకులు పసుపుధోవతి ధరించి, బృహస్పతిగా వ్యవహరించే మరో అర్చకునితో సహా 'వోచి' సహాయంతో మంటప ప్రవేశం చేసి శ్రీవారిపాదసేవ చేసుకుంటారు.

సభాప్రార్థనతో కల్యాణోత్సవం ప్రారంభమవుతుంది. తదుపరి క్రమంగా విష్వక్సేనఆరాధన, పుణ్యాహవాచనం, సద్యోఅంకురార్పణ, రక్షాబంధనం, అగ్నిప్రతిష్ఠ వంటి వైదికక్రియలను నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి మధుపర్కనివేదనం, పాదప్రక్షాళన, కూర్చప్రధానం జరిపి, స్వామి-అమ్మవార్లమధ్య మంత్రపూర్వకంగా తెరపడతారు. తదుపరి శ్రీవారికి, అమ్మవార్లకు నూతనవస్త్ర సమర్పణ జరుగుతుంది. మహాసంకల్పం, శ్రీవారి, అమ్మవార్ల గోత్రపఠనం శ్రావ్యంగా చేస్తారు. తర్వాత మాంగళ్యారాధన జరిపి, శ్రీవారిచేతికి తాకించిన మంగళసూత్రములను అమ్మవార్లకు ధరింపజేసి, కర్పూరనీరాజన సమర్పణ చేస్తారు. అర్చకులు హోమగుండంవద్ద ప్రధానహోమం, లాజహోమం, పూర్ణాహుతి, రక్షాతిలకధారణ కైంకర్యాలను పూర్తి చేస్తారు. ఆ వెంటనే 'వారణమాయిరం' కైంకర్యం జరిపి, శ్రీవారికి-అమ్మవార్లకు వేడుకగా పుష్పమాలలు మార్చుకునే ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అమ్మవార్లను స్వామివారివద్దకు వేంచేపుచేసి, 'అక్షతారోపణం' అనే (తలంబ్రాలుపోయడం) వైదికక్రియను నిర్వహించి, కర్పూరహారతి ఇస్తారు. పిదప, శ్రీవారికి మహానివేదన, కర్పూరహారతి సమర్పణతో నిత్యకల్యాణోత్సవం అంగరంగ వైభవంగా సమాప్తి అవుతుంది.

ఎవరైతే స్వామివారిని దేవేరులతో సహా కల్యాణోత్సవం జరుగుతూండగా సేవిస్తారో వారు చేసిన పాపములు ఆ క్షణంలోనే తొలగిపోవటమేకాక తనముందు పదితరాలు తనతరువాత పదితరాలవారుకూడా పాపములనుండి, నరకములనుండి విముక్తులై విష్ణువుయొక్క పరమపదం చేరుకుంటారు. అంతేగాక స్త్రీలందరూ నిత్యం సువాసినులుగా (మాంగల్యభాగ్యంతో) వర్ధిల్లుతారు.



# ఇలవైకుంఠమే ఇది!!

- ఆచార్య హెచ్.ఎస్.బ్రహ్మానంద

సంస్కృతంలోని 'దేవాలయం' అనే మాటను తెలుగుభాషలో 'కోవెల' అంటాం. దీన్నే తమిళంలో 'కోయిల్' అని పిలుస్తారు. 'కో' అంటే దేవుడు. ఇల్- అంటే మందిరం. దైవమందిరమని అర్థం. అందుకే వైష్ణవమహాభక్తులు శ్రీవారిని ధరించిఉన్న 'కోయిల్'ను కూడా ఒక 'ఆళువారు'గా (భక్తశిఖామణిగా) భావిస్తారు. ప్రతిరోజు సుగంధద్రవ్యపరిమళాదులతో పరిశుభ్రంగా ఉంచుతారు. కస్తూరి, చందనం, గంధం, పునుగు, జవ్వాది మొదలైన పరిమళద్రవ్యాల సువాసనలతోపాటు శ్రీవారివంటశాలనుండి వచ్చే మధురమైన అన్నప్రసాదాల గుబాళింపులతో శ్రీవారిఆలయం ఒక ఆధ్యాత్మిక ఆనందంతోపాటు 'సుప్రసన్నత'ను 'మాధుర్యాన్ని' మనస్సుకి కల్గిస్తుంది.

ఈ తొలుత బయటనుండి కనిపించేది 'మహాద్వారగోపురం'. దీన్నే 'పడికావలి' అంటారు. దేవతలు సైతం ఇక్కడికి వచ్చి స్వామివారిదర్శనంకోసం కాచుకొని ఉంటారు. అంచేత పడికావలి అంటారు. దీనిచుట్టూ దట్టమైనప్రాకారం ఉంది. దీన్ని 'సంపంగి' ప్రాకారమని అంటారు. దీని లోపల మరోప్రాకారం ఉంది. దీన్ని 'విమాన'ప్రాకారం అంటారు. దీనిలోపల 'ఆనందనిలయం' గర్భాలయంచుట్టూ ఒక చిన్నప్రదక్షిణమార్గం ఉంది. దీన్ని 'చూళిక' అంటారు. ధనుర్మాసంలో శుద్ధఏకాదశి ద్వాదశినాడు భక్తులు ఈ మార్గంగుండా (వైకుంఠద్వారమని కూడా అంటారు) స్వామికి ప్రదక్షిణంలో వచ్చి ధన్యులవుతారు.







ఇన్నిటినీదాటి లోపలికి వెళ్తే స్వామివారు దర్శనమిస్తారు. ఈ మధ్యలో కృష్ణరాయమండపం, రంగనాయకమండపం, అద్దాలమండపం, తిరుమలరాయమండపం, కల్యాణమండపం(సంపంగి ప్రాకారంలో), వంటశాల(పడిపోటు), బంగారుబావి (లక్ష్మీతీర్థం), పూలబావి (భూతీర్థం), ధ్వజస్తంభమండపం, వెండివాకిలి, వరదరాజస్వామిఆలయం, ఘంటామండపం, గరుడాళ్వారుసన్నిధి, జయవిజయులవిగ్రహాలు- తారసిల్లుతాయి. ప్రతిచోటులోనూ స్వామికి సంబంధించిన ఏదో పురాస్మృతి- మనల్ని తట్టి పలకరిస్తూ ఉంటుంది.



భోగ శ్రీనివాసమూర్తి



కొలువు శ్రీనివాసమూర్తి



ఉభయదేవేరులతో ఉగ్ర శ్రీనివాసమూర్తి



జయవిజయుల పంచలోహవిగ్రహాల నడుమఉన్న ప్రధానద్వారమే 'బంగారు వాకిలి'. దీనిలోపలికిపోగా మొదట 'స్నపన మండపం' దర్శనమిస్తుంది. ఇక్కడే ప్రతి రోజూ భోగశ్రీనివాసమూర్తికి 'కొలువు' జరుగుతుంది. దానిలోపలి నడవ 'శ్రీరాములవారిమేడ'. ఇక్కడ ఒకప్పుడు సీతారామలక్ష్మణులు, వారి పరివార విగ్రహాలు ఉండేవట. అందుకే ఈ పేరు వచ్చింది. దీనిలోపలున్నది 'శయన మందిరం'. అంటే గర్భాలయానికి ముందున్న అంతరాళమే ఇది. ఇక్కడే స్వామివారికి రాత్రిపూట 'ఏకాంతసేవ' (పవళింపుసేవ) జరుగుతుంది. దీని తర్వాత 'కులశేఖరప్పడి' (గడప)ఉంది. దాని లోపలున్నదే 'ఆనంద నిలయ'మనే పేరున్న శ్రీవారి గర్భాలయం.

## ఆనందనిలయం

శ్రీవారిదివ్యమంగళవిగ్రహం ఈ గర్భగుడిలో పశ్చిమంవైపుగోడకు సమీపంగా ఉంటుంది. స్వామివారు నిత్యం 'నిలబడి' ఉన్న మూర్తి(స్థానకమూర్తి). స్వామివారి లోని భక్తత్రాణపరాయణతకు, నిత్యసంసిద్ధతకు తార్కాణం ఈ నిలచి ఉండటం. పడుకున్నవాడు, కూర్చుని, లేచి నిలబడాల్సి వస్తుంది. అంత విరామం స్వామికి లేదు. ఎన్నోలక్షలమంది ఆర్తులవిన్నపాలు నిలబడే వింటాడు. అప్పటికప్పుడు వారి సమస్యల్ని పరిష్కరించడానికి ఎవర్ని పురమాయించాలో వారిని పురమాయించడానికి సంసిద్ధంగా త్రేతాయుగంలోని శ్రీరామచంద్రుడిలాగా ధనుర్బాణాలతో సిద్ధంగా ఉన్నవిధంగా దర్శనమిస్తాడు.

ఈ గర్భాలయంలోని మూలమూర్తితో పాటు భోగశ్రీనివాసమూర్తి, కొలువుశ్రీనివాసమూర్తి, ఉగ్రశ్రీనివాసమూర్తి, ఉత్సవమూర్తి అయిన మలయప్పస్వామి (శ్రీభూ సమేతుడై), విగ్రహాలతోపాటు, రుక్మిణీ శ్రీకృష్ణుల వెండివిగ్రహాలు, శ్రీసీతారామలక్ష్మణుల పంచలోహవిగ్రహాలు, శ్రీసుదర్శనచక్రత్తాళ్వార్ పంచలోహమూర్తి; కొన్ని సాలగ్రామాలు కూడా కొలువై నిత్యార్చనలు అందుకుంటున్నాయి.


## మూలవిరాట్టు

కుడిభుజంపైన చక్రం, ఎడమభుజం పైన శంఖం, క్రింద కుడిచేయి వరదహస్త ముద్రతో; ఎడమచేయి అభయహస్త ముద్రతో, 'త్రిభంగి'లో నడుమువద్ద ఒకించుక వంగి, అద్భుతమైన విలాస భంగిమలో స్వామివారు ఆనందమయ కల్యాణమూర్తిగా సాక్షాత్కరిస్తాడు.

*గోవిందా! గోవిందా!! గోవిందా!!!*



ఉభయదేవేరులతో ఉత్సవశ్రీనివాసమూర్తి (మలయప్పస్వామి)



ధ్రువబేరం

# సదా..
# శ్రీవారి సేవలో..!!

- శ్రీ కర్రి భాస్కరరావు, 78933 95926



తొండమాన్ చక్రవర్తి

వందసంవత్సరాలకుపైగా స్వామిని సేవించిన రంగదాసు మరణానంతరం స్వర్గానికి వెళ్లాడు. మరుజన్మలో తొండమానుడు అనుపేరుతో సువీరుడు, నందిని దంపతులకు కుమారునిగ జన్మించాడు. అయిదవఏటనే ఎవరి ప్రేరణలేకుండ తొండమానునికి విష్ణువుయందు భక్తికుదిరింది. మంచి నడవడిక, శౌర్యం, వీరత్వం అలవడ్డాయి. అతనికి పాండ్యరాజతనయ, సౌందర్యవతి ఐన పద్మతో వివాహమయ్యింది. తర్వాత వందమంది కన్యలు వేరువేరుదేశాలవారు వరించారు. దేవేంద్రభోగములననుభవిస్తున్న ఆ రాజ కుమారుడు ఒకనాడు వేటకు బయలుదేరాడు. పరివారంతో కలిసి వెంకటాద్రి సమీపమున సంచరిస్తూండగా మదధారలను స్రవిస్తోన్న గజరాజును చూచి మిక్కిలి ఆశ్చర్యపడ్డాడు.

ఆ ఏనుగును బంధించాలని వెంటాడుతూ సువర్ణముఖరినదినిదాటి అక్కడ శుకమహర్షిని చూచి నమస్కరించాడు. అతని అనుజ్ఞను తీసుకొని ఆ గజమును వెంబడిస్తూ దారిలో పుట్టఆకారంలో ఉన్న రేణుకాదేవిని చూశాడు. భక్తులకోర్కెలను తీర్చేది, దేవతలతోకూడ పూజింపబడేది ఐన ఆ దేవికి నమస్కరించి, ముందుకు సాగాడు. ఇంతలో ఒక పంచవన్నెలచిలుక కనబడింది. దానిని పట్టుకోవటానికి వెంబడించాడు. ఆ చిలుక 'శ్రీనివాస' అని పలుకుతూ కొండవైపుకు ఎగిరిపోయింది. దానివెనుకే వెళ్తూ గుహలను, శిఖరాలను చూస్తూ ముందుకు సాగాడు. అలా చిలుకను వెతుకుతూ చామలు ఉన్న పొలంవద్దకు వచ్చాడు. ఆ చిలుక కనిపించక పోవటంతో అక్కడున్న కాపలవానిని అడిగాడు. ఆ బోయవాడు రాజును చూచి నిలబడి నమస్కరించాడు. తిరిగీ తొండమానుడు పంచరంగుల చిలుక ఇటువైపు వచ్చింది చూచావా? శ్రీనివాసా అని పలుకుతూ ఎటు వెళ్లింది? అని ప్రశ్నించాడు. అందుకు బోయవాడు "రాజా! ఆ చిలుకంటే శ్రీనివాసునికి మిక్కిలి ఇష్టం. శ్రీదేవిభూదేవులచే పెంచబడుతోంది. అది ఎప్పుడూ స్వామిప్రక్కనే ఉంటుంది. ఈ కొండపై స్వేచ్ఛగా తిరుగుతూ, సాయంత్రానికి స్వామిసన్నిధికి చేరుకొంటుంది. దానిని పట్టుకోవటం ఎవరికీ సాధ్యంకాదు అని చెప్పాడు.




ఆ బోయవాడు తానిపుడు స్వామిని సేవించటానికి పోతున్నానని చెప్పగా, తొండమానుడు తానుకూడా శ్రీనివాసుని చూడ్డానికి వస్తానని చెప్పాడు. సరే అని బోయవాడు తేనెతో కలిపిన చామలను మామిడాకు దొన్నెలో ఉంచుకొని, రాజుతో కలసి బయలుదేరాడు. వారిద్దరు

పుష్కరిణివద్దకు చేరుకొని అందులో స్నానం చేసిన పిదప రాజుకు స్వామిని చూపాడు. అప్పుడు స్వామిపుష్కరిణిఒడ్డున శ్రీవృక్షంక్రింద ఇరువైపుల శ్రీదేవిభూదేవులతోను, చుట్టూ శంఖచక్రగదాది ఆయుధాలతోను ఉన్నాడు. పుట్టలో దాగిన పాదాబ్జములు, జానువులవరకు చేతులు కలిగిన స్వామిని విప్పారిననేత్రాలతో చూచిన రాజు ఆనందతరంగాల్లో తేలి యాడాడు. వారిద్దరు స్వామిని సమీపించి అంజలి ఘటించారు. వనచరుడు తాను తెచ్చిన చామలను స్వామికి నివేదించిన పిదప రాజుకు సగభాగమిచ్చి మిగిలిన సగం తాను భుజించాడు. పిదప పుష్కరిణిలోని నీటిని త్రాగి, ఇద్దరూ చామలతోటవద్ద ఉన్న పర్ణశాలకు వచ్చారు. రాజు అక్కడ ఆ రాత్రి గడిపి, మరుసటిరోజు తన సైన్యంతో నగరికి బయలుదేరాడు.

## తొండమానునికి రేణుకాదేవి, శుకమహర్షుల ఆశీర్వాదం

స్వామిని దర్శించి తిరిగివచ్చేదారిలో తొండమానుడు రేణుకాదేవి ఉన్న వనానికి వెళ్లి ఆమెను పూజించాడు. ఆమెకు పరమాన్నం సమర్పించాడు. ఆ దేవి మిక్కిలి సంతోషించి రాజుకు వరమిచ్చింది. అక్కడున్న ఒక పురుషునిపై ఆవహించి ఇలా పలికింది. "ఓ రాజా! నీ రాజ్యమిక ఎటువంటి సమస్యలు లేని దవుతుంది. నీ పేర ఇక్కడ ఒక రాజధాని నిర్మింపబడుతుంది.




అక్కడ నీవు ఎంతోకాలం రాజ్యం చేస్తావు. నీకు దేవదేవుని అనుగ్రహం కలుగుతుంది అని చెప్పింది".

అలా రేణుకాదేవినుండి అట్టి ఆశీర్వాదమును పొందిన రాజు అక్కడనుండి శుకముని ఆశ్రమానికి వెళ్లాడు. అక్కడ రాజు అభ్యర్థనపై మహర్షి తన ఆశ్రమంవద్ద ఉన్న పద్మసరోవర మాహాత్మ్యాన్ని తెలిపాడు. లక్ష్మీదేవి ఆ పద్మసరస్సులో పదివేల సంవత్సరాలు తపస్సు చేసింది. దేవేంద్రాదిదేవతలు అక్కడికి వచ్చి దేవిని స్తుతించారు. ఆ సరోవరంలో స్నానంచేసి తనను స్తుతించినవారు ముక్తిని పొందుతారని దేవి వరమిచ్చింది అన్నాడు. అలా శుకమహర్షి సూచనప్రకారం రాజు సరోవరంలో స్నానంచేసి, శుకునికి నమస్కరించి తన నగరానికి తిరిగి వెళ్లాడు. ఆ తర్వాత తొండమానునితండ్రి అతనిని తనస్థానంలో అభిషేకించి తాను భార్యతోకలసి తపస్సు చేసుకోవటానికి అడవికి వెళ్లిపోయాడు.

## తొండమానుడు వరాహస్వామిని పూజించుటకు ఆజ్ఞ

తొండమానుడు రాజ్యపాలనం చేస్తూండగా, బోయ వాడైన వసువుపొలంలో స్వామి వరాహరూపాన్ని పొందాడు. పండినచామలను రాత్రివేళల్లో తిని పొలంలో సంచరిస్తూండే వాడు. బోయవాడు పగటివేళ ఆ వరాహపు కాలిగుర్తులను వెదికి వరాహం కనబడకపోవటంతో రాత్రివేళ ధనుస్సు ధరించి కాపలాకాశాడు. అప్పుడు కోటిచంద్రులకాంతితో పొలంలో తిరు గాడుతున్న వరాహాన్ని చూశాడు. చక్కనిరూపంతో ప్రకాశిస్తోన్న ఆ వరాహాన్ని చామలపొలంలో చూచి వసువు ధనుస్సును చేతిలోనికి తీసుకొని సింహనాదం చేశాడు. వరాహం ఆ ధ్వనిని విని బయటకు రాగా బోయవాడు వెంబడించాడు. అలా తిరిగి తిరిగి వరాహము ఒకపుట్టలో ప్రవేశించటం చూచి అతడు కోపంతో ఆ పుట్టను తవ్వాడు. ఆ పుట్టయందు వరాహాన్ని చూచి అతడు మూర్ఛపోయాడు. అదిచూచి బోయవాని పుత్రుడు వరాహస్వామిని స్తుతించాడు. దానికి స్వామి సంతోషించి, బోయవానిపై ఆవహించి ఇలా చెప్పాడు.

"నేను వరాహస్వామిని. ఎల్లప్పుడూ ఈ పుట్టయందే నివసిస్తాను. పుట్టను నల్లని ఆవుపాలతో శుద్ధిచేసి, దానినుండి పైకి వచ్చిన రాతిపై భూమిపై ఉన్న వరాహాన్ని ప్రతిష్ఠించాలి. బ్రాహ్మణులతో, వైఖానసులతో, పలు భోగములతో తొండమాను




మహారాజు నన్ను పూజించాలి" అని పలికి బోయవానిని విడిచి పెట్టగా అతడు తిరిగి స్వస్థుడయ్యాడు. బోయవాడు ప్రశాంతంగా కూర్చున్నతర్వాత అతనికుమారుడు జరిగిందంతా చెప్పాడు. అది విని ఆశ్చర్యపోయిన బోయవాడు అనుచరులతో కలసి తొండ మానునివద్దకు బయలుదేరి రాజ్యద్వారం చేరుకొన్నాడు. రాజు అతణ్ణి లోపలికి తీసుకొనిరమ్మని ద్వారపాలకులతో చెప్పాడు. మంత్రులతో కూడి ఉన్న సభలోనికి అతణ్ణి ఆహ్వానించాడు.

రాజు వసువును, అతని కుమారుణ్ణి, అనుచరులను ప్రేమతో ఆహ్వానించి వారిరాకకు కారణమడిగాడు. అందుకు "రాజా! అడవిలోని నా చామలచేనిలో పడి ఒక వరాహం రాత్రిపూట చామలను తింటోంది. దానిని పట్టుకోవటానికి నేను విల్లును తీసుకొని వెంబడించాను. కానీ, అది వాయువేగంతో పరుగుపెట్టి స్వామిపుష్కరిణితీరంలో ఉన్న ఒకపుట్టలో ప్రవేశించింది. కోపంతో నేను ఆ పుట్టను త్రవ్వాను. అప్పుడు ఆ పుట్టలోని వరాహాన్ని చూచి మూర్ఛపోయాను. నా కుమారుడు అక్కడికొచ్చి శుచియై దేవుడైన మధుసూదనుని స్తుతించాడు. స్వామి నాపై ఆవహించి ఇలా చెప్పాడట.

'ఓ నిషాదా! నా విషయం రాజుకు నివేదించు. రాజు ఇక్కడికి వచ్చి నల్లఆవుపాలతో ఈ పుట్టను శుభ్రం చేయాలి. అప్పుడక్కడ ఒక చక్కని ఆకారంగలరాయి కనిపిస్తుంది. దాంతో పుట్టలో ఉన్నట్లుగా వరాహముఖంతో నా రూపాన్ని శిల్పులతో చెక్కించాలి. దానిని మునులచేత, వైఖానసులచేత ప్రతిష్ఠ చేయించి, రాజు నన్ను కొలవాలి. తర్వాత పాదాలవరకు పుట్టను కలిగిన శ్రీనివాసునివద్దకు వెళ్లి కపిలవర్ణం కృష్ణవర్ణం కలిగిన ఆవులపాలతో అభిషేకించాలి. పాదపీఠంవరకు ప్రతి దినం కడగాలి. అలాగే ఉత్తరదక్షిణదిశలయందు ప్రాకారం నిర్మించాలి" అని పలికి స్వామి నన్ను వదిలిపెట్టాడు. ఆ తర్వాత నేను స్వస్థుడనై ఈ విషయాన్ని మీకు తెలపాలని వచ్చాను అని చెప్పాడు.

## తొండమానునిచే శ్రీనివాసునకు మందిరనిర్మాణం

అలా బోయవాడు చెప్పింది విని తొండమానుడు మిక్కిలి విస్మయం చెంది మంత్రులతో చేయాల్సిన దానినిగూర్చి చర్చించాడు. అన్నిదిక్కులనుండి నల్లావులను, పుల్లావులను వాటిదూడలతోసహా వేంకటాద్రికి తీసుకురావాలని ఆజ్ఞాపించాడు. రేపే యాత్ర ప్రారంభమవుతుందని గోపాలురకు చెప్పాడు. అంతఃపురంలోకి ప్రవేశించి, జరిగిందంతా తన భార్యలకు చెప్పాడు. ఆ రాత్రి కలలో శ్రీనివాసుడు కనిపించి తనను చేరుకోవటానికి బిలమార్గాన్ని చూపాడు. తొండమానుని పురంనుండి బిలద్వారంవరకు చిగురుటాకులను పరిచి దారి చూపించాడు. రాజు మరునాడు ఉదయం మంత్రులను,



బ్రాహ్మణులను రప్పించి తన కలను వివరించాడు. ద్వారంవద్ద చూడగా చిగురుటాకులు కనిపించాయి. తరువాత ఒక శుభ ముహూర్తంలో తొండమానుడు ఒక అశ్వమునధిరోహించి బయలుదేరాడు. దారిపొడవునా చిగురుటాకులను చూస్తూ బిల ద్వారమును చేరుకున్నాడు. అక్కడ ఒక మందిరం నిర్మించటానికి ఏర్పాట్లుచేశాడు.

అంతఃపురమందు బిలము చేసి ప్రాకారాన్నికూడ కట్టాడు. దేవదేవుడు చెప్పినట్లే ప్రక్షాళనం ప్రారంభమయింది. చింతచెట్టు, సంపెంగచెట్లులను కాపాడాలని శ్రీనివాసుడు ఆజ్ఞా పించాడు. చింతచెట్టు శ్రీనివాసునికి స్థానమైనది. సంపెంగ లక్ష్మీదేవికి స్థానమైనది. కనుక వీటికి రాజులు, మునులు, దేవతలు నమస్కరిస్తారు. మిగిలిన చెట్లను కొట్టించి ద్వారము, గోపురంతో కూడుకున్న ప్రాకారాన్ని నిర్మించు. విమానమును మాత్రము మీ వంశానికి చెందిన నారాయణుడు అను రాజు నా భక్తుడై నిర్మించి బంగారంతో అలంకరిస్తాడు అని వరాహస్వామి చెప్పాడని శ్రీనివాసుడు తొండ మానుడితో చెప్పాడు.

ఈవిధంగా ప్రాకారాన్ని నిర్మించి వైఖానసవంశంలో జన్మించిన మునిపుంగవులతో ప్రతిదినము బిలమార్గంద్వారా స్వామివద్దకు వెళ్లి అర్చిస్తూ, రాజ్యమును ధర్మమార్గమున పాలిస్తూ అనేకభోగములను అనుభవించాడు. ఆ కోట యందే నివసిస్తూ భూమినంతటిని జయించాడు.

## స్వామి తొండమానునికి.. సారూప్యమును ప్రసాదించుట

ఆ తర్వాత తొండమానుడు తన కుమారుడైన శ్రీనివాసుని విధిపూర్వకం అభిషేకించాడు. భూమిని, ప్రజలను ధర్మమార్గమున పరిపాలించమని కుమారునికి చెప్పాడు. అతనికి తగిన సహాయసహకారములిమ్మని మంత్రులకు అప్ప గించాడు. తపస్సుకై వనాలకు వెళ్లిపోయాడు.

తర్వాత చాలాసంవత్సరాలు ఘోర తపస్సు చేశాడు. ఆ తపస్సుకు శ్రీదేవిభూదేవులతో స్వామి గరుడునిపై అక్కడికొచ్చి ప్రత్యక్షమయ్యాడు. తొండమానునితపస్సుకు మెచ్చిన స్వామి, ఓ రాజా! నీ తపస్సుకు మెచ్చాను. ఏమి వరం కోరుకుంటావు అని అడిగాడు.

అందుకు రాజు అంజలిఘటించి, "స్వామీ! జరా మరణంలేని నీలోకమందు నివసించాలని కోరుకుంటున్నాను. నాకోర్కెను తీర్చుమని" తొండమానుడు భూమిపై వ్రాలి సాష్టాంగపడ్డాడు.

వెంటనే అతడు స్వామి వరప్రభావంచేత శరీరం విడిచి, అక్కడికి వచ్చిన దివ్యవిమానమెక్కాడు. గంధర్వులు స్తుతిస్తూండగా స్వామిరూపంవంటిరూపాన్ని (సారూప్యమును) పొంది, శోకమోహాలు, ముసలితనం, మరణంలేనిది, వెనుకకు తిరిగిరానిది అయిన వైకుంఠం చేరుకున్నాడు. *(ఆధారము: శ్రీస్కాందమహాపురాణము, ద్వితీయవైష్ణవఖండము)*





# గోవిందుడికే.. పాలిచ్చిన గోవు

- డా॥ యస్.పద్మావతి, 96762 69300

గోవును 'గోమాత' అని వినమ్రంగా పిల్చుకుంటాం. మాత అంటే తల్లి. గోవు ప్రతిఒక్కరికీ కన్నతల్లివంటిది. ఎందు కంటే ప్రతిఒక్కరూ గోక్షీరం త్రాగి పెరిగినవారే. కన్నతల్లి పిల్లలకు స్తన్యమునిచ్చి పెంచినట్లుగా గోవుకూడా ప్రతిఒక్కరికీ క్షీరమునిచ్చి పోషిస్తుంది. బాల్యంలోనే కాదు పెరిగి పెద్దయ్యాక, వృద్ధాప్యంలోకూడా ప్రతిఒక్కరూ గోక్షీరంతో ఆయురారోగ్యాలను పొందుతున్నారు.

శ్రీమహావిష్ణువే వేంకటాచలమున(తిరుమలలో) వెలసి శ్రీనివాసుడుగా, శ్రీవేంకటేశ్వరుడుగా కీర్తించబడుతూ, పూజలందు కొంటూ, లోకరక్షణ గావిస్తున్నాడు. శ్రీమహావిష్ణువు వేంకటా చలంలో సంచరించి, ఈ క్షేత్రంలో అర్చామూర్తిగా వెలసి కలి యుగదైవంగా పూజలందుకొంటూ భక్తులను కటాక్షించడంలో గోమాతప్రమేయం ఎంతో ఉంది. శిశువులకే కాదు శ్రీని వాసునికి కూడా క్షీరమునిచ్చి కాపాడింది గోమాత.

భృగువు విష్ణువక్షఃస్థలంపై తన్నడం, విష్ణువతనిని దండించకుండా సత్కరించడం, ఈ విపరీతచర్యలను అస్సలు



భరించలేక విష్ణువును, వైకుంఠమును వీడి భూలోకానికి వచ్చే సింది లక్ష్మీదేవి. లక్ష్మిని వెతుక్కుంటూ విష్ణువుకూడా భూలోకా నికి విచ్చేసి వేంకటాచలమునకు వెళ్లి ఒక వల్మీకంలో (పుట్టలో) తపస్సు చేసుకుంటున్నాడు.

అలా వల్మీకంలో తపస్సుచేస్తున్న నారాయణుని గమనించిన బ్రహ్మమహేశ్వరులు ఆ స్వామికి క్షుద్బాధ కలుగ కుండా ఉండడంకోసం గోవత్సాలుగా (ఆవు, దూడలుగా) మారి చోళరాజుయొక్క ఆలమందలో చేరారు. అలా రాజుగారి ఆలమందలో చేరిన ఆ గోవు అన్ని గోవులతోపాటు మేతకై వేంకటాచలం అడవికి వెళ్లి మందనుంచి దూరంగా వెళ్లి విష్ణు మూర్తి తపస్సు చేస్తున్న వల్మీకంవద్దకు వెళ్లి నిలబడి ఆ పుట్ట లోకి పడేలా తన పొదుగునుంచి పాలధారలను విడిచేది. అలా పుట్టలోకి వస్తున్న పాలను పుట్టలోఉన్న నారాయణుడు ఆనందంగా ఆరగించి ప్రశాంతంగా తపస్సు సాగించేవాడు.

అలా, ఆవు తన అలవాటుప్రకారం నేరుగా పుట్టవద్దకు వెళ్లి పుట్టలోకి పాలను ధారలుగా విడుస్తుంది. అది చూచి



గొల్లవాడు ఆగ్రహోదగ్రుడైనాడు. "ఇదా ప్రతిరోజూ నువ్వు చేస్తున్న పని? ప్రతిరోజూ పాలన్నీ ఈ పుట్టలోకి పోసేసి వట్టి పొదుగుతో ఇంటికొచ్చి నన్ను దొంగను చేస్తున్నావా? నన్ను సంకటంలో పడేస్తున్నావా? ఇయ్యాల నీ అంతు చూస్తాను" అంటూ గొడ్డలి పైకెత్తి గోవుమీదకు విసరబోయాడు. అది గ్రహించాడు పుట్టలో ఉన్న స్వామి.



ఇన్నాళ్ళూ ఎంతో భక్తితో ఎంతో శ్రమపడి వచ్చి తనకు క్షీరమిచ్చి కాపాడుతున్న గోవుమీద దెబ్బ పడబోతుందని గ్రహించిన స్వామి వెంటనే పుట్టనుండి పైకి లేచాడు. గోవు మీదకు విసరబడిన గొడ్డలి నారాయణునికి తగిలింది. స్వామికి నుదురుపై తీవ్రగాయమయ్యి రక్తం చిమ్మింది.

అదిచూసి గొల్లవాడు బిత్తరపోయాడు. కళ్ళు బైర్లు కమ్మి స్పృహతప్పి పడిపోయాడు. స్వామికి నుదురునుంచి రక్తం స్రవిస్తూంది.

అయితే గోమాత అంతటితో ఊరుకోలేదు. ఒకవైపు తాను ఇన్నాళ్ళూ క్షీరమిచ్చి కాపాడుకున్న స్వామికి తీవ్ర గాయమయ్యింది. ఇంకోవైపు తనకు ప్రతిరోజూ మేతనందించి తన యోగక్షేమాలు చూస్తున్న గొల్లవాడు స్పృహలేకుండా పడిపోయాడు. వీరిరువురిని ఎలాగయినా రక్షించాలనుకుంది. అందుకే పరుగెత్తుకుంటూ చోళరాజుభవనానికి వెళ్ళింది. రాజుగారిముందుకెళ్ళి క్రిందపడి పొర్లుతూ, కన్నీరు విడుస్తూ, తలఊపుతూ మహారాజును పిలుస్తూ ఏవేవో సంకేతాలు చేసింది.

ఆవుచర్యలు ఏవోసంకేతాలుగా అనిపించి ఎక్కడో ఏదో ప్రమాదం జరిగినట్లుంది అని తలచి రాజు కంగారు పడుతూ ఆవువద్దకు వచ్చి నిలబడ్డాడు. గోవు వెంటనే పైకిలేచి



రాజుకు దారి చూపిస్తూ ముందు నడవసాగింది. ఎక్కడ ఏమి జరిగిందా అని గాబరాపడుతూ రాజు ఆవును అనుసరించాడు. ఆవు నేరుగా పుట్టవద్దకు వెళ్ళి ఆగింది. ఆవువెంట వచ్చిన రాజు అక్కడిదృశ్యం చూసి నిశ్చేష్టుడయ్యాడు.

ఆ తర్వాత నారాయణుడు గొల్లవానిని స్వస్థుణ్ణి చేసి ఆ రాజుకు విషయమంతా వివరించి వారిరువురికి వరాలిచ్చి పంపించాడు.

ఇక్కడ గోమాత భగవంతునిపట్ల చూపిన భక్తి, గొల్లవానిపట్ల చూపిన కృతజ్ఞత, వారిరువురిపట్ల తనవంతు బాధ్యత నెరవేర్చినతీరు అమోఘం, అద్వితీయం.

ఈవిధంగా నారాయణునికి అనుదినమూ తన క్షీర మందించడమే కాక స్వామికి ఆపద కలగగానే వెంటనే స్పందించి తగుచర్య తీసుకొని స్వామికి ఉపకారం కలిగే మార్గం కల్పించింది, అట్లే అచేతనంగా పడిపోయిన గొల్లవానిపట్ల కూడా ఎంతో కృతజ్ఞతతో, ఎంతో బాధ్యతగా వ్యవహరించింది గోమాత.

ఇక్కడ గోమాత భగవంతునిపట్ల అంత భక్తి కలిగి, అంత అంకితభావంతో సేవించింది కాబట్టే భగవంతునియొక్క అమిత అనుగ్రహాన్ని పొందగలిగింది.

ఈ విధంగా భగవంతుణ్ణి నిర్మలమనసుతో, నిశ్చల భక్తితో సేవించి, స్వామి అనుగ్రహాన్ని పొంది, ఆ నారాయణుడు వేంకటాచలమున వెలసి భక్తులను కటాక్షించడానికి దోహదం చేసిన గోమాత అందరికీ పూజ్యనీయం. బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలసందర్భంగా గోమాత విశేషాలను స్మరించుకోవడం ఆనందదాయకం, పుణ్యఫల దాయకం.




# అలా.. మొదలై - ఇలా.. జరుగుతున్నాయి!!




- ఆచార్య కె.వి.రాఘవాచార్య, 97043 42668

చారిత్రకంగా క్రీ.శ.10వశతాబ్దంలో తిరుమలఆలయంలో వేసిన ఒక తమిళశాసనంలో మొదటిసారిగా తిరువేంగడనాథుని బ్రహ్మోత్సవాల ప్రస్తావన ఉంది. నేడు శ్రీవేంకటేశ్వరస్వామియొక్క కౌతుకమూర్తిగా, ప్రతినిధిగా నిత్యమూ అభిషేకం, ఏకాంత సేవ, సహస్రకలశాభిషేకం మున్నగుసేవలను జరిపించుకొంటున్న భోగశ్రీనివాసమూర్తి (మనవాళప్పెరుమాళ్) వెండివిగ్రహాన్ని శక్తివిటంకన్ అనే పల్లవ రాజ్యాధికారి భార్య సామవై పెరుందేవి శ్రీవారికి కానుకగా సమర్పించి, అక్షయనామసంవత్సర జ్యేష్ఠబహుళతదియ శుక్రవారం, శ్రవణానక్షత్రంనాడు (8-06-966 తేది) తిరుమల దేవాలయంలో తిరువిలాన్ కోయిల్ (నేటి స్నపనమండపం) నిర్మించి, ప్రతిష్ఠించింది. (శాసనం 1-8,9, తి.తి.దే., శాసనాలు, 1988) సామవైపెరుందేవి (ఈమెపేరుతో తిరుమలలో పెరుందేవితోట ఉన్నది) పెరటాసినెలలో (కన్యాఆశ్వయుజమాసంలో) చిత్తానక్షత్రంనాడు ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు తాను సమర్పించిన భోగశ్రీనివాసమూర్తిని ఉత్సవమూర్తిగాజేసి ఉత్సవాలను జరిపించాలని కోరింది. సామవైపెరుందేవి భోగశ్రీనివాసమూర్తికి అమూల్యమైన కెంపులు, పచ్చలు, ముత్యాలు, జాతిరత్నాలు పొదిగిన కిరీటం, మకరకుండలాలు, హారాలు, కేయూరాలు, కంకణాలు, బంగారువడ్డాణం, మొలనూలు, ఉదరబంధం మొదలగు ఆభరణాలను సమర్పించింది. ఈ ఉత్సవమూర్తి నైవేద్యాలకు, ఉత్సవనిర్వహణకు పెరటాసి, మార్గళి (ముక్కోటిఏకాదశి) నెలల్లో జరిగే బ్రహ్మోత్సవాలకు 4177 కుళీల పంటభూమిని సమర్పించింది. ఈ దానశాసనం చివరలో **"యెన్ ఇత్తన్మం ఇరక్షిప్పార్ శ్రీపాదం ఎన్తలైమెలదు"** (ఈ దానధర్మాలను కాపాడువారి శ్రీపాదాలను నేను శిరసా వహిస్తాను) దీనిని శ్రీవైష్ణవులు రక్షించుదురుగాక! అని కోరింది. ఎంత ఔదార్యం! ఆ చల్లనితల్లికోరిక ఆదర్శప్రాయం గదా! క్రీ.శ.966నాటి సామవై పెరుందేవి శాసనాలు తిరుమల శ్రీవారి ఆలయం మొదటిప్రాకారం ఉత్తరపుగోడపై చెక్కబడి ఉన్నాయి. సామవై పెరుందేవి దానశాసనంవల్ల క్రీ.శ.10వశతాబ్దంలో తిరుమలలో 11రోజులపాటు బ్రహ్మోత్సవం (ప్రధానఉత్సవం) (9రోజులు) జరుగుతుండేదని తెలుస్తోంది. అయితే, ఆలయాధికారులు, పన్నెండు మంది అర్చకులు భోగశ్రీనివాసమూర్తి విగ్రహాన్ని కౌతుకమూర్తిగ (మూలమూర్తికి ప్రతినిధిగ) ఉగ్రశ్రీనివాసమూర్తిని (స్నపనబేరం) ఉత్సవమూర్తిగ ఉపయోగించారు. సామవై కోరిక నెరవేరలేదు. క్రీ.శ.1339 నుండి మలయప్పకోనలో లభించిన మలయప్పస్వామిని ఉత్సవమూర్తిగ ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు శ్రీదేవి,




**సామవై**
వేయించిన రెండుశాసనాలు
ప్రథమప్రాకారంలో విమాన వేంకటేశ్వరుని
క్రింద ఉత్తరపుగోడపై చెక్కబడి ఉన్నాయి.
ఈ రెండుశాసనాలు ఉన్న ఉనికిని చూపే ఊహాచిత్రమిది.



భూదేవీసహితుడైన మలయప్పస్వామికే నిత్యకల్యాణోత్సవాలు, ఇతరఉత్సవాలు, బ్రహ్మోత్సవాలు, ఊరేగింపులు జరుగుతున్నాయి.

శ్రీవేంకటేశ్వరస్వామికి క్రీ.శ.14 శతాబ్దంవరకు రెండు (పెరటాసి, మార్గళినెలల్లో) బ్రహ్మోత్సవాలు జరుగుతుండేవి. క్రీ.శ.1300 సంవత్సరంలో తిరువేంకటనాథయాదవరాయని కాలంలో రాచయదండనాయకుని పేరుమీద సింగమదండ నాయకుడు ఆడి(ఆషాడం) తిరునాళ్ళు ఏర్పాటుచేశాడు. ఇందుకుగాను ఇల్లత్తూరునాడులోని పొంగళూరుగ్రామాన్ని సర్వ మాన్యంగా దానం చేశాడు (శాసనం:1-99, తి.తి.దే. శాసనాలు, 1998) క్రీ.శ.13-01-1388 నాడు విజయనగర ప్రభువు రెండవహరిహరరాయలు మాసి(మాఘమాసం) తిరు నాళ్ళను నిర్వహించడానికి పూంగోడుగ్రామాన్ని దానం చేశాడు. ఈ గ్రామంపై వచ్చే ఆదాయంలో బ్రహ్మోత్సవాన్ని జరుపు కార్యభారాన్ని ముల్లై తిరువేంకటజీయరు వహిస్తాడని శాసనం తెలియజేస్తున్నది. (శాసనం 1-185) రెండవదేవరాయలు 5-2-1429 తేదీన మూడుగ్రామాలు, 2200 పొన్నులు ఉత్సవ నిర్వహణకు, నైవేద్యాలకు దానం చేశాడు. ఈ ఉత్సవం అల్పిశి (ఆశ్వయుజమాసంలో)లో పునర్వసునక్షత్రంరోజునుండి స్వాతి నక్షత్రంరోజువరకు (9రోజులు) జరుగుతుంది. స్వాతినక్షత్రం నాడు చక్రస్నానం జరుగుతుంది. (శాసనం.1-192) శ్రీవేంక టేశ్వరస్వామికి క్రీ.శ.15శతాబ్దంలో ఏడుబ్రహ్మోత్సవాలు జరుగుతుండేవి. అవి చిత్రి, ఆడి, ఆవణి, పెరటాసి, అల్పిశి, మాసి, పంగుణినెలల్లో జరిగేవి. ఈ ఏడు బ్రహ్మోత్సవాలలో చక్రస్నానంరోజున శ్రీవేంకటేశ్వరస్వామికి అనంతశయనారు అనుభక్తుడు నైవేద్యాలు ఏర్పాటుచేశాడు. (శాసన:1-213 తేది: 15-02-1445) శ్రీవైష్ణవమతం ద్రవిడదేశంనుండి తెలుగు దేశానికి వ్యాపించింది. కనుక తిరుమలలో, శ్రీవైష్ణవదేవా లయాలలో ద్రావిడ ప్రాంతీయ సంప్రదాయాలను అనుసరించి కొన్ని ఉత్సవాలు సౌరమానంప్రకారం జరుపబడుతున్నాయి. అయితే కొలువు మొదలగు నిత్యకార్యక్రమాలు, కొన్ని ఉత్సవాలు తెలుగువారి సంప్రదాయం అయిన చాంద్రమానం పంచాంగం అనుసరించి జరుపబడుతున్నాయి.

తాళ్లపాక పెదతిరుమాలాచార్యులు (అన్నమాచార్యుల కుమారుడు) రెండువేలవరహాలను శ్రీవారిభండారానికి సమ ర్పించి తనపేర ఆణినెలలో (జ్యేష్ఠమాసం) 13రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాన్ని (ప్రధానఉత్సవం 11రోజులు) ఏర్పాటు చేశాడు. (దానశాసనం; 4-129 తేది:7-3-1539) ఈ బ్రహ్మో త్సవం జ్యేష్ఠమాసంలో (ఆణినెలలో) శ్రవణనక్షత్రంనాడు ప్రారంభమై మృగశిరనక్షత్రం (తిరుమలాచార్యుని జన్మనక్షత్రం) నాడు చక్రస్నానంతో ముగిసేది. విజయనగరప్రభువు సదాశివ రాయలకాలంలో రాయసంవేంకటాద్రి అనే భక్తుడు తిరుమలలో జరిగే పదిబ్రహ్మోత్సవాలలో కొలువు శ్రీనివాసమూర్తికి (అళగప్పి రానారు) నైవేద్యాలు ఏర్పాటుచేసి 700 రేఖైపొన్నులు ఆదాయం వచ్చే దేసూరుగ్రామాన్ని, 200 రేఖైపొన్నులు ఆదాయం వచ్చే వేలాంజినేడుగ్రామాన్ని, 130 రేఖైపొన్నులు ఆదాయంవచ్చే సగం



తిమ్మసముద్రంగ్రామాన్ని- మొత్తం 1030 రేఖైపొన్నులు ఆదాయంవచ్చే 21/2 గ్రామాలను- శ్రీవేంకటేశ్వరస్వామికి దానంగా సమర్పించి 8-7-1551నాడు శాసనం (5-129) వేయించాడు. ఆ సందర్భంలో ఎవరెవరు ఏ ఏ నెలల్లో జరిగే బ్రహ్మోత్సవాలను ఏర్పాటుచేసింది. వాటి వివరాలు ఆ శాసనంలో తెలిపాడు. ఆ వివరాలు ఇట్లున్నాయి.

| క్రమ సంఖ్య | ఏర్పాటుచేసిన దాత | బ్రహ్మోత్సవం |
|---|---|---|
| 01 | తిరునిన్ర ఉర్దైయార్లు (తిరుమలఆలయఅధికార్లు) | ఆవణిబ్రహ్మోత్సవం |
| 02 | సామవై పెరుందేవి (బ్రహ్మదేవునిపేరున) (శక్తివిటంకన్ భార్య పల్లవరాణి) | పెరటాసిబ్రహ్మోత్సవం |
| 03 | దేవరాయమహారాయలు | పెరటాసిబ్రహ్మోత్సవం |
| 04 | బుక్కరాయమహారాయలు | కార్తికిబ్రహ్మోత్సవం |
| 05 | కృష్ణదేవమహారాయలు (తల్లిదండ్రులపేరున) | తైబ్రహ్మోత్సవం |
| 06 | హరిహరరాయమహారాయలు | మాసిబ్రహ్మోత్సవం |
| 07 | వీరనరసింగయాదవరాయలు | పంగుణిబ్రహ్మోత్సవం |
| 08 | మేలుదయారు (ఆలయాధికారి) | చిత్తిరిబ్రహ్మోత్సవం |
| 09 | తాళ్లపాక తిరుమలాచార్యులు | ఆణిబ్రహ్మోత్సవం |
| 10 | రామరాజు చినతిమ్మరాజు | ఆణిబ్రహ్మోత్సవం |

ఈవిధంగా క్రీ.శ.16శతాబ్దంలో శ్రీవేంకటేశ్వరస్వామికి తొమ్మిదినెలల్లో పదిబ్రహ్మోత్సవాలు 9, 11, 13 రోజులపాటు జరుగుతుండేవి. ఈ బ్రహ్మోత్సవాలన్నీ కూడ సర్వమాన్యగ్రామాల, దేవమాన్యగ్రామాల భూముల సంవత్సరఆదాయంపై ఆధారపడి జరుపబడు తుండేవి. ఒక్క తాళ్లపాక పెదతిరుమలాచార్యులు మాత్రం శ్రీభండారానికి రెండువేలవరహాలు సమర్పించి ఆణిబ్రహ్మోత్సవాన్ని తనపేర ఏర్పాటుచేశాడు.

క్రీ.శ.18వశతాబ్దంనాటికి ఈ దానగ్రామాలు, భూములు విదేశీయుల, పరమతస్థుల పరిపాలనకులోనై అన్యాక్రాంతం అయినాయి. స్థిరాస్తుల ఆదాయం పోవడంచేత వారు ఏర్పాటుచేసిన ధర్మాలు, ఉభయాలు నిలిచి పోయాయి. వారు ఏర్పాటుచేసిన బ్రహ్మోత్సవాలు నిలిచి పోయాయి. అంతేగాక దాతలందరు వారిపేర, వారి జన్మ నక్షత్రంనాడు చక్రస్నానం నిర్ణయించి ముందు ఎనిమిది, తొమ్మిదిరోజులనుండి జరిగే బ్రహ్మోత్సవాలను ఏర్పాటుచేశారు. (చూడు. దానశాసనాలు, 1-192 తేది 5-12-1429, తాళ్లపాక పెదతిరుమలాచార్యుల దానశాసనం 4-129 తేది 7-3-1539)వారి తదనంతరం వారు ఏర్పాటుచేసిన ధర్మ కార్యాలు సహజంగా నిలిచిపోయాయి.

అయితే సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు లోకకల్యాణం కోసం శ్రీవేంకటేశ్వరస్వామి అవతారనక్షత్రం కన్యాశ్రవణంనాడు చక్రస్నానం నిర్ణయించి ముందు తొమ్మిదిరోజులనుంచి నిర్వ హించిన బ్రహ్మోత్సవాలు (బ్రహ్మదేవునిపేర పల్లవరాణి సామవై పెరుందేవి క్రీ.శ.966లో ఏర్పాటుచేసినవి) మాత్రం అఖండ వైభవంతో ఆనాటినుండి నేటివరకూ కొనసాగుతూ శ్రీవేంక టేశ్వరవైభవాన్ని దశదిశలా చాటుతున్నాయి. ఇవి అంకు రార్పణ, ధ్వజారోహణంతో మొదలై చక్రస్నానం, ధ్వజావరో హణంతో ముగుస్తున్న పదిరోజుల తిరునాళ్ళు. వీటిని తమిళ భాషలో తిరుక్కోడితిరునాళ్ అని పిలిచేవారు. ఈపేరే శాస నాలలో ఉంది.

ప్రస్తుతం తిరుమలలో కన్యామాసంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలు తొమ్మిదిరోజులపాటు జరుగుతున్నాయి. అయితే చాంద్రమానరీత్యా సంవత్సరంలో అధికమాసం వచ్చినప్పుడు రెండుబ్రహ్మోత్సవాలు జరుగుతాయి.



ధారావాహిక

# శ్రీమద్భగవద్గీత

– ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ

*గతసంచిక తరువాయిభాగం...*

**వాసాంసి జీర్ణాని యథావిహాయ నవాని గృహ్ణాతి నరో௨పరాణి।
తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ॥
॥222॥**

అని అందరూ ఏమనుకుంటున్నారు. దేహంపుడితే ఫలానావాడు పుట్టాడు. దేహం మరణిస్తే ఫలానావాడు మరణించాడు అననుకుంటున్నారు. అదేమిలేదు 'వాసాంసి జీర్ణాని యథా విహాయ' కట్టుకున్నటువంటిబట్టలు పాతబడిపోతే దాన్ని విడిచి పెట్టి క్రొత్తబట్టలు కట్టుకున్నట్లుగా' నవాని గృహ్ణాతినరోప రాణి' సామాన్యంగా జనులందరును ఇలాగే చేస్తారుగదా! బట్టలు పాతబడిపోతే బట్టలను విడిచిపెడతారు. విడిచిపెట్టి క్రొత్త వస్త్రాలను ధరిస్తారు. క్రొత్తబట్టలను కట్టుకున్నమనిషి వేరై పోతాడా? పాతబట్ట కట్టుకున్నవాడు వేరేవాడు, క్రొత్తబట్ట కట్టుకున్నవాడు వేరేవాడు అనే పరిస్థితి లేదుగదా! అట్లాగే ఆ వస్త్రం అనేస్థానంలో శరీరం ఉంచుకుంటే బాగా జీర్ణమైపోయినటువంటి శరీరాన్ని బాగా పాతబడిపోయినశరీరాన్ని విడిచిపెట్టి 'తథాశరీరాణి విహాయ జీర్ణాని అన్యాని సంయాతి' క్రొత్త శరీరాల్ని గ్రహించటానికి ఆత్మను ఉపక్రమిస్తాడు. 'నవానిదేహీ' అంటే దేహాలు కొన్ని క్రొత్తదేహాలుగా పుడుతున్నాయి. కొన్ని పాతవైపోయిన దేహాలు విడిచిపెట్టేస్తున్నాడు. క్రొత్తవైనదేహాలను స్వీకరిస్తూ ఉన్నాడు. ఎవరు? ఒక్కడు!! కాబట్టి దేహాలు మారిపోతున్నప్పటికిన్నీ మారనివాడు ఒకేఒకఆత్మ అనేవిషయం చెప్పినట్లయింది. 'నిత్యః' అనేవిషయాన్ని దేహాలు చూపిస్తూ దేహాలు అనిత్యమైనవి. అనిత్యమైనదేహాలు వస్తూపోతూ ఉంటాయి. ఆత్మస్వరూపం మాత్రం అలాగే నిలిచిఉంటుంది అని మరొకసారి ఈ భావనను మనకు స్థిరం చేస్తున్నాడు. మనం ఏ విషయం చెప్పినాసరే పునరుక్తిలో ఉన్నాసరే చిన్న విషయం క్రొత్తదిగా ఉంటుంది. ఏదో ఒకసందేహం తొలగిపోవటానికే కదా మనలాంటి వాళ్లందరిని దృష్టిలో ఉంచుకొని మీరుచెప్పిన దేహంవేరు ఆత్మవేరు. ఒప్పేసుకున్నాం. కాని మాకు దేహమంటే వల్లమాలినప్రేమ. కేవలం మాదేహమేకాదు మాకు సంబంధించినవాళ్లందరిదేహాలు అన్నిఅన్నా మాకు ప్రేమ. ఆప్రేమతో ఎవరైనా దేహం విడిచిపెట్టినా మాకు సంబంధించిన వాళ్లెవరైనా దేహం విడిచిపెడితే బాధపడతాం. మాకు దేహం విడిచి వెళ్లాల్సొస్తుందేమో అనేపరిస్థితి వస్తే భయపడిపోతాం. బాధపడిపోతాం. మీరుచెప్పినవిషయం ఒప్పుకోకకాదు. మీరు చెప్పింది యథాతథంగా ఒప్పుకుంటాం. దేహంవేరు, ఆత్మవేరు కాని మాకు ఇష్టంమాత్రం దేహంమీదే! ఈ దేహంమీద మనకు ఉన్నంతప్రేమ ఇంకెవరిమీదైనా ఉన్నదా? ఎక్కడాలేదు కాబట్టి మన అనుభవసారంగా వచ్చినప్రశ్న.

ఈ ప్రశ్నకి పరమాత్మ ఎన్నిదేహాలమీద ఇలాగే ప్రేమ పెంచుకున్నావు? ఒకేదేహంమీద? నీకున్నది ఇదొక్కటేనా దేహం? ఇంతకుముందు దేహం లేదా? ఇకమీద దేహం రాబోవటం లేదా? ఒకదేహంమీద ప్రేమైతే ఫరవాలేదు. ఎన్నిదేహాలు పోయినాయి? ఎన్నిదేహాలు రాబోతున్నాయి? ఇది మధ్యలో ఉండే ఒకేదేహం. ఇలాంటి దేహంమీద నీకెందుకు ప్రేమ? అనవసరమైనటువంటి ప్రేమ. నువ్వు ఇలా ప్రేమించిన ఎన్నో దేహాలను విడిచిపెట్టినావు.

పిల్లవాడు పండుగరోజున క్రొత్తడ్రస్ చాలా ఇష్టంగా తొడుక్కున్నాడు. ప్రతిరోజు అదేడ్రస్ కావాలంటాడు. కొన్ని రోజులకి అది చిరిగిపోయింది. నాకా డ్రస్‌వద్దు క్రొత్తదికావాలి అంటున్నాడు. నిన్నటివరకు ఆడ్రస్ తప్ప వేరేదివద్దు అన్నవాడు అది చిరిగిపోగానే నాకు క్రొత్తది కావాలి అన్నాడు. వాడికి ఆడ్రస్‌మీద ప్రేమ ఉన్నట్లా లేనట్లా? ప్రేమలు శాశ్వతం కాదు. తాత్కాలికంగా ఉంటుంది. కొన్నాళ్లు ఈ డ్రస్‌మీద, ఇంతకంటె అందమైన డ్రస్ కనిపిస్తే దానిమీద ప్రేమలుంటాయో చెప్పలేం. వస్త్రంమీద కట్టుకొనేవాడికి ప్రేమలేదు. ప్రేమ తనమీదే. ఆ కట్టుకునేవాడిస్థానంలో దేహాలను గనుక ఉంచినట్లయితే ఎన్ని దేహాలను మనం ధరించాము? ఎన్నిదేహాలను కట్టుకున్నాము? విడిచిపెట్టాము. దేహాలమీద మనకు సరియైన ప్రేమలేదు. సరియైన ప్రేమ మనమీద మనకే ఉంది. ఆ ప్రేమ ఏమిటో తెల్చుకోలేక ఇటుఅటుగా ఉండి ఈరకమైనమాటలు మాట్లాడుతున్నావు. ఆ ప్రేమ నీకు దేహాలమీద కాదు. మానవులకు తమకు అనుకూలంగా ఉండే వస్తువులమీద ప్రేమ ఉంటుంది. మిగతాప్రాణులకు ఎలా ఉంటుంది అని మనం అడగలేదు.

*(ఇంకా ఉంది)*

# శ్రీవేంకటేశ్వరలీలలు




# నమ్మినోళ్లకి నమ్మినంత!!

- శ్రీమతి పి.వి.ఎస్.లక్ష్మి, 93968 05345

మా ఇలువేల్పు ఆ ఏడుకొండలవాడు. మాకు ఏ కష్టమొచ్చినా, సమస్యలొచ్చినా 'నాకెవరి సాయం వద్దు. నాకు ఆ ఏడుకొండల వాడు ఉన్నాడు' అనేవారు మా నాన్నగారు. అందుకే మాకందరికీ ఆ స్వామి అంటే ఎనలేని భక్తి, నమ్మకం.

అప్పుడు నేను ఇంటర్ చదివేదాన్ని. ఒకరోజు కళాశాల నుండి ఇంటికొచ్చేసరికి, మా అమ్మ, నాన్న చాలా విచారంగా కనిపించారు. నన్నుచూచి "నాన్నకేవీ సరిగా కనిపించడం లేదంట. అక్షరాలైతే పూర్తిగా కనబడటం లేదంట. అందుకని వైద్యుడివద్దకు వెళ్తే నీ కంటిసమస్య చాలా పెద్దది. వెంటనే పెద్ద ఆసుపత్రికి వెళ్లి చూపించుకో!" అన్నారని ఏడుస్తూ చెప్పింది మా అమ్మ. అమ్మా, నాన్న అలా ఏడుస్తూనే ఉన్నారు. నాకైతే ఏమిచేయాలో కూడా అర్థం కాలేదు. ఎందుకంటే నాన్న ఒక ప్రైవేటుబ్యాంకులో గుమాస్తా. పైగా ఐదుగురుసంతానం. అందుకే ఆ శ్రీనివాసుణ్ణి నువ్వేదిక్కని వేడుకున్నాం.

ఆ మరునాడు నాన్న అనపర్తిలో ఉన్న కంటిఆసుపత్రికి వెళ్లారు. అప్పట్లో అనపర్తి కంటిఆసుపత్రి అంటే పెద్దపేరు. నాన్న వెళ్ళేసరికి రాత్రి పదిగంటలు అవడంతో, వైద్యుడుగారు మళ్లీ రేపే వస్తారని, అంతవరకూ హాలులో పడుకోండని నర్సు చెప్పడంతో ఆ రాత్రి అక్కడే ఉండిపోయారు. అప్పుడు నాన్న ఏడుస్తూ ఆపద్బాంధవా! అనాథరక్షకా! నీవే సర్వస్వమని నమ్మానే! ఇప్పుడు నా పిల్లల బ్రతుకెలా? అంటూ ఆ శ్రీని వాసుణ్ణి తలుచుకొంటూ పడుకొన్నారంట. అప్పుడు "ఎందుకలా బాధపడుతున్నావు? నేను లేనా? నేనున్నాగా!" అని తెల్లని



వస్త్రాలతో ఉన్న ఒకాయన వచ్చి చెపుతుంటే నాన్నకి ఒక్కసారిగా మెలకువ వచ్చి చూస్తే అది కల. ఇంతలో వైద్యుడుగారు వచ్చారని పిలిస్తే వెళ్లారంట నాన్న. గదిలో ఉన్న వైద్యుణ్ణి చూసి అలాగే ఉండిపోయారంట. ఎందుకంటే ఎవరైతే రాత్రి కలలో కనబడి "నేనున్నాను" అని చెప్పారో, ఆయన వైద్యుడుగారిలాగే ఉన్నారంట. కానీ, నాన్న ఇంతకుముందెన్నడూ ఆసుపత్రికి రావడంకాని, ఆయనను చూడటంకాని జరగలేదు. ఇదెలా సాధ్యమంటూ నాన్న ఆశ్చర్యంలో ఉండగానే, అన్నీ అడిగి, కళ్లు అవీ పరీక్షచేసి "నిన్నుచూస్తే చాలా బాధేస్తోంది. నీకు శస్త్రచికిత్స కూడా చేయలేము. ఏమో ఏదైతే అదౌతుంది. అంతా ఆ దేవుడిదయ. ఈ మాత్రలు పదిరోజులు వాడండి. కొంచెమైనా మార్పు కనిపిస్తే రా! లేకపోతే వద్దు అని చెప్పి పంపించేశారు. కానీ, నిన్నుమించిన వైద్యుడు ఎవరైనా ఉన్నారా! అంటూ నాన్నకి, ఆ ఆపదమ్రొక్కులవాడు చూపు ప్రసాదించడం జరిగింది. మాత్రలు వాడిన మూడురోజులకే తిరిగి మళ్లీ అతి చిన్నఅక్షరాలు కూడా కనబడడం జరిగింది.

చూశారా! ఆయనలీలలు. ఎంతచిత్రమో! ఏమి మాయో! నన్ను నమ్మిన నిన్ను వదిలేస్తానా? అంటూ ఆ వైద్యుడి రూపంలో కనిపించి, చూపుని ప్రసాదించి మా అందరి జీవితాలు నిలబెట్టిన ఆ దేవదేవుని ఏమని పొగుడుదును? ఎంతనిచెప్పను? ఎంతచెప్పినా తనివితీరని మహిమలే ఆయనవి.

*గోవిందా! గోవిందా!! గోవిందా!!!*

108 దివ్యదేశాలు 06

# తిరుప్పేర్‌నగర్ (కోవిలడి) (అప్పక్కుడత్తాన్)

– ఆచార్య చక్రవర్తి రంగనాథన్

**బృహద్పుర్యావాసీ హరిః అధిరసాపూపఘటవాన్**
**విమానం చాప్యైంద్రం భుజగపతిశాయీ కమలినీ**
**తథైవైన్ద్రీ సహ్యాచలభవా దివ్యతటినీ**
**సదా మాలారూపా ప్రణతవరదఃపశ్చిమముఖః**

108దివ్యదేశాల్లో శ్రీమన్నారాయణుడు భక్తులను అనుగ్రహించడానికై వేంచేసిఉన్నాడు. అట్టిదివ్యదేశాల్లో తిరుప్పేర్ నగర్ అనేది ఒక దివ్యదేశం. దీనికి కోవిలడి అనికూడా పేరు. కోవిల్ లేక కోయిల్ అంటేనే అందరికీ గుర్తుకొచ్చేది శ్రీరంగమే. అదేప్రకారం ఆ శ్రీరంగాన్ని పెరియకోయిల్ అనికూడా వ్యవహరిస్తారు. అట్టివైభవాన్ని కలిగిఉన్న శ్రీరంగక్షేత్రానికే ఒక ప్రధానభూమికగా విలసిల్లే ఉభయకావేరీమధ్యలో ఉన్న దివ్యదేశం ఈ కోవిలడి.

ఇచ్చట వేంచేసిఉన్న భగవంతుడికి అప్పాలరంగనాథ స్వామి అనే తిరునామం ఉంది. అత్యద్భుతమైనటువంటి ప్రకృతి సౌందర్యంతో దాదాపు మూడుఎకరాల్లో రెండుప్రాకారాలతో, మూడురాజగోపురాలతో అద్భుతమైన శిల్పకళతో అలరారుతోన్న దివ్యక్షేత్రమిది. తిరుప్పేర్‌నగర్ అనే ఈ క్షేత్రానికి పలుకారణాలు పలుఐతిహ్యాలుకూడా ఉన్నాయి. పేర్‌నగర్ అలాగే పెరునగర్, పెద్దనగరం అనేపేర్లు కూడా ఉన్నాయి. మహాలక్ష్మి భగవంతునితో పాలకడలిలో ఉన్నాకూడా ఆ లక్ష్మీవల్లభునికి భూమా దేవియందు ఒకవిధమైన ప్రేమ ఆదరాతిశయం ఉండటంచేత వరాహ, వామన, కృష్ణావతారాల్లో ఇవి వ్యక్తమవడంచేత అసూయకలిగి భూదేవివలే తనయందుకూడా భగవంతునికి అటువంటి అభిమానం కలగాలి అనే ఉద్దేశ్యంతో మహాలక్ష్మి ఈ స్థలానికి వచ్చి తపస్సు చేసిందట. లోకనాయకి ఐన మహా లక్ష్మితపస్సుకు మెచ్చిన పరమాత్మ తనముందు ప్రత్యక్షమై తన వక్షఃస్థలాన్ని మహాలక్ష్మికి నివాసస్థానంగా కల్పించాడట. అందు వల్ల ఈ దివ్యస్థలానికి తిరుప్పేర్‌నగర్ అనే పేరుకూడా వచ్చిందట.

ఈక్షేత్రంలో స్వామి భుజంగసాయిగా కాస్త అలా పక్కన పడుకొన్నట్లు ఒకవిధమైనభంగిమతో భక్తులను చూస్తూ చిరు నవ్వుతో ఉండేటట్లు తనయొక్క ఎడమచేతిని కాస్త పైకి ఉంచు కుని ఆహ్వానముద్రతో భక్తులను స్వాగతిస్తున్నట్లు స్వామి దర్శన భాగ్యాన్ని కలిగిస్తున్నాడు. ఇక్కడ భగవంతునియొక్క నాభిలో కమలం ఉండదు. అంచేత బ్రహ్మదేవుడు ఉండడు. బ్రహ్మ సత్యలోకంలో ఆరాధింపబడడంచేత ఈస్థలంలో బ్రహ్మదేవుడికి విగ్రహం ఉండదు. మహాలక్ష్మి భగవంతుని వక్షఃస్థలంలోను, భూమాదేవి స్వామిపాదాలచెంత ఉండి పూజ చేస్తున్నట్లున్నది. కావేరీనదీతల్లి ప్రతిరోజుకూడా స్వామికి పాదపూజచేస్తూంటు దట. ఈ స్వామికి అప్పాలరంగనాథన్ అని పేరు. మార్కండేయ మహర్షికూడా ఇక్కడ వేంచేసి ఉన్నారు.

పురాణాల్లో ఒకకథ ఉంది. పాండ్యరాజు ఉపరిశ్రవస్సు వేటాడుతూ ఒకఏనుగును చూశాడు. అప్పుడు ఆ ఏనుగు గౌతమ మహర్షి ఆశ్రమసమీపంలో ఉన్న ఒకకొలనుకు వెళ్లి అదృశ్య మైంది. రాజు బాణప్రయోగం చేశాడు. తర్వాత దగ్గరికి వెళ్లి చూడగా ఒకబ్రాహ్మణుడు మరణించి ఉండడం చూసి భయ పడ్డాడు. బ్రహ్మహత్యాదోషం తనకు అంటుకుంటుందని ఆ దోష నివారణకోసం అనేకదివ్యదేశాలు తిరిగాడు. అలా తిరుగుతూ ఈ తిరుప్పేర్‌నగర్ దివ్యదేశానికి వచ్చి చేరాడు.

ఈక్షేత్రానికి వచ్చినవెంటనే రాజుకు ఉపశమనం కలిగింది. పెద్దయాగాన్ని నిర్వహించదలచాడు. ఆయాగంలో అనేకమందియోగులు, మహర్షులు, బ్రాహ్మణులు అందరూకూడా పాలుపంచుకుంటున్నారు. అప్పుడే ఒక అద్భుతఘటన జరిగింది. ఒక వయోధికుడు చిక్కినశరీరంతో ఈరాజుదగ్గరికొచ్చి నాకు చాలా ఆకలిగా ఉంది ఏదైనా ఇవ్వమని అడిగాడు. అతణ్ణి చూస్తే పాపం ఎన్నినెలలుగా భోజనం చేయలేదో అని అనుకొని అతనికి అన్నంపెట్టాడు రాజు. అలాపెట్టిన తర్వాతే ఉపరిశ్రవస్సుకు చాలాకష్టాలు ప్రారంభమయ్యాయి. రాజు ఆ ఆహారాన్ని ఎంత ఇస్తున్నాకూడా అతనిఆకలి తీరలేదు. ఇంకాకావాలి.. ఇంకా



తిరుప్పేర్‌నగర్‌క్షేత్రాన్ని సందర్శిస్తే బ్రహ్మహత్యాదోషం పోతుందట!





కావాలి... ఇంకాకావాలి.... అని అడగ్గా ఆహారాన్నంతా కూడా అతనికే ఇచ్చేశాడు. కాని ఆవృద్ధుడుకి ఆకలి తీరలేదు. రాజు మళ్ళీమళ్ళీ ఆహారం చెయ్యమని చెప్పి ఎంత పెట్టినాకూడా అతని ఆకలి తీరలేదట. అప్పుడు రాజు, స్వామి! ఇక నావల్ల కాదు. మీఆకలి ఎలా తీరుతుంతో మీరే చెప్పండి అని ప్రార్థించాడు. అందుకు వయోధికుడు ఒక కుంభంనిండుగా అప్పాలను పెట్టు అన్నాడు. రాజు అలాగే ఒకకుంభంనిండుగా అప్పాలను సమర్పించగా అందునుండి ఒకేఒకఅప్పాన్ని తీసుకున్నతర్వాత తృప్తి చెందుతూ ఒక తేజోవంతమైనస్వరూపాన్ని ఆరాజుకి దర్శింపజేశాడట. సాక్షాత్తు దేవదేవుడే వచ్చాడని రాజు సంతోషపడ్డాడు. బ్రహ్మహత్యాదోషం తొలగింది. ఇలా అప్పాలను స్వీకరించాడు కనుక అప్పక్కుడత్తాన్ అనేపేరు ఆ స్వామికి కలిగింది.


ఇంకొక స్థలపురాణం ఉంది. ఉపమన్యు అనే ఒకరాజు ఈ భగవంతుణ్ణి సేవించుకుంటూ ఉండేసమయంలో దుర్వాస మహర్షి ఆ ప్రదేశానికి, వచ్చాడు. కానీ అతణ్ణి రాజు చూడలేదు. అందుకు దుర్వాసమహర్షి కోపంతో శాపమివ్వగా రాజు తన తప్పును మన్నించమన్నాడు. అందుకు దుర్వాసుడు తిరుప్పేర్‌నగర్ భగవంతుణ్ణి దర్శించుకో, ఒక నూరువేలమంది భాగవతులకు అన్నదానం చేస్తే నీ శాపం పోతుంది అని చెప్పాడు. భగవంతుడు అప్పాన్ని నైవేద్యంగా స్వీకరించినందువల్ల ఈ క్షేత్రంలో అప్పాలనివేదనం చేసి భక్తులకు ఇస్తారట. కమలవల్లితాయార్‌కు ఒకప్రత్యేకమైన సన్నిధి ఉంది. తిరుప్పేర్‌నగర్, కోవిలడి, అప్పాలరంగం అనేనామాలతో విలసిల్లే ఈక్షేత్రం పంచరంగ క్షేత్రాల్లో ఒకటిగా ఉంది. ఈ అత్యద్భుతమైన క్షేత్రాన్ని నమ్మాళ్వార్లు పరమపదప్రాప్తికొరకు వేడుకున్నారట.

తిరుప్పేర్‌నగర్‌క్షేత్రంలో భగవంతుడు అప్పాలరంగనాథం అప్పక్కుడత్తాన్ పశ్చిమాభిముఖంగా వేంచేసి ఉన్నాడు. భుజంగశయనుడు, అమ్మవారు కమలవల్లి, ఇందిరాదేవి, పుష్కరిణి ఇంద్రపుష్కరిణి, విమానం ఇంద్రవిమానం, ప్రత్యక్షం ఉపమన్యు, ఉపరిశ్రవసు, పరాశరుడు మొదలగువారు, తిరుమళిశైఅళ్వారు, నమ్మాళ్వార్, పెరియాళ్వార్, తిరుమంగైఆళ్వార్లు ఈ దివ్యదేశాన్ని కీర్తించి ఉన్నారు. పాంచరాత్రాగమోక్తంగా స్వామి పూజలను అందుకుంటున్నాడు. దాదాపు 24పాశురాలు ఈస్వామివారిపై కీర్తించబడిఉన్నాయి. మహాత్ముల ధ్యానశ్లోకాలు కూడా ఉన్నాయి.

ఇంద్రాఖ్యాయుత తీర్థ శోభిత తలే శ్రీ మత్తిరుప్పేర్ పురే
పశ్చాద్వక్త్ర యుతో భుజంగ శయనోహీంద్రాఖ్యవైమానగః।
ఆలింగన్ కమలోప పూర్వలతికా మప్పక్కుడుత్తాన్ విభుః
దృశ్యశ్చోపమనోః పరాశరమునే ర్విభ్రాజతే సర్వదా॥
భక్తిసార శఠారాతి కలిజిత్ రథయోగిభిః।
సంస్తుతః కుంభ సంరాజ ద్వామేతర కరాంబుజః॥

కమలవల్లినాయికాసమేతుడు అప్పక్కుడత్తాన్‌స్వామిని అందరూకూడా దర్శించుకుని తమ సమస్తపాపాలను పోగొట్టుకొని దేవదేవుని దివ్యఅనుగ్రహాన్ని పొందగలరు.

## విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



# మనిషి పోతే రాడు

కుండ పగిలె నేని కొత్తది గొనవచ్చు
భూతలంబునందు పొందుగాను;
కూలబడిననరుదు కుదురుట యరుదయా,
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** కుండ= పాత్ర; భూతలంబు= భూమి; పొందుగాను= అనుకూలంగా; కుదురుట= చక్కబడుట; అరుదు= దుర్లభం.

**భావం:** కుండ పగిలిపోతే కొత్తది కొనవచ్చు. అదే మనిషికూలిపోతే మళ్లీ కుదురుకోవడం దుర్లభం.

**వివరణ:** మట్టికుండ పగిలిపోతే ఇబ్బంది లేదు. పగిలిన కుండను సరిచేయడం సాధ్యంకాదు. కాని, దానిలాగ ఉపయోగపరచుకోవడానికి అలాంటిదో అంతకంటె మంచిదో కొత్తకుండ కొనుక్కో వచ్చు. కుండలేనిలోటు తీరిపోతుంది. కాని మనిషి చెడులక్షణాలకు అలవాటుపడి, భ్రష్టుడయితే, ఆనష్టం తీరదు. పగిలినకుండలాగానే చెడిపోయినమనిషికూడా ఎందుకూ పనికి రాడు. కొత్తకుండను కొనుక్కున్నట్లు అలాంటి కొత్తమనిషిని తెచ్చుకోలేం కదా. వాడే ఆచెడు గుణాలు విడిచి మంచివాడుగా మామూలు మనిషిగా, ఉపయోగపడేవాడుగా మారాలి. చెడిపోయినవాడు తిరిగి బాగుపడడం సాధారణంగా జరగదు. వాడు ఇంకా, ఇంకా నాశనం అవుతునే ఉంటాడు. మనిషి చెడుగుణాలకు లోనయి, పతనం చెందగూడదని తాత్పర్యం.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## భాస్కరశతకం

# ఒకే ఒక్కడు

ఒక్కడె చాలు నిశ్చల బలోన్నతుడెంతటి కార్యమైనదాఁ
జక్కనొనర్ప, కౌరవులసంఖ్యులు పట్టిన ధేనుకోటులం
జిక్కగనీక తత్రుబలసేన ననేక శిలీముఖంబులన్
మొక్కబడంగా జేసి తుది ముట్టడె యొక్క కిరీటి భాస్కరా

ఎంతకష్టమైన పనినయినా సాధించడానికి ఒక్కడు చాలు. ఆ ఒక్కడూ గొప్పబలవంతుడై ఉంటే సరిపోతుంది. వందమంది కలిసి పనిచేసినా, వాళ్ళలో బలంలేకపోతే ఎంతచిన్నపని ఐనా చేయలేరు. ఫలితం తీసుకురాలేరు. ఉదాహరణకు దుర్యోధనుడు మొదలైన వందమంది కౌరవులు, ద్రోణుడు మొదలైన మహావీరులు–అందరూ కలిసి విరాటమహారాజురాజ్యంలోని కోటానుకోట్లగోవులను పట్టుకొని తమదేశానికి తీసుకుపోతున్నారు. వీరాధివీరుడైన అర్జునుడొక్కడే వేలబాణాలువేసి అంతమందినీ ఓడించి గోవులనన్నింటినీ విరాటుడికి అందించాడు.



దీన్నిబట్టి ఏమర్థమయింది– శక్తిగలవాడు, బలం ఉన్నవాడు, ఒక్కడైనా వేలమందిని ఓడించి విజయం పొందుతాడు. ఒక్కయుద్ధం చేసేగాదు, ఏ కార్యాన్ని చేపట్టినా శక్తిసామర్థ్యాలు ఉంటే ఆ పనిని నిర్విఘ్నంగా పూర్తి చేయగలుగుతాడు. ధైర్యం, మేధావిత్వం అవసరం. కాబట్టి సాహసంతో ముందుకు దూకి, మధ్యలో పనిని ఆపకుండా తన శక్తినంతా ఉపయోగించి గెలుపొందడమే మనిషి చేయవలసినపని అని భాస్కరశతకం చెబుతోంది. ఆ నీతిని ఆచరించడమే బాలలపని.

– పి.ఉషాలక్ష్మి, 917569217199

# శ్రీకృష్ణామృతం

–"అనంత"(కృష్ణ సుందరి సత్తిరాజు),
8595587451

దశావతారకథనం సర్వజనవిదితం
దామోదర కృపాయుక్తం సకలశుభజనితం

అంచెలంచెలుగ పెరుగు అరాచకముల
అలసి ఓర్వలేని జనుల ఆవేదనలఆర్తి
అర్జీలయ్యవి నీ అవతారకారణములు
అవనినుదయించు నీ భవ్యకారుణ్యమూర్తి

అపహరించెను అసురుడు నాల్గువేదముల నొకప్పుడు
అమ్బుజుడు లిప్తకాలము నిద్రతూగినపుడు
అంతరాయము కలిగె సృష్టికార్యములకపుడు
అమ్బుజగర్భుని వేడే ఋషిపుంగవులపుడు
ఆదివిష్ణువు అవతరించే మత్స్యరూపుడై
అన్వేషించె స్మృతుల, అంతముచేసె సోమాసురునపుడు
ఆ పోరున పుట్టిన ప్రళయమ్మునుండి ధీరుడై
అఖిలప్రాణుల సజ్జనుల రక్షించె సవితృడై అపుడు

అసురపీడ అతిభయంకరమై బాధింప
అమరసిద్ధికై దేవతలు నినువేడగా
అమృతపానమే ఉపాయమని క్షీరసాగరమును మథియింప
ఆలానము వాసుకి మరి మంధరకవ్వముకాగా
అద్రిని వీపున మోయుచూ ఆదికూర్మరూప
అమరినావు కడవకు కుదురువోలె నీవు అంబుధి చిలకగా

ఆదిలక్ష్మి, అభిరూపుడు, ఐరావత, ఉచ్చైశ్రవములు
అప్సరసలు, కామధేనువు, కల్పవృక్షములుద్భవించెనొకటొకటిగా
అంకమునమృతభాండము, అణువణువుహొయలు
అతిమనోహరుడవై ముజ్జగములను ఏమార్చ జగన్మోహినిగా
అరుదెంచితివి అడుగకయే దేవతలకుకూర్చ కుశలములు
అట్టె పట్టితివి రాక్షసమాయను,
రాహుకేతువులను నియంత్రించితివిగా

అలవైకుంఠపురములో అమ్బుజాననను తోడ్కొని
అలుపెరుగక అనిశము జగతి పరిపాలించువేళను
అన్యులెవ్వరికి లేదు అనుమతియంచును
అబ్జయోనుసుతుల జయవిజయులు అడ్డగించేను
అపహాస్యము చేసిరి భటులు బాలురను కినుకకల్గగను
అలుక అగ్గిగ మారగ శాపమిడిరి సనత్కుమారులు వారికిని

ఆ శాపవశమున పుట్టే హిరణ్యాక్షుడు ఓనాడు
అడ్డుఅదుపును మరచే బ్రహ్మావరమున వాడు
అల్లకల్లోలము రేపి ధరిణిని సంద్రమున ముంచినాడు
ఆపదలు తీర్చ అవనినుద్ధరింప అరుదెంచే జగన్నాథుడు
ఆదివరాహమై తాను అవనిని కక్ష్యను చేర్చినాడు
అసురుని హతమార్చి పుడమిన ధర్మమును నిలపినాడు

అతిమతి హిరణ్యకశిపుడు! తనయుడు ప్రహ్లాదుడు
అనవరతము నీధ్యానమున మునిగి వివశుడైనాడు
అనఘుడై వాడు అతిబాధలకోర్చినాడు
అగ్నికదరలేదు రాక్షసకృత్యాల బెదరలేదు ఏనాడు
అన్యుల కసాధ్యములయ్యవి హరీ! నీభక్తుడు బాలుడు
అతి సులభసాధ్యములు వానికివి నిదర్శనములు మెండు

అధముడు హిరణ్యకశిపుడు సర్వాంతర్యామిని ఎరుగగలడే
అంతర్యామి అంటివి కలడా ఈ స్తంభమందునని మిడిసిపడే
అధివాసము స్వామికి విశ్వమున అణువణువు, నరసింహుడైవచ్చే
అసురుని గోళ్ళ చీల్చివేసే ఆదరమున ప్రహ్లాదుని చేరదీసే

అయిదవ అవతారము వామనుండు విశ్వవ్యాపకుడు
అడుగులు మూడు కావలెనన్న ఇచ్చచూపె వటుడు
అడుగు ఒకటికి భూమి, రెండు అంబరముగా వ్యాపించినాడు
అడుగు మూడుకు బలిశిరము తాకి పాతాళమునకంపినాడు

అరాచకములు పెచ్చుమీరే భువిని రారాజుల
ఆగడముల వారు అసురల మించె మిగుల
అధర్మమునకాయుష్షు కూడదు లోకన్యాయమటుల
అపరవీరుడై పరశురాముడు జనుల విడిపించె
క్షాత్రసంకెళుల

అత్యవసరమాయెను లోకమున మానవ
ధర్మములను చాట
అంగజుడుగ, అగ్రజునిగ, ఆర్యునిగ, అధిపతిగ, ఆప్తునిగ,
అప్పడుగ,
అడుగడుగున ప్రతిఅంశమున పురుషధర్మములకు
వేయ పెద్దపీట
అచ్యుతునిమించిన ఉపమానముండదని,
అవతరించే మాధవుండు మానవునిగ

అయోధ్యాపురసంజనిత రామా అగణితగుణ
నిధానరామా
అవనిజ హృదయనివాసరామా అంజనీపుత్ర
మనోనికటరామా
అహల్యాశాపవిమోచనరామ అనంతపరాక్రమ
మహావీరరామా
అసురరావణసంహరణరామ అశేషజనసమ్మోహన
సుశీలరామా

అవతార విశేషమా అది జగన్నాటకసూత్రధారీ
అందాలబాలునివా అతికుశలయోధునివా హరీ
అసలు నినుతెలియగలిగిన వారెవ్వరయా మురహరీ
అతి సాహసము నాది నిను వివరింపగ
నే బయలుదేరీ......
అసురవధకై వచ్చితివా అమ్మను చెర విడిపించగ
నెంచితివామరీ
అంబరమంత ప్రేమను అంతరంగమందు
ఇమడ్చ వచ్చితివా శ్రీహరీ
అమ్మప్రేమకు యశోదకు కానవు,
అతుల్యప్రేమల రాధమ్మకు కావు మురారీ
అటుకులప్రేమకల్లుకుపోతివి, ఆకు కేవలమా
తులసిపత్రమునకమ్ముడుపోతివా హరీ

ఆదిమధ్యాంతరహితుడవు అనంతుడవు నీవట
అఖిలభువనములు నీఆజ్ఞగా నిలచియుండునట
ఆదిత్యచంద్రులు నీ అక్షయుగళములట
అఖండభాస్కరులమించు నీ అనితరప్రభవతేజమట
అవ్యయుడవు నీవు అతులఅక్షయము నీకీర్తి
అతలవితల పాతాళముల అడుగడుగు వ్యాపించు
నీభుజకీర్తి

అర్జునుడు శ్రోతగా గీతబోధించిన జగద్గురువు నీవు
అంతర్యామి నీవు అంతరంగమందు శ్రీకృష్ణ నీవు
అవిరళపోరున హతులైరి అసురులు,
పుట్టినది మొదలు నీవు
అంతమొందించితివే కౌరవసేనను,
ఆయుధముపట్టకనే నీవు
అక్షరములకందని అనితరశక్తియుతుడవు
బ్రహ్మాండనాయకుడవు నీవు
అవ్యాజ్యఅనురాగమూర్తివై అనుంగుభక్తుల
కాపాడు దివ్యపెన్నిధినీవు

అంకుశములై బాధించునట రాబోవు కాలములు
కలియుగాంతములు
అవియే ఘడియలట నీ దశమఅవతారమునకు
శ్రీకల్కి పురుషా
అశ్వము దేవదత్తముపై చేపట్టి శివప్రదాతఖడ్గము
పలుఆయుధములు
అధర్మములనణచి మరల భువిభూతలస్వర్గముగ
చేతువట నీవు సర్వేశా

అంతులేని భ్రమలకు ఎడతెగని అగచాట్లకు
ఆలవాలము ఈ కలికాలము
అంధకారమే అన్నివైపుల అందరు మానవులకు
ఆలంబన లేక అసాధ్యము జీవనము
అగమ్యగోచరమగు జీవనయాత్రకు
ఆవలికట్టయే శ్రీవేంకటేశ్వరనామము
అడిగినదే తడవుగా సకలజనులకు
అన్ని సమకూర్చునదదియే గోవిందనామము

సర్వకామనపూరణదక్షా- సకలజనసర్వకాలసంరక్షా
సర్వసంకటపరిహర్తా- సకలమనోవికారసంహర్తా
సంకీర్తనాప్రియహర్షా- సంచితపాపసంకర్షా
సంకల్పమనోరథప్రదాత- సంశ్రయభక్త సరళముక్తిదాత
సంసారదుఃబాధిత భక్తజనోద్ధారణా-
సజ్జనసతతపరిరక్షణా శ్రీవేంకటరమణా

అన్ని అవతారముల ఆంతర్యమొక్కటే
అవనియందు ధర్మమె నిలచునెపుడు
అన్ని ఆలోచనలు వీడి చేయు కర్మమొక్కటే
అచ్యుతుడు అతడే, శరణు వేడు ఏవేళనెపుడు

# ఈ... అమావాస్యకి ఓ ప్రత్యేకతుంది!!

– డా॥ పి.లలితవాణి, 98490 26107

భాద్రపదమాసంలో కృష్ణపక్షాన్ని **మహాలయపక్షం** అంటారు. 'మహా' అంటే గొప్ప. 'లయం' అంటే వినాశనం. మహాలయమంటే గొప్ప వినాశనం. అదే మరణస్థితి. మరణించిన వారు పితృలోకం చేరుతారు కనుక దీనిని పితృపక్షం అనికూడా అంటారు. ఉత్తమకాలమైన ఉత్తరాయణం దేవతల కాలం. దక్షిణాయనం పితృకాలం. ఈపక్షంలో ప్రతిరోజూ శ్రాద్ధకర్మ చేయాలని, కనీసం ఒక్కరోజుఅయినా చేయాలనీ స్కాందపురాణంలోని నాగరఖండం చెప్తోంది.

ఎవరైనా తల్లిదండ్రులకు కానీ, వృద్ధులకుకానీ కష్టం కలిగిస్తే అనారోగ్యసమస్యలు వస్తాయి. దీనిని పితృదోషం అంటారు. దీనివలన రకరకాల కష్టాలు, విజయసాధనలో ఆటంకాలు, సంతానం కలగకపోవడంవంటివి కలుగుతాయి. అందుకని ప్రతిమనిషీ పితృఋణం తీర్చుకోవాలి. అలా చేస్తే మరణించిన పితరులకు తృప్తి, ముక్తి లభిస్తాయి. ఆ తృప్తితో పితరులు తమ వారసులను ఆశీర్వదిస్తారు. దానితో కష్టాలు దూదిపింజల్లాగా ఎగిరిపోతాయి. శుభాలు చేకూరుతాయి.

పితృఋణంనుండి విముక్తి పొందడం చాలా కష్టం. పిల్లలకోసం తల్లిదండ్రులు ఎంతగా తపిస్తారో ఎవ్వరూ మాటల్లో చెప్పలేనిది. అంత తపించేవారు మరణించిన తరువాత వారికి శ్రాద్ధకర్మలు చేయడం పిల్లలకు తప్పనిసరి విధి. భాద్రపద బహుళపాడ్యమినుండి అమావాస్యవరకు ఊర్ధ్వరశ్మినుండి పితృప్రాణం భూమిపైన వ్యాపించి ఉంటుంది. పితరులు మనో మయరూపంలో శ్రాద్ధకర్మస్థలాన్ని చేరుకుని, బ్రాహ్మణులతో పాటు వాయురూపంలో భోజనం చేస్తారు.

సూర్యుడు కన్యారాశిలో ప్రవేశించగానే పితరులు తమ పుత్ర పౌత్రాదులదగ్గరకు వస్తారు. శ్రాద్ధకర్మచేస్తే దీవిస్తారనీ, చెయ్యకపోతే శపిస్తారనీ పురాణాలు ఘోషిస్తున్నాయి. నిజానికి ప్రతి అమావాస్య– పితృతిథే అయినా మహాలయఅమావాస్యకి ప్రత్యేకత ఉంది. ఈ అమావాస్యనాడు చేస్తే– ఆయువు, విద్య, ధనం, సంతానంవంటి విశేష ఫలసిద్ధిని పొందుతారు.

ఈపక్షంలో పాడ్యమినుండి అమావాస్యవరకు ఒక్కొక్క రోజుకు ఒక్కొక్కవిశిష్టయోగాన్నిస్తుంది– శ్రాద్ధకర్మచేస్తే!

ఈ పదునైదురోజులూ శ్రాద్ధకర్మ నిర్వహిస్తే సకల యోగాలు ప్రాప్తించి, ముక్తిని పొందుతారు. "శ్రద్ధతో చేసేదాన్ని శ్రాద్ధం" అంటారు కాబట్టి పితృకార్యం ఏదో మొక్కుబడిగా కాకుండా శ్రద్ధతో చేయాలి. శ్రాద్ధకర్మలో నువ్వులు, బెల్లంతో చేసిన **అన్నం** సమర్పిస్తే ఆ దానం అక్షయమవుతుంది. ఈ పక్షంలో అన్ని దానాలకన్నా ఉత్తమోత్తమమైన **అన్నదానం** చేస్తే– అనంతకోటి యజ్ఞఫలితం ప్రాప్తిస్తుంది. అన్నదానవిశేషంలో కర్ణునిగురించిన ఒక చిన్న ఉదంతం ప్రచారంలో కనిపిస్తుంది.

**ఈ పక్షంలో పాడ్యమినుండి అమావాస్యవరకు శ్రాద్ధకర్మ చేస్తే విశేషఫలితాలనిస్తాయి. అవి...**




| | | | |
|---|---|---|---|
| పాడ్యమి | – ధనసంపద | నవమి | – అనుకూలదాంపత్యం |
| విదియ | – రాజయోగం | దశమి | – పశుసంపద |
| తదియ | – శత్రునాశనం | ఏకాదశి | – సర్వదానఫలం, పాపనాశం, వేదజ్ఞానం |
| చవితి | – ధర్మగుణం, ఇష్టకామ్యప్రాప్తి | | |
| పంచమి | – లక్ష్మీప్రాప్తి | ద్వాదశి | – జీవనపర్యంతం భోజనప్రాప్తి |
| షష్ఠి | – గౌరవలబ్ధి | త్రయోదశి | – ఆయురారోగ్యాలప్రాప్తి |
| సప్తమి | – పుణ్యప్రాప్తి | చతుర్దశి | – ప్రాణరక్షణ |
| అష్టమి | – బుద్ధిప్రాప్తి | అమావాస్య | – సమస్తసుఖప్రాప్తి |



అన్నదానంవల్ల అనంతకోటి యజ్ఞఫలితం ప్రాప్తిస్తుంది

## అన్నదానం గొప్పతనం..

ఊర్ధ్వలోకానికి పయనమైన కర్ణునికి ఆకలి, దప్పులు బాధించాయి. కనిపించిన చెట్టుకాయను కోసి తినబోయాడు. అంతే. చేతిలోని ఆ కాయ బంగారుకాయగా మారిపోయింది. తినడానికి వీలు లేకపోయింది. చెంతనే ఉన్న నదినీటిని తాగబోతే– దోసిలిలోని ఆ కాసినినీరూ బంగారమయింది. తాగలేకపోయాడు. ఆకలిదప్పులబాధతో తండ్రిఅయిన సూర్య భగవానుని ప్రార్థించాడు. వెంటనే ఆ ప్రత్యక్షనారాయణుడు ప్రత్యక్షమై "నాయనా! నువ్వు మహాదాతవు. నీవంటి దాత మరొకడు లేడు. ప్రాణత్యాగంకూడా చేసిన ఉత్తమదాతవు. ఎంతో విలువైన ధన కనక వస్తు వాహనాలనన్నిటినీ నిస్వార్థంతో దానం చేశావు. కానీ, ఎన్నడూ ఎవ్వరికీ అన్నదానం చేసి, ఆకలి తీర్చ లేదు. అన్ని దానాలలోకి అన్నదానమే మిన్న. అది నువ్వు చెయ్యలేదు కనుక ఈనాడు నీకీ బాధ తీరనిదిగా బాధిస్తోంది. వెనుదిరిగి భూలోకం చేరి కొంతకాలం అన్నదానం చేస్తే అప్పుడు ఊర్ధ్వలోకానికి చేరగలుగుతావు" అని బోధించి దీవించాడు. తండ్రిమాటను పాటించి కర్ణుడు భూలోకం చేరి– పక్షంరోజులపాటు అన్నార్తులకు అన్నంపెట్టి, వారి ఆశీస్సులు పొంది, తరించి ఊర్ధ్వలోకం చేరుకున్నాడు. కర్ణుడు అన్నదానం చేసిన ఈ పక్షాన్నే మనం నేటికీ మహాలయపక్షం అంటున్నాం. అన్నదానం అంత గొప్పది. "ఒకరి కడుపు నింపి, నీ కడుపు నింపుకో" అన్నదే నేటికీ లోకనీతి. విశేషించి మహాలయ అమావాస్యనాడు తప్పనిసరిగా శ్రాద్ధకర్మతోపాటు అన్నదానం చేయాలి. అంత ఆర్థికస్థితి లేనివారు గోవుకు గ్రాసం పెట్టి, నమస్కరించి, పితరులను తృప్తిపరచవచ్చు– అన్నది పురాణోక్తి.




ఈ పక్షంలో పితృనమస్కారాలు చాలాముఖ్యం. పర లోకంలో పితరులకేకాక చేసినవారికికూడా ఉత్తమగతులు సిద్ధిస్తాయి. పితృకార్యం– దైవకార్యంతో సమమని పంచమ వేదమైన మహాభారతం స్పష్టం చేస్తోంది. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తులు– అన్నీ పితృకార్యప్రాశస్త్యాన్ని చాటి చెప్తున్నాయి.

సాక్షాత్తు సృష్టికర్త బ్రహ్మదేవుడే బృహద్ధర్మపురాణంలో పితృస్తుతిని చేసి, మనకందించాడు.

"నమో పిత్రే జన్మదాత్రే సర్వదేవ మయాయచ
సుఖదాయ ప్రశంసాయ సుప్రీతాయ మహాత్మనే"

### వైకుంఠపాళి
### :: 80 – సమాధానాలు ::


| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 వ | కు | 2 ళ | మా | లి | | 3 హ | | 4 ప |
| రా | | క | | | | రి | | ద్మా |
| 5 హ | స్తి | | 6 భీ | ము | డు | | 7 సే | వ |
| స్వా | | 8 శ | | ని | | 9 భృ | | తి |
| 10 మి | థి | లు | డు | | 11 నృ | గు | డు | |
| | | డు | | 12 ఉ | | వు | | 13 వృ |
| 14 శే | షి | | 15 ఇ | ష | ము | | 16 త్వి | ష |
| షా | | 17 ల్చ | | | | 18 క్తి | | భా |
| ద్రి | | 19 కొ | ల్లా | పు | ర | ము | | ద్రి |


చిత్ర కథ

# శ్రీకృష్ణుని అపూర్వమైత్రి

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.ద్వారకనాథ్

ద్వారకకి దూరంగా ఒకగ్రామంలో సుదాముడు అనే బ్రాహ్మణుడు ఉన్నాడు. అతనిని కుచేలుడు అనికూడా పిలుస్తారు. శ్రీకృష్ణుని బాల్యమిత్రుడైన సుదాముడు నిరుపేద. అతనిభార్య వామాక్షి. వాళ్ళకి చాలామంది పిల్లలు పుట్టారు.






లోకాః సమస్తాః సుఖినో భవన్తు

బాలనీతి

# మా అమ్మ చెప్పింది!!


– శ్రీ ద్రోణంరాజు రామకృష్ణ

పూర్వం శివపురం అనే గ్రామంలో దమయంతి, దేవయ్య అనే దంపతులుండేవారు. వీరికి తన కుమారుడు రంగణ్ణి చదివించాలనే కోరిక కలిగింది. ఈ గ్రామానికి 5 క్రోసులదూరంలో రామాపురఅగ్రహారం ఉంది. ఆ గ్రామంలో విష్ణుశర్మ అనే పండితుడు కొంతమంది విద్యార్థులకు పాఠాలు చెప్పేవాడు. దేవయ్య రంగణ్ణి ఆయనవద్దకు తీసుకువెళ్లి విద్యను నేర్పమని అడిగాడు. అలాగే అంటూ రోజూ ఈ రెండుకొండల మధ్యనుండి వచ్చి వెళ్లాలి అని చెప్పాడు.

ఇంటికి వచ్చి తన భార్య దమయంతికి ఈ విషయం చెప్పి బాధపడ్డాడు. ఈమెకు కృష్ణుడుపై అపారమైన భక్తి, విశ్వాసం ఉండేవి. అందువల్ల, కృష్ణుడిపైనే భారంమోపి కుమారునికి రంగా! నీకు ఎప్పుడైనా భయంగా అనిపిస్తే 'గోపాలంఅన్నయ్యా!' అని పిలువు అని ధైర్యం చెప్పి పంపింది. అలా కొంతకాలం గడిచింది.

ఒకరోజు, చీకటిపడేవరకు గురువుగారివద్దనే ఉండి ప్రొద్దుపోయిన తర్వాత రంగడు తన ఇంటికి బయలుదేరాడు. కొండవద్దకు వచ్చేసరికి అమ్మ చెప్పిన మాటలు గుర్తు చేసుకొని, గోపాలంఅన్నయ్యా! అని పిలవగానే కృష్ణుడు పశువులకాపరి వేషంలో వచ్చి రంగణ్ణి దిగబెట్టి వెళ్లాడు. అలా రోజులు గడుస్తు న్నాయి. రంగడు బాగా చదువుకుంటున్నాడు.

ఒకరోజు రంగడితో గురువుగారు రేపు శ్రీసత్యనారాయణస్వామివ్రతం ఉంది. కావున, నీవు పాలు పట్టుకొనిరావాలి సుమా! మరచిపోవద్దన్నాడు. అలాగే అంటూ ఇంటికి వెళ్లి అమ్మా! రేపు మా గురువుగారు పాలు తెమ్మన్నారని చెప్పాడు. మనకు పాలు ఎలా వస్తాయిరా అంది తల్లి. అమ్మా గోపాలం అన్నయ్య ఉన్నాడు గదా! రోజూ ఆ కొండలమధ్య పశువులు కాస్తున్నాడు. నన్ను దిగబెట్టి వెళ్తున్నాడని రంగడు అన్నాడు. అది విని వాళ్లఅమ్మ చాలా ఆశ్చర్యపోయింది. అలాగైతే ఒక్కసారి అన్నయ్యను తీసుకురారా అంది. అలాగే, ఈ రోజే రమ్మంటాను అని చెప్పి రంగడు బయలుదేరి, గోపాలం అన్నయ్యతో మా గురువుగారికి పాలు కావాలన్నాడు. అందుకు కృష్ణుడు ఒక కావడిలో రెండుచిన్నకుండలనిండుగా పాలుఇచ్చి మీ గురువు గారికి ఇవ్వమన్నాడు. ఆ పాలు పట్టుకొని గురువుగారికి ఇవ్వగా, ఆయన తనభార్య సుమతిచేతికిచ్చి ఇవి వేరేపాత్రలలో పోసి, ఈ పాత్రలు పట్టుకొనిరా! అన్నాడు. ఆమె పాత్రలన్నింటా పాలతో నింపింది. కాని, పాలకుండలు మాత్రం పాలతో నిండు గానే ఉన్నాయి. ఆమె ఆశ్చర్యపోయి విష్ణుశర్మగారిని లోపలికి పిలిచి చూపించింది. అక్షయపాత్రలుగా గుర్తించి ఇవి నీకు ఎవరిచ్చారని రంగణ్ణి అడగ్గా మా గోపాలంఅన్నయ్య ఇచ్చాడు అని గురువుగారికి చెప్పాడు.



అప్పుడు మీ అన్నయ్యని చూపిస్తావా? అని అడిగాడు రంగణ్ణి. అందుకు రంగడు సరే అని గోపాలంఅన్నయ్యా అని పిలిచాడు. రాలేదు. మరలా మరలా పిలిచాడు. రాలేదు. ఆ తర్వాత గోపాలన్నయ్య వచ్చి రంగా! అమ్మని చూడాలని ఉంది అన్నాడు. ఇద్దరుకలిసి ఇంటికివచ్చారు. అమ్మా! నీవు కోరుకున్నట్లు మనఇంటికి గోపాలంఅన్నయ్య వచ్చాడన్నాడు. అమ్మ చాలా ఆనందపడి పాయసం ఇచ్చి తినమన్నది. తృప్తిగా తిన్నారిద్దరూ. అమ్మ నమ్మకం వమ్ము కాలేదు. రంగడు చదువు పూర్తి అయిన తర్వాత దమయంతి, దేవయ్య దంపతులు ఆనందంగా కాలం గడుపుతూ శ్రీకృష్ణుణ్ణి మరవకుండా పూజిస్తూ మోక్షప్రాప్తి పొందారు.



శ్రీకృష్ణుణ్ణి నిత్యమూ స్మరిస్తే మోక్షప్రాప్తి సిద్ధిస్తుంది

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

నిర్వహణ: శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి

## కదంబం

### దశోపనిషత్తులు

01) ఈశోపనిషత్తు
02) కేనోపనిషత్తు
03) కఠోపనిషత్తు
04) ప్రశ్నోపనిషత్తు
05) ముండకోపనిషత్తు
06) మాండూక్యోపనిషత్తు
07) తైత్తిరీయోపనిషత్తు
08) ఐతరేయోపనిషత్తు
09) చాందోగ్యోపనిషత్తు
10) బృహదారణ్యకోపనిషత్తు

## పిల్లలూ..జతచేయండి!!

| | |
|---|---|
| 1) ధర్మరాజు | అ) హంసధ్వజము |
| 2) భీముడు | ఆ) శరభధ్వజము |
| 3) అర్జునుడు | ఇ) సింహధ్వజము |
| 4) నకులుడు | ఈ) కపిధ్వజము |
| 5) సహదేవుడు | ఉ) చంద్రధ్వజము |

జవాబు: 1-(ఉ); 2-(ఇ); 3-(ఈ); 4-(ఆ); 5-(అ)

## చెప్పండి చూద్దాం!



ఈ బొమ్మలకు 'ఉ' అనే అక్షరంతో మొదలయ్యే పదాలను రాయండి!










1) ..................... 2) ..................... 3) ..................... 4) .....................

జవాబు: 1)ఉడుత 2)ఉంగరం 3)ఉత్తరం 4)ఉపాధ్యాయుడు

## కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

క ప ప చే ని క్తి తిం తి హ లే
డి ష్ట య ని వ్య డి కి క్కు దు నే

జవాబు: కష్టపడి పనిచేయని వ్యక్తికి తిండి తినే హక్కు లేదు

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

తిరుమల తిరుపతి దేవస్థానములు
సప్తగిరి మాసపత్రిక

# క్విజ్ 02

01) తిరుమలఆలయంలో పూజావిధానం పేరు?
జ) ............

02) 'వామనుడు' మరో నామధేయం?
జ) ............

03) 'మహాలయం'కు అర్థం?
జ) ............

04) 'మయూరధ్వజుడు' కుమారుడి పేరు?
జ) ............

05) తిరుమలస్వామి గర్భాలయం చుట్టూ ఉన్న చిన్న ప్రదక్షిణ మార్గానికి గల పేరు?
జ) ............

06) 'తోమాలసేవ'కు మరోపేరు?
జ) ............

07) తొండమాన్‌చక్రవర్తి రాజ్యం పేరు?
జ) ............

08) గరుత్మంతుని తల్లిపేరు?
జ) ............

09) శ్రీవేంకటేశ్వరస్వామి అవతారనక్షత్రం పేరు?
జ) ............

10) 'వల్మీకం'కు అర్థం?
జ) ............

11) పన్నెండురాశుల్లో 'ఆరవరాశి' ఏది?
జ) ............

12) 'విశ్వదాభిరామ' మకుట పద్యకవి?
జ) ............

13) మహా+ఉత్సవం= ఏ సంధి?
జ) ............

14) భోగశ్రీనివాసమూర్తివిగ్రహాన్ని బహూకరించిన పల్లవరాణి?
జ) ............

15) భగవద్గీత 'ప్రథమాధ్యాయం' పేరు?
జ) ............

16) తిరుమలలో 'పేటెంట్' పొందిన ప్రసాదంపేరు?
జ) ............

17) ఆరవ వైష్ణవదివ్యక్షేత్రం పేరు?
జ) ............

18) 'ఇతనికంటె ఘనులిక లేరు' సంకీర్తన పాడిందెవరు?
జ) ............

19) 'ధ్వజారోహణం' వ్యతిరేకపదం?
జ) ............

20) తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయగోపురవిమానం పేరు?
జ) ............

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) క్విజ్ జవాబులను, ప్రశ్నలక్రింద నిర్దేశించిన స్థలంలోనే రాసి పంపాలి.

04) క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పరిగణించబడవు.

05) సమాధానాల్లో ఎలాంటి కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండ కూడదు.

06) జవాబులు చేరాల్సిన చివరితేది 25-09-2022.

07) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన బాలబాలిక లలో ముగ్గురిని మాత్రం విజేతలుగా లక్కీడిప్‌ద్వారా ఎంపిక చేస్తాం.

08) విజేతలపేర్లు వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

09) తి.తి.దే. ప్రధాన సంపాదకులవారి కార్యాలయంలో పని చేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

10) క్విజ్‌కు సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వ బడదు.

11) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో రాయకూడదు.

12) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరిమాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమా ధానపత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా రాసి పంపాలి.

చందాసంఖ్య: ............ వయస్సు: ............
పాఠశాల: ............ తరగతి: ............
పేరు: ............
చిరునామా: ............
............
............
............ పిన్‌కోడ్: ............
ఫోను నెంబరు: ............

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక,
తి.తి.దే. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507.
తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

# సెప్టెంబరు, 2022 రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** ఉద్యోగవిషయాల్లో ముందంజవేస్తారు. ప్రమోషన్లు కలసివస్తాయి. ఇతరులశ్రమను తేలికగా తీసుకోవటం మంచిదికాదు. ధన ధాన్యాది వస్త్రలాభాలు, కార్యజయం కల్గుతాయి. శుభకార్య విషయమై ధనం ఖర్చుచేస్తారు.



**వృషభం–** వాగ్ధాటి పెరుగుతుంది. ధనలాభం. వృత్తివ్యాపారాలు కలసివస్తాయి. ధైర్యంగా వ్యవహరించి ఆర్థికకార్యకలాపాలు సాగిస్తారు. ఉష్ణసంబంధకఫాదిదోషాలకు వైద్యసహాయం అవసరమౌతుంది. యత్నకార్యసిద్ధి కల్గుతుంది.



**మిథునం–** ఆదాయవ్యయాలు సమపాళ్లలో ఉంటాయి. కుటుంబవిషయాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మంచినిర్ణయాలు తీసుకుంటారు. క్లిష్టసమస్యలు ఎదురైనా ధైర్యంగా వ్యవహరించి జయిస్తారు. ఆత్మస్థైర్యం పెరుగుతుంది.



**కర్కాటకం–** కోపతాపాలకు పోవడంవల్ల మనస్తాపం, చికాకులుగా ఉన్ననూ క్రమేపీసమస్యలకు సరైన పరిష్కారందొరికి ప్రతికూలతను అధిగమిస్తారు. స్థిరాస్తులను మార్చుటవల్ల లాభపడతారు. వ్యాపారలావాదేవీలు అనుకూలం.



**సింహం–** ఆర్థికవిషయాలు అనుకూలం, బంధుమిత్రసఖ్యత, నూతనవ్యూహాలతో విజయం, సంపదసృష్టి, ఆనందం, రాజకీయంగా ముందంజ వేస్తారు. ఇతరులకు ఉపకారం చేయటంలో ముందుంటారు.



**కన్య–**గోచారస్థితి అనుకూలంగా ఉంది. ధనాదాయమార్గాలు మెరుగవుతాయి. ఆకస్మికధనలాభాలు వరిస్తాయి. గురుబలం ఉంది. ఎంతటి కార్యాన్నైనా అవలీలగా సాధిస్తారు. జన్మరాశిలో వ్యవహారప్రతిబంధకాలు క్రమేపీ తొలగుతాయి.



**తుల–** గ్రహస్థితి అనుకూలంగా ఉంది. సమస్తైశ్వర్యాలు వృద్ధి చెందుతాయి. సంతానంవిషయంలో ముందంజ. వృత్తివ్యాపారాలు అనుకూలం. మనస్తత్వంలో హెచ్చుతగ్గులను సరిచేసుకుని సాఫీగా నడిచే మార్గాన్ని అవలంబించటం మంచిది.



**వృశ్చికం–** సంతానంవిషయంలో విద్యాఉద్యోగ అవకాశాలు కలసివస్తాయి. ధైర్యం. పట్టుదలతో కార్యాచరణ. సరైననిర్ణయాలు తీసుకోవటానికి మంచిసమయం. వృత్తివ్యాపారాలు అనుకూలం. విద్యావిషయంలో ప్రగతి కనబడుతుంది.



**ధనుస్సు–** నిర్మాణాలపై దృష్టిసారిస్తారు. కొత్త వ్యాపారసంస్థలవృద్ధి జరుగుతుంది. గురుభక్తి, సత్సాంగత్యంలేర్పడతాయి. యోగాభ్యాసం మొదలగువిషయాల్లో దృష్టిని పెడతారు. గృహనిర్మాణాల విషయంలో శ్రద్ధవహిస్తారు.



**మకరం–** దైవబలం పెరుగుతుంది. ఆత్మవిశ్వాసం కనపడుతుంది. విద్యార్థులు విద్యలో రాణిస్తారు. గతకాలంగా జన్మరాశిలో శనైశ్చరుని సంచారం వల్ల ఇబ్బందులు క్రమేపీ తొలగుతాయి.



**కుంభం–** ఆరోగ్యవిషయాలు మిశ్రమంగా ఉంటాయి శరీరఆరోగ్యం బాగుంటుంది. పశుసంపదవృద్ధి అవుతుంది. దైవసంబంధకార్యాల్లో పాల్గొంటారు. ఇతరులకు ఇచ్చిన ధనం చేతికి అందడంవల్ల ఊరట కల్గుతుంది.



**మీనం–** ఆరోగ్యవిషయాలపై దృష్టి సారించటం మంచిది. శరీరం కాంతివంతంగా ఉంటుంది. ముఖవర్చస్సు పెరుగుతుంది. జన్మగురుని తృతీయ కుజుని ప్రభావంవల్ల ఆరోగ్యం వెంటనే మెరుగవుతుంది. బుద్ధిమాంద్యం తగ్గుతుంది. ధనానికి లోటుండదు.

నిరంతర దైవధ్యానమే అన్ని సంకటాలను తొలగిస్తుంది

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1. పేరు మరియు చిరునామా :**
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పని సరి)

సెల్ నెం.

**2. కావలసిన భాష :**

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3. సంవత్సర చందా : ☐ రూ.240/-**

జీవిత చందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4. చందా పునరుద్ధరణ :**

(అ) చందా నెంబరు :

(ఆ) భాష :

**5. చెల్లించిన మొత్తం :**

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

తేది :

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా (12 సం॥రాలు) రూ.2400/-లు; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 80



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

## అడ్డం

1)శ్రీవేంకటేశ్వరునిమెడలో పూలహారంగా మారిన భక్తురాలు(5); 5)ఇతని పేరుతో హస్తినాపురం నిర్మింపబడింది (2); 6)శ్రీవేంకటేశ్వరునికి బంకమట్టితో పూలుచేసి అర్పించిన భక్తుడు(3); 7)'భక్తి'కి మరోపదం(2); 10)జనకునిపేరు(4); 11)వైవస్వతునిపుత్రుడు(3); 14)శేషునిపై శయనించే విష్ణువును ఇలా అంటారు(2); 15)శ్రీవారిబ్రహ్మోత్సవాలు జరిగే మాసం(3); 16)కిరణము(2); 19)లక్ష్మికి విష్ణువుపై కోపము వచ్చి ఈ పురానికి వెళ్ళింది(5)

## నిలువు

1)ముందుగా ఈ స్వామిని దర్శించినతర్వాతే శ్రీవారిని దర్శించాలి(5); 2)కర్దమప్రజాపతి కూతురు (క్రిందనుంచి పైకి)(2); 3)శ్రీవేంకటేశ్వరుడుగా అవతరించిన వైకుంఠనాథుడు(2); 4)ఆకాశరాజు కుమార్తె(4); 8)శ్రీవారి బ్రహ్మోత్సవాలను నిర్వహించే బ్రహ్మలోకాధిపతి(3); 9) విష్ణుమూర్తి వక్షఃస్థలాన్ని తన్నిన మహర్షి(3); 12)బాణాసురుని కుమార్తె(2); 13)త్రేతాయుగంలో వేంకటాచలానికి గల పేరు(4); 14)ఈ అద్రిపై ఉన్న పుట్టలో శ్రీనివాసుడుండెను(3); 17)'కొలుచు'- ఈపదాన్ని ఇలా కూడా రాయవచ్చు(2) (క్రిందనుండిపైకి(2); 18)శ్రీవేంకటేశ్వరుని నమ్మినవానికి శ్రీవారు ఇచ్చునది(క్రిందనుండి పైకి)(2)

**జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.**

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.




17-07-2022న తిరుమలలో వైభవంగా నిర్వహించబడిన ఆణివర ఆస్థాన మహోత్సవ కార్యక్రమం.
ఇందులో పాల్గొన్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి దంపతులు మరియు ఇతర ప్రముఖులు





05-08-2022న తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి వైభవంగా
నిర్వహించిన శ్రీవరలక్ష్మీవ్రత కార్యక్రమ దృశ్యమాలిక




తిరుమలలో 01-08-2022న పునఃప్రారంభించబడిన అఖండ హరినామసంకీర్తనా యజ్ఞ కార్యక్రమం.
ఈ కార్యక్రమానికి జ్యోతిప్రజ్వలన చేస్తున్న
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్., మరియు ఇతరులు

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-08-2022 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

27-09-2022
మంగళవారం
రాత్రి
పెద్ద శేషవాహనం

